ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 07.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 227 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

వరుసగా రెండో టీ20 గెలిచిన టీమిండియా 12

సహజంగా కాంగ్రెస్ కు పడే ఓట్లు, మజ్లిస్ ఓట్లు, అధికార పార్టీ కావడంతో వచ్చే అదనపు ఓట్లు కలుపుకొని ఆ పార్టీకే కొంత మొగ్గుందని సర్వేలలో తేలిందని సమాచారం. మాగంటి సునీత భర్త మరణించడంతో పోటీలో ఉన్నందున అందుకు మహిళల సానుభూతి ఓట్లు పడే అవకాశం ఉందని కూడా పలువురు చెబుతున్నారు. హైదరాబాద్ లో సీఎం రేవంత్ ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయారంటూ కేటీఆర్ చేస్తున్న ప్రచారం ఆ పార్టీకి కలిసివస్తుందని భావిస్తున్నారు. వాస్తవానికి ఇప్పటి వరకు ప్రధాన సంస్థలు చేసిన సర్వేలు, సర్వేలలో కాకలు తీరిన సంస్థలు చేసిన సర్వేలో కాంగ్రెస్ అగ్రస్థానంలో ఉండడం విశేషం.

ఉప ఎన్నికలో కాంగ్రెస్ దూకుడు

క్రమంగా బలం పుంజుకుంటున్న పార్టీ

- అధికారంలో ఉండడం కలిసి వచ్చే అంశం
- నవీన్ యాదవ్ కు పెరుగుతున్న ఆదరణ
- ప్రధాన కేంద్రాలలో ఫలిస్తున్న మంత్రుల కృషి
- షేక్ పేట, యూసుఫ్ గూడలో సానుకూల పవనాలు
- కలివిడిగా తిరుగుతున్న కాంగ్రెస్, మజ్లిస్ శ్రేణులు
- కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్న అంతర్గత సర్వేలు
- ప్రధాన సంస్థల సర్వే ఫలితాలు కూడా 'హస్తం' వైపే
- రెండు రోజుల క్రితం వరకు ఉన్న జోరు తగ్గిన కారు
- ఇటు సీఎం రేవంత్, అటు కేటీఆర్ విస్తృత ప్రచారం
- గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రెండు పార్టీలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 6: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రస్తుతానికి కాంగ్రెస్ దూకుడు మీద ఉంది. ఉప ఎన్నిక తేదీ దగ్గర పడుతున్న కాంగ్రెస్ బలం పుంజుకుంటోంది. ఇక్కడ 11వ తేదీన పోలింగ్ జరుగనుంది. 14న ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. కాంగ్రెస్ తరఫున యువకుడు, విద్యావంతుడు అయిన నవీన్ యాదవ్, బీఆర్ఎస్ తరఫున దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత, బీజేపీ తరఫున లంకల దీపక్ రెడ్డి పోటీలో ఉన్నారు. నియోజకవర్గంలో రోజుకో సంస్థ సర్వే పేరుతో ఫలితాలు ప్రకటిస్తున్నాయి. ఒక మీడియా కాంగ్రెస్ గెలుస్తుందని చెబుతుంటే, మరో పార్టీ బీఆర్ఎస్ గెలుస్తుందని చెబుతున్నాయి. దీంతో ఎవరి సర్వేను నమ్మాలో అర్థంకాక ప్రజలంతా అయోమయంలో ఉన్నారు. వాస్తవానికి ఇక్కడ ఎన్నికల హడావుడి ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. ఎప్పటిలాగే పోలింగ్ శాతం కూడా అత్యంత తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పోలింగ్ శాతం తక్కువగా ఉంటే కాంగ్రెస్ పార్టీకి మేలు

..:: మిగతా 2లో

బిహార్ పోలింగ్ ప్రశాంతం

తొలి దశలో 64.46 శాతం నమోదు

- 121 స్థానాలలో ముగిసిన ఓటింగ్
- సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింపు
- ఓటు వేసిన సీఎం నితీశ్, డీసీఎం విజయ్ సిన్హా
- సిన్హా వాహనాన్ని అడ్డుకున్న ఆర్జేడీ శ్రేణులు
- వెంటనే పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిన్హా డిమాండ్
- ఎన్డీయేదే తిరిగి అధికారమన్న నితీశ్ కుమార్
- ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న లాలూ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

పాట్నా, నవంబర్ 6: బిహార్‌లో తొలి విడత పోలింగ్ గురువారం నాడు చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం ఆరు గంటల వరకు 64.46 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల సంఘం ప్రకటించింది. వివిధ పార్టీలకు చెందిన రాజకీయ ప్రముఖులు పోలింగ్ మొదలు కాగానే ఓటు వేశారు.లఖిసరాయ్‌లో ఉప ముఖ్యమంత్రి విజయకుమార్ సిన్హా వాహనాన్ని ఆర్జేడీ శ్రేణులు అడ్డుకోవడంతో కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. 18 జిల్లాలలోని 121 స్థానాలలో ఉదయం ఏడు గంటలకు మొదలైన తొలి దశ పోలింగ్ సాయంత్రం ఆరు గంటలకు ముగిసింది. భద్రతా కారణాలతో ఐదు నియోజకవర్గాలలో ఐదు గంటలకే ఓటింగును ఆపేశారు. బిహార్ సీఎం నితీశ్ కుమార్ భక్తియార్‌పుర్‌లో ఓటు వేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం తిరిగి అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్, బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్, ఆయన సతీమణి మాయాశంక పాట్నాలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా లఖిసరాయ్‌లో ఓటు వేశారు. కేంద్రమంత్రి,

..:: మిగతా 2లో

గగన్ యాన్‌కు రెడీ అవుతున్న భారత్

ఆరు దశాబ్దాల భారత అంతరిక్ష పరిశోధనలలో అత్యంత ముఖ్యమైన ఘట్టం మొదలు కాబోతోంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చేపట్టిన మానవ సహిత అంతరిక్ష మిషన్ గగనయాన్ ప్రాజెక్టులో తొలి అడుగు వచ్చే నెలలోనే పడబోతోంది.

11

హైకోర్టులో సిద్ధరామయ్యకు ఎదురుదెబ్బ

ప్రభుత్వ సంస్థలలో ప్రైవేట్ సంస్థల కార్యాకలాపాలను పరిమితం చేస్తూ కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై గతంలో ఆ రాష్ట్ర హైకోర్టు ధార్వాడ్ సింగిల్ జడ్జి బెంచ్ స్టే ఇచ్చింది.

11

సర్వేలు ఏవీ నమ్మదగినవి కావు

- బీఆర్ఎస్, కాంగ్రెస్ చేసిందేమీ లేదు
- అభివృద్ధిని వారు నిర్లక్ష్యం చేశారు
- నగరంలో కనీస మౌలిక వసతులు లేవు
- కేంద్రం హైదరాబాద్ అభివృద్ధికి సహకరిస్తోంది.
- 'మీట్ ద ప్రెస్' లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 6: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి అనేక సర్వేలు జరుగుతున్నాయి కానీ, అవి ఏవీ నమ్మదగినవి కావని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆయన గురువారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన 'మీట్ ద ప్రెస్'లో మాట్లాడారు. 2014 నుండి 11 సంవత్సరాల పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారన్నారు. వారంతా అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. నియోజకవర్గంలోని అనేక బస్తీలలో 365 రోజులు పొంగిపొర్లే డ్రైనేజీలు, వెలగని వీధి దీపాలు, పరిశుభ్రమైన తాగునీరు లేకపోవడం వంటి సమస్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. హైదరాబాద్‌ను సింగపూర్, ఇస్తాంబుల్‌గా మార్చుతామని బీఆర్ఎస్ హామీ ఇచ్చారని, కొన్ని రోడ్లకు రంగులు వేసి అదే అభివృద్ధి అని చూపించారని విమర్శించారు. బీజేపీ కార్పొరేటర్లు ప్రశ్నిస్తే స్పందన లేదని, పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని, వారు తమ బిల్లుల కోసం ధర్నాలు

..:: మిగతా 2లో

'టోపీ' పెట్టుకునే రోజు వస్తే తల నరుక్కుంటా

బోరబండ ఎన్నికల సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నేను హిందువును, టోపీ పెట్టి, దొంగ నమాజ్ చేసి ఇతర మతాలను కించపర్చను. టోపీ పెట్టుకునే రోజు వస్తే తల నరుక్కుంటానంటూ' వ్యాఖ్యానించారు.

..:: 5లో

ఆసిమ్ మునీర్ చరిత్రలోనే క్రూర నియంత

పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్‌పై ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మునీర్ పాకిస్తాన్ చరిత్రలోనే అత్యంత క్రూర నియంత అని, మానసికంగా స్థిరత్వం లేని వ్యక్తి అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

..:: 11లో

ప్రాణాలు తీసిన చీమల భయం

- మైర్మెకోఫోబియాతో బాధ పడిన వివాహిత
- ఎన్ని ఆస్పత్రులు తిరిగినా కనిపించని ఫలితం
- ఉరి వేసుకుని ఆత్మహత్య
- చీమలతో బతకలేక పోతున్నాని సూసైడ్ నోట్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్

నవంబర్ 6: చీమల ఫోబియాతో బాధపడుతున్న ఓ వివాహిత ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సూసైడ్ నోట్ ప్రకారం, ఆమె చీమల ఫోబియా కారణంగానే ఆత్మహత్యకు పాల్పడినట్టు

..:: మిగతా 2లో

ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

ప్రియుడితో కలిసి భర్తను చంపి, మృతదేహాన్ని ఇంట్లోనే పాతి పెట్టింది. భర్త కనిపించడంలేదని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పోలీసులకు దృశ్యం సినిమాను చూపించింది.

11

షట్‌డౌన్ ఎఫెక్ట్‌తో కీలక నిర్ణయం

షట్‌డౌన్‌తో లక్షలాది మంది అమెరికన్ల జీవితాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. దేశంలోని పలు విమానాశ్రయాలపై తీవ్ర ప్రభావం పడిన విషయం తెలిసిందే.

11

అబద్ధాలు చెప్పడంలో బీఆర్ఎస్, బీజేపీ పోటీ

- అప్పుడు సాధ్యం కానిది ఇప్పుడు అవుతుందా?
- బీజేపీ పాలిత రాష్ట్రాలలో సన్నబియ్యం ఇస్తున్నారా?!
- ఉప ఎన్నిక ప్రచారంలో మంత్రి 'పొంగులేటి'
- రహమత్ నగర్ లో పార్టీలో భారీ చేరికలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 6: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు తథ్యమని తెలిసి బీఆర్ఎస్, బీజేపీ లేనిపోని అబద్ధాలతో ప్రజలను మభ్యపెడుతున్నాయని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రహమత్‌నగర్ డివిజన్‌లో వివిధ పార్టీలకు చెందిన వందలాది మంది నాయకులు గురువారం మంత్రి పొంగులేటి సమక్షంలో, రహమత్ నగర్ డివిజన్ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి కాంగ్రెస్ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక కాంగ్రెస్ అభివృద్ధి, సంక్షేమానికి, బీఆర్ఎస్ అబద్ధాలకు మధ్య జరుగుతున్న యుద్ధమని అన్నారు. గత పదేండ్లలో ఈ నియోజకవర్గాన్ని గాలికి వదిలేసిన బీఆర్ఎస్ ఇప్పుడు వేలాది కోట్లు

..:: మిగతా 2లో

రాజకీయం

'రామోజీ' అవార్డుల ప్రదానోత్సవాని రండి

- సీఎం రేవంత్ రెడ్డికి ఎండీ కిరణ్ ఆహ్వానం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6 : రామోజీ గ్రూప్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్ కుమార్ గురువారం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం నాడు మర్యాద పూర్వకంగా కలిసారు. 'రామోజీ గ్రూప్ ఫౌండేషన్ డే' వేడుకలలో భాగంగా ఈ నెల 16న ఏర్పాటు చేసిన 'రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల' ప్రదానోత్సవ కార్యక్రమానికి సీఎంను ఆహ్వానించారు. కిరణ్ ఆహ్వానానికి సీఎం సానుకూలంగా స్పందించారు.

473 మంది కారుణ్య అభ్యర్థులకు నియామకాలు

- కొత్తగూడెంలో పంపిణీకి సింగరేణి ఏర్పాట్లు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6 : సింగరేణిలో మెడికల్ పూర్తి చేసి ఇప్పటివరకు నియామక పత్రాలు పొందని దాదాపు 473 మంది కారుణ్య అభ్యర్థులు ఈ నెల 12వ తేదీన కొత్తగూడెంలో నియామక పత్రాలు అందుకోనున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తారు. ఇందుకోస్ ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ గారి కృషి ఫలితంగా ఈ కార్యక్రమం జరగనుంది. సింగరేణి కంపెనీలో ఎన్నో నెలలు గా పెండింగ్‌లో ఉన్న ఈ నియామక పత్రాల జారీ కోసం జనక్ ప్రసాద్ నిరంతరం యాజమాన్యం మరియు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన ఫలితంగా ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా సింగరేణి వ్యాప్తంగా 473 మంది కార్మిక కుటుంబాలు న్యాయం పొందనున్నాయి.

4 కోట్ల విలువ చేసే భూమి సర్కారుకు అప్పగింత

- వ్యవసాయ శాఖకు రిజిస్ట్రేషన్ చేసిన కోదండరెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6 : ఇచ్చిన మాట ప్రకారం రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి తన సొంత భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేశారు. ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం ఆయన అధికారికంగా ఈ ప్రక్రియను పూర్తి చేశారు. రెండు నెలల క్రితమే తన సొంత గ్రామం యాచారం గ్రామంలోని నాలుగు కోట్ల విలువ చేసే రెండు వేల గజాల స్థలాన్ని, అందులో వున్న భవనాన్ని వ్యవసాయశాఖకు రాసివ్వనున్నట్లు ప్రకటించారు. యాచారం మండలంలోని రైతులు పండించే ఉత్పత్తుల నిల్వ, ఇతర వ్యవసాయ పరికరాలు, పనిముట్లు పెట్టుకోడానికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. శాశ్వతంగా రైతులకు ఉపయోగకరంగా ఉండాలంటే, దీనిని ప్రభుత్వానికి రాసిస్తే బాగుంటదనే ఆలోచనతో కోదండరెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గతంలోనే ఈ విషయాన్ని స్వయంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కలిసి వివరించారు. దానికి సంబందించిన అధికారికంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ రోజు ముగిసింది. ఈ ప్రక్రియలో వ్యవసాయ శాఖ తరుపున రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉషా, ఏడీఏ సుజాత, ఏవో రవినాధ్, కమిషన్ అధికారి హరివెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

ఏ నోట విన్నా నవీన్ యాదవ్ పేరే!

- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విస్తృత ప్రచారం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6 : మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం గడపగడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ నోటా నవీన్ యాదవ్ పేరే వినిపిస్తోందని అన్నారు. మోతీనగర్. శాస్త్రీనగర్, ఓల్డ్ అండ్ న్యూ. ఎర్రగడ్డ డివిజన్లలో ఆమె ప్రచారం నిర్వహించారు. ప్రతి కాలనీలో కలియదిరుగుతూ కాంగ్రెసు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సోషల్ మీడియాలో ఎన్ని అసత్య ప్రచారాలు చేసిన జూబ్లీహిల్స్ ప్రజల మధ్య నవీన్ యాదవ్ పుట్టి పెరిగి వ్యక్తిని కష్టకాలంలో చేసిన సహాయాన్ని గుర్తు చేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరి నోట నవీన్ యాదవ్ పేరు వినిపిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్స్, డివిజన్ ప్రెసిడెంట్స్, మహిళా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో అవినీతి, అరాచకం

- ప్రశాంత హైదరాబాద్ కోసం కాంగ్రెస్ గెలవాలి
- మధురానగర్ ప్రచారంలో మంత్రి 'తుమ్మల'

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6 : గత ప్రభుత్వంలో అవినీతి అరాచకం రాజ్యమేలాయనీ మంత్రి తుమ్మల మండిపడ్డారు. గురువారం నాడు వెంగళరావు డివిజన్ మధురానగర్ లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రగతిశీల ప్రశాంత హైదరాబాద్ కోసం జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీనీ గెలిపించాలని కోరారు. ఉప ఎన్నిక జూబ్లీ హిల్స్ కే పరిమితం కాదని, రాష్ట్ర భవిష్యత్ ను నిర్దేశించే చారిత్రక తీర్పు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇతర పార్టీలకు చెందిన పలువురు మంత్రి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రామ్ దాస్ నాయక్, చిన్న శ్రీశైలం యాదవ్ సినీ నటుడు సుమన్ స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలో కాంగ్రెస్ దూకుడు

మొదటిపేజీ తరువాయి

జరగుతుందనే అంచనా ఉంది. కొన్ని ప్రధాన మీడియా సంస్థలు జూబ్లీహిల్స్ లో ఓటర్ల మనోగతాన్ని తెలుసుకునేందుకు అంతర్గతంగా సర్వే నిర్వహించాయి. ఈ సంస్థలు తమ ఫలితాలను బయటకు ప్రకటించే పరిస్థితి ఉండదు. కానీ, గెలుపోటములను, రాజకీయ స్థితిగతులను అంచనా వేసుకునేందుకు సొంతంగా సర్వే నిర్వహించుకుంటాయి. వాటి నివేదికల ప్రకారం ఇక్కడ కాంగ్రెస్ పార్టీకే మొగ్గు ఉందని సమాచారం. షేక్ పేటలో కార్మిక మంత్రి వివేక్ వెంకటస్వామి, యూసుఫ్ గూడలో బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రచారం చేస్తున్నారు.

ఇప్పుడు మజ్లిస్ కోరిక మేరకే

కాంగ్రెస్ తరఫున పోటీచేస్తున్న నవీన్ యాదవ్ గతంలో మజ్లిస్ తరపున పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. ఇప్పుడు మజ్లిస్ కోరిక మేరకే రేవంత్ నవీన్ ను ఎంపిక చేశారనే అభిప్రాయం ఉంది. అందుకే మజ్లిస్ పార్టీ నేతలు ప్రచారంలో శక్తివంచన లేకుండా తిరుగుతున్నారు. ఇటు సీఎం రేవంత్, అటు కేటీఆర్ విస్తృత ప్రచారాలు నిర్వహిస్తున్నారు. సెటిలర్ల ఓట్ల కోసం మైత్రీవనం చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. సెటిలర్లకు బీఆర్ఎస్తోనే భరోసా అంటూ కేటీఆర్ సభలు, సమావేశాలలో చెబుతున్నారు. మరోవైపు మజ్లిస్ ఓటింగ్ కాంగ్రెస్ కే ఉంటుందని మజ్లిస్ అగ్రనేత అక్బరుద్దీన్ ఓవైసీ స్పష్టంగా చెప్పడం కూడా కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా మారిందంటున్నారు. సహజంగా కాంగ్రెస్ కు పడే ఓట్లు, మజ్లిస్ ఓట్లు, అధికార పార్టీ కావడంతో వచ్చే అదనపు ఓట్లు కలుపుకొని ఆ పార్టీకే కొంత మొగ్గుందని సర్వేలలో తేలిందని సమాచారం. మాగంటి సునీత భర్త మరణించడంతో పోటీలో ఉన్నందున అందుకు మహిళల సానుభూతి ఓట్లు పడే అవకాశం ఉందని కూడా పలువురు చెబుతున్నారు. హైదరాబాద్ లో సీఎం రేవంత్ ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయారంటూ కేటీఆర్ చేస్తున్న ప్రచారం ఆ పార్టీకి కలిసివస్తుందని భావిస్తున్నారు. వాస్తవానికి ఇప్పటి వరకు ప్రధాన సంస్థలు చేసిన సర్వేలు, సర్వేలలో కాకలు తీరిన సంస్థలు చేసిన సర్వేలో కాంగ్రెస్ అగ్రస్థానంలో ఉండడం విశేషం.

ప్రాణాలు తీసిన చీమల భయం

మొదటిపేజీ తరువాయి

పోలీసులు నిర్ధారించారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని శర్వా హోమ్స్‌లో శ్రీకాంత్, మనీషా (25) అనే దంపతులు తన కుమార్తెతో పాటు నివసిస్తున్నారు. మనీషా గత కొంతకాలంగా చీమలంటే తీవ్ర భయంతో (మైర్మెకోఫోబియా) బాధపడుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు మనీషా కుటుంబ సభ్యులు అమెను ఎన్నో హాస్పిటల్‌కు తిప్పారు. చాలా చోట్ల చికిత్స కూడా తీసుకున్నారు. కౌన్సెలింగ్ ఇప్పించారు. కానీ, ఎలాంటి ఫలితం లేకపోయింది. దీంతో తీవ్ర మనస్తాపంతో మనీషా మంగళవారం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. సాయంత్రం విధుల నుంచి ఇంటికి వచ్చిన భర్త బెడ్‌రూమ్ లోపలి నుంచి గడియపెట్టి ఉండడం గమనించి స్థానికుల సహాయంలో డోర్‌ను బద్దలకొట్టాడు. లోపలికి వెళ్లి చూడగా రూమ్‌లో భార్య ఫ్యాన్‌కు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించింది. అది చూసి భర్త కన్నీరుమున్నీరుగా విలపించాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. బాడీ పక్కనే ఉన్న సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ నోట్‌లో 'శ్రీ, ఐయాం సారీ, ఈ చీమలతో బతకడం నావల్ల కావట్లేదు. అన్విని జాగ్రత్తగా చూసుకో, అన్నవరం, తిరుపతి, ఎల్లమ్మ మొక్కులను తీర్చండి' అని రాసుకొచ్చింది. ఈ నోట్ చదివిన కుటుంబ సభ్యులు కన్నీరు పెట్టుకున్నారు.

బిహార్ పోలింగ్ ప్రశాంతం

మొదటిపేజీ తరువాయి

ఎల్జేపీ రామ్ విలాస్ పార్టీ చీఫ్ చిరాగ్ పాశవన్ ఖగారియాలో ఓటు వేశారు. మాజీ సీఎం, ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్, ఆయన సతీమణి రబ్రీదేవి, కుమారుడు, మాజీ మంత్రి తేజస్వీ యాదవ్ పాట్నాలో ఓటు వేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన లాలా బిహార్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. జన్‌శక్తి జనతాదళ్ జాతీయ అధ్యక్షుడు,లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ కూడా పాట్నాలోనే తన ఓటును వినియోగించుకున్నారు.

ఉప ముఖ్యమంత్రి కాన్వాయ్ పై దాడి

కాగా, లఖిసరాయ్‌లో ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా ఓటు వేసి వెళుతుండగా ఆయన వాహనాన్ని పలువురు ఆర్జేడీ మద్దతుదారులు అడ్డుకున్నారు. ఆయన కారుపై చెప్పులు, పేడ విసిరారు. విజయ్ సిన్హాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఉప ముఖ్యమంత్రి అక్కడి నుంచే ఎస్పీకి ఫోన్ చేశారు ఆర్జేడీ కార్యకర్తలు ఇక్కడ ఓటర్లను బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అదనపు బలగాలను పంపించాలని ఆదేశించారు. అత్యంత వెనుకబడిన వర్గాల ప్రజలు ఓటు వేయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. తన వాహనంపైనా దాడి చేశారని, వారందరి మీదా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్జేడీ అధికారంలో లేకుంటేనే పరిస్థితి ఈవిధంగా ఉందని, అధికారంలో ఉంటే ఇంకా పరిస్థితులు ఎంత దారుణంగా ఉంటాయో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. అయితే, సిన్హా ఆరోపణలను ఆర్జేడీ నేత అజయ్‌కుమార్ సింగ్ తోసిపుచ్చారు. ఓడిపోతానన్న భయంతోనే విజయ్‌కుమార్ తమపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

అబద్ధాలు చెప్పడంలో బీఆర్ఎస్, బీజేపీ పోటీ

మొదటిపేజీ తరువాయి

ఖర్చు చేశామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అప్పుడు సాధ్యం కానిది ఇప్పుడు అవుతుందా? అని ప్రశ్నించారు. రెండేండ్లలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిలో భాగంగా ఇప్పుడు నియోజకవర్గంలో దాదాపు 400 కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయని, 14వేల కొత్త రేషన్ కార్డులు వచ్చాయని, ఎనిమిది వేల మంది పేర్లు రేషన్ కార్డులలో చేరాయని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. తెలంగాణలో పంపిణీ చేస్తున్న సన్నబియ్యంలో సగం ఖర్చు కేంద్రానిదే అని కిషన్ రెడ్డి చెబుతున్నారని, మరి బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఎందుకు సన్నబియ్యం ఇవ్వడం లేదని మంత్రి ప్రశ్నించారు.

సర్వేలు ఏవీ నమ్మదగినవి కావు

మొదటిపేజీ తరువాయి

చేయాల్సిన పరిస్థితి వచ్చిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. నగరంలోని ప్రధాన పౌర సంస్థలు జీహెచ్ఎంసీ, హైదరాబాదు మెట్రో వాటర్ బోర్డు వంటి సంస్థలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో అనేక విభాగాలు కూడా లేవని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ వెనుకబడి పోయిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన ఆరు గ్యారంటీల గురించి ఎక్కడా ప్రస్తావించటం లేదన్నారు. అటు వ్యక్తిగత విమర్శలకే పరిమితమైన రేవంత్ రెడ్డి, కేవలం మజ్లీస్ మెప్పు పొందడం కోసం మాత్రమే పని చేస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఎక్కడ?

'బీఆర్ఎస్ వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినట్టు చెబుతోంది కానీ,అభివృద్ధి ఎక్కడుంది? గ్రామ, మండల స్థాయి అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాలలో ఎన్ని హామీలు నెరవేర్చింది? 2024 డిసెంబర్ లోపు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి మాట తప్పింది. జాబ్ క్యాలెండర్ ఎక్కడ? మహిళలకు ఇస్తామన్న రూ.2,500 సహాయం ఎక్కడ? పావుల వడ్డీ రుణాలు, తులం బంగారం హామీ ఎక్కడ మాయమైంది? నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.4,000 నిరుద్యోగ భృతి ఏమైంది? ఈ ప్రశ్నలకు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. కొత్త పెన్షన్లు ఎందుకు ఇవ్వడం లేదు? పెన్షన్‌ను రూ.4,000కు పెంచుతామని చెప్పిన హామీ ఏమైంది? జూబ్లీహిల్స్ అభివృద్ధికి బీజేపీ ఒక్కటే ప్రత్యామ్నాయం. కరోనా సంక్షోభం నుండి సుమారు 80 కోట్ల మంది పేద ప్రజలకు మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు ఉచితంగా బియ్యాన్ని అందిస్తున్నారు. 'కాంగ్రెస్ పార్టీ ఓడిపోతే సన్న బియ్యం రావు' అంటూ ఓటర్లను భయపెట్టడం ఎంతవరకు సమంజసమో ముఖ్యమంత్రి ఆలోచించాలి. కాంగ్రెస్ పార్టీ ప్రతి సమస్యకు పరిష్కారంగా కేవలం ఉచిత బస్సు ప్రయాణాన్ని మాత్రమే చూపుతోంది' అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

భారీ మౌలిక వసతుల కల్పనకు

'హైదరాబాద్‌లో కేంద్రం భారీ మౌలిక వసతుల కల్పనకు దోహదం చేస్తోంది. హైదరాబాద్ అభివృద్ధికి అనేక సహాయ సహకారాలు అందిస్తోంది. ముఖ్యంగా, రీజినల్ రింగ్ రోడ్డు, మొదటి దశ నిర్మాణానికి రూ. 15,627 కోట్ల అంచనాతో డీపీఆర్ తయారైంది. కేంద్ర కేబినెట్ దీనిని త్వరలో ఆమోదించనుంది. అంబర్‌పేట ఫ్లైఓవర్: రూ. 410 కోట్లు.ఉన్నల్ ఎలివేటెడ్ కారిడార్: రూ. 627 కోట్లు. ఆరంఘర్ 6లైన్ రోడ్డు: రూ. 387 కోట్లు. కూకట్‌పల్లి బీహెచ్ఈఎల్ ఫ్లైఓవర్: రూ. 136 కోట్లతోనే, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి, 46 శాతం పనులు పూర్తయ్యాయి' అని కిషన్ రెడ్డి వివరించారు. చర్లపల్లి రైల్వే స్టేషన్: రూ. 430 కోట్లతో నిర్మించామన్నారు. నాంపల్లి రైల్వే స్టేషన్: రూ. 350 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ సిటీ అభివృద్ధికి మరియు తెలంగాణలో అనేక సంస్థల స్థాపనకు కృషి చేస్తోందని చెప్పారు. 'మీట్ ద ప్రెస్' కు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు.

రైతులకు ముందుగానే ఎరువులు ఇవ్వాలి

- యాసంగి సీజన్ పంపిణీపై మంత్రి తుమ్మల సమీక్ష

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6 : యాసంగి సీజన్ కు ఎరువుల సరఫరాల గురించి వ్యవసాయశాఖ అధికారులతో మంత్రి తుమ్మల గురువారం నాడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గోపి మాట్లాడుతూ యాసంగి సీజన్ కోసం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 1.45 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ, 7 లక్షల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 0.65 లక్షల మెట్రిక్ టన్నులు ఎమ్ఓపీ, 0.60 లక్షల మెట్రిక్ టన్నుల ఎస్ఎస్పీ ఎరువులను రాష్ట్రానికి కేటాయించారని అన్నారు. మంత్రి ఆదేశాలతో రాష్ట్రానికి కేటాయించిన 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో 6 లక్షల మెట్రిక్ టన్నులను అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలలో నెలకు రెండు లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున సరఫరా చేయాల్సిందిగా కోరామని, దానికి తగ్గట్లుగా నిరంతరము సంబంధిత అధికారులతో సంప్రదిస్తూ రాష్ట్రానికి రావాల్సిన ఎరువులను ముందుగానే తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కేంద్రం కేటాయించిన ఎరువులను 60 నుంచి 70 శాతం అక్టోబర్, నవంబర్, డిసెంబర్ లలో సరఫరా చేసినట్లయితే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉంటుందని అన్నారు. కేటాయించిన ఎరువులలో 70 శాతం ముందస్తుగా తెప్పించుకున్నట్టయితే, తరువాత నిరంతరం వచ్చే ఎరువులతో కలిపి రైతులకు అవసరమున్నంత మేరకు, ఏదైతే గత యాసంగి, అంతకుముందు వానాకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయగలిగామో అలానే ఈ యాసంగిలో కూడా చేయవచ్చని అధికారులకు సూచించారు.

“



ఫైల్స్ క్లియరెన్స్‌లో అలసత్వం జరుగుతోంది. మంత్రులు, అధికారులు తమ పనిలో కమిట్‌మెంట్ చూపించాలి. కొంతమంది మంత్రులు, అధికారుల పనితీరు సంతృప్తికరంగా లేదు. వారు ధోరణి మార్చుకోవాలి. ప్రజలకు సమయానికి సేవలు అందించడమే ప్రభుత్వ బాధ్యత. అందరం బాధ్యతగా పనిచేయాల్సిందే.

- ఏపీ సీఎం చంద్రబాబు

రోజుకు 2.4 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి

- అదే సమయంలో రవాణా పూర్తి చేయాలి
- భారీ వర్షా ల వల్ల జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాలి
- ప్రత్యేక సమీక్షలో సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6 : ఈ యేడాది కురిసిన భారీ వర్షాల వల్ల తొలి అర్థ సంవత్సరంలో అన్ని విభాగాలలో కొంచెం వెనకబడి ఉన్నామని, ఇప్పుడు వర్షాలు తగ్గినందున ఉత్పత్తిని గణనీయంగా పెంచి లోటును భర్తీ చేసుకొని లక్ష్యాలు సాధించాలని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ ఏరియా జనరల్ మేనేజర్లకు పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో ఆయన ఉత్పత్తి, రవాణా వంటి అంశాలను సమీక్షించారు. ఈ నెలలో సాధించాల్సిన 72 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యానికి గాను రోజుకు 2 లక్షల 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి రవాణా సాధించాలని సూచించారు. రోజుకు కనీసం 13 లక్షల 75 వేల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాల్సి ఉంటుందని ఆదేశించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి కోసం అందరూ సమష్టిగా పని చేయాలని అన్నారు. మైనింగ్ తో పాటు పర్సనల్, రక్షణ, తదితర అధికారులు కూడా ఒక్క ఫైల్ కూడా పెండింగ్ లో లేకుండా అన్ని పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో అలసత్వాన్ని సహించేది లేదన్నారు. సింగరేణి సంస్థను సంపూర్ణంగా ప్రమాదరహిత కంపెనీగా రూపుదిద్దాలని నిర్ణయించుకున్నామని, కానీ గత ఏడాది దురదృష్టవశాత్తు మూడు మరణాలు సంభవించాయన్నారు. ఈ యేడాది ఒక్క మరణం కూడా జరగకుండా ప్రమాదాలను నివారించడానికి అందరు అధికారులు కృషి చేయాలి అన్నారు. ముఖ్యంగా భూగర్భ గనులలో తనిఖీలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, ఎం. తిరుమలరావు, ఈడీ బి. వెంకన్న, అటవీ సలహాదారు మోహన్ పరిగెన్, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ మార్కెటింగ్ టి. శ్రీనివాస్ ఇంకా జీఎంలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా యాక్ట్

- ఈ అసెంబ్లీ సమావేశాలలోనే బిల్లు
- కార్మిక, ఉపాధి శాఖల మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6 : గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా ఒక యాక్ట్ తీసుకురాబోతున్నామని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. ఈనెల 12న జరగబోయే క్యాబినెట్ సమావేశంలో గిగ్ వర్కర్ల బిల్లు ఆమోదం పొందనుందని వెల్లడించారు. రాహుల్ గాంధీ ఆలోచనలలో భాగంగా తీసుకువస్తున్నామన్నారు. క్యాబినెట్ ఆమోదం తర్వాత బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడతామన్నారు. సచివాలయంలో ఆయన గురువారం గిగ్ వర్కర్లతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు. గిగ్ వర్కర్లకు కొత్త చట్టం ద్వారా భద్రత, హక్కులు సామాజిక రక్షణ కల్పించబోతున్నామన్నారు. కొత్త చట్టం ఎలా ఉపయోగపడుతుంది, ఎలాంటి మార్పులు లేదా చేర్పులు అవసరమో కూడా ప్రభుత్వం సమగ్రంగా పరిశీలిస్తుంది. గిగ్ వర్కర్ల భవిష్యత్తు భద్రపరచడంతో పాటు వారికి స్థిరమైన హక్కులు అందించేందుకు చర్యలు తీసుకుంటాం అని మంత్రి వివేక్ వెంకటస్వామి గారు పేర్కొన్నారు.

చేవెళ్ల రోడ్డు బాగు చేయాలని ధర్నా

- 25 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6 : చేవెళ్ల రోడ్డు బాగు చేయాలంటూ ధర్నా చేసిన 25 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రజారవాణాకు ఇబ్బంది కలిగించారని, అనుమతి లేకుండా ధర్నా చేశారని పోలీసులు తెలిపారు. పోలీసుల తీరుపై బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీర్జగూడ వద్ద ఆర్టీసీ బస్సు-లారీ ఢీకొని 19 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 25 మంది తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు బాగు చేయాలని ధర్నా చేసిన స్థానికులపై కేసు నమోదు చేయడంపై చేవెళ్ల ప్రజలు నిప్పులు చెరుగుతున్నారు. బస్సు ప్రమాద ఘటనను హెచ్ఆర్సీ సుమోటోగా స్వీకరించింది. డిసెంబర్ 15వ తేదీ లోపు నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించింది. రవాణా శాఖ, హోమ్ శాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసింది. జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారిని, రంగారెడ్డి కలెక్టర్, ఆర్టీసీ ఎండీని నివేదిక పంపాలని హెచ్ఆర్సీ ఆదేశించింది.

కత్తిపోట్లకు గురైన యువకుడు రోషన్ మృతి

- ప్రధాన నిందితుల అరెస్టు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6 : జగద్గిరిగుట్టలో కత్తిపోట్లకు గురైన యువకుడు రోషన్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా బాలశౌరిరెడ్డి అనే రౌడీ షీటర్ కత్తితో దారుణంగా పొడిచాడు. ఓ ట్రాన్స్ జెండరుకు రోషన్ కు మధ్య డబ్బుల పంచాయితీ ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై బాలానగర్ ఠాణాలో ట్రాన్స్ జెండర్ ఫిర్యాదు చేయడంతో రోషన్, అతని స్నేహితుల మీద కేసు నమోదు అయింది. కాగా, కేసు పెట్టడానికి బాలశౌరి రెడ్డి కారణం అని రోషన్ అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో అతడిని చంపుతానని రోషన్ బెదిరించడమే కాక, జగద్గిరిగుట్టలో రోషన్ పై బాలశౌరి రెడ్డి కత్తితో దాడి చేసాడు. ప్రధాన నిందితుడు రౌడీ షీటర్ బాలశౌరా రెడ్డి (21) తోపాటు సహకరించిన ఇద్దరు నిందితులు సయ్యద్ మహ్మద్ (28), రేవో ఆదిత్య(26)ను అరెస్టు చేశామని బాలానగర్ డీసీపీ కోటి రెడ్డి తెలిపారు. దాడిలో తీవ్రంగా గాయపడి మరణించిన రోషన్ కుమార్ సింగ్ (22) గతంలో పలు కేసులలో నిందితుడుగా ఉన్నాడు. ఇతని పై బాలానగర్ పోలీస్ స్టేషన్ లో రౌడీ షీట్ ఉందని వివరించారు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు.

7న పోలవరం అథారిటీ సమావేశం

- ముఖ్యమైన అంశాల మీద కీలక చర్చ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6 : పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ 17వ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సెంట్రల్ వాటర్ కమిషన్ హాలులో పీపీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల నీటిపారుదల శాఖల అధికారులు, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రతినిధులు హాజరు కానున్నారు. పీపీఏ మెంబర్ సెక్రటరీ ఎం. రఘు రామ్ ఇప్పటికే సభ్యులకు అజెండాను అందించారు. ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ అధికారులు పోలవరం ప్రాజెక్టు పురోగతి, 202526 వర్కింగ్ సీజన్ యాక్షన్ ప్లాన్ వివరించనున్నారు. లెఫ్ట్ మెయిన్ కెనాల్ సంబంధిత ప్యాకేజీల పురోగతి, తాజా పరిస్థితుల గురించి చర్చించనున్నారు. కన్స్ట్రక్షన్ స్టేజ్ కోసం త్రిసభ్య కమిటీ రూపొందించిన ఎంఓ ను ఈ సమావేశంలో ఆమోదించనున్నారు. కాగ్ ఆడిట్ అభ్యంతరాల నేపథ్యంలో 41.15 మీటర్ల నీటి నిల్వకు సంబంధించిన మార్పులు చేర్పులు చేసి కేంద్రం ఆమోదానికి పంపనున్నారు. సమావేశంలో తెలంగాణతో అంతర్రాష్ట్ర వివాదాలు, సబ్మెర్జెన్స్, డ్రైనేజీ కంజెషన్, భద్రాచలంమణుగూరు ప్రొటెక్షన్ వంటి అంశాలపై కూడా చర్చించనున్నారు. 27 కొత్త పోస్టుల నియామకాలకు ఆమోదం తెలుపనున్నారు.

జర్నలిస్టుల సమస్యలను సత్వరం పరిష్కరించాలి

- ప్రభుత్వం విస్మరిస్తే ఆందోళన బాట తప్పదు
- స్పష్టం -టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6: గత ప్రభుత్వం మాదిరిగానే, ప్రస్తుత ప్రభుత్వం కూడా జర్నలిస్టుల సమస్యలను విస్మరిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాట తప్పదని రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) స్పష్టం చేసింది. గురువారం నాడు శంకర్ పల్లి మండలం పొద్దుటూరు ప్రగతి రిసార్ట్స్ లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో, జర్నలిస్టుల ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి దాదాపు రెండేళ్లు కావస్తున్నా, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించక పోవడం విచారకరమని సమావేశం అభిప్రాయపడింది. గత ప్రభుత్వం ఇలాంటి వైఖరినే అనుసరిస్తే గల్లీ నుండి ఢిల్లీ దాక తమ సంఘం లెక్కలేనన్ని ఉద్యమాలు చేపట్టిన విషయాన్ని సమావేశం గుర్తుచేసింది. జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఇంటి స్థలాలు, ఆరోగ్య పథకం, అక్రెడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను వీలైనంత తొందరలో పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఐజేయూ జాతీయ అధ్యక్షులు, మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్చించామన్నారు. ఫిబ్రవరి మాసం మొదటి వారంలో విజయవాడలో జరగనున్న ఐజేయూ జాతీయ ప్లీనరీని విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. జనవరిలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాలలో సదస్సులు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది.

వారికి అభినందనలు

కాగా, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ ఎన్నికలలో ఫ్రెండ్స్ ప్యానెల్ కు మద్దతు పలికి, ప్యానెల్ గెలుపు కోసం శ్రమించిన రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీతో పాటు ఇతర నాయకులను కార్యవర్గం అభినందించింది. తర్వాత యూనియన్ చేపట్టిన వివిధ కార్యక్రమాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ నివేదిక సమర్పించారు. రాష్ట్రంలో అకాల మరణం చెందిన 16 మంది జర్నలిస్టులకు సమావేశం నివాళులు అర్పించింది. సమావేశంలో ఐజేయూ జాతీయ మాజీ అధ్యక్షులు, స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఎంఏ మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. సంపత్ కుమార్, గాడిపల్లి మధు గౌడ్, కార్యదర్శులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జి. మధు గౌడ్, కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్ లతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 30 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నాం

- ఆ స్థాయిని నిలిపే బాధ్యత మీదే
- ప్రొబెషనరీ డిఎస్పీలతో డీజీపీ బి. శివధర్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6 : దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖ ప్రథమ స్థానంలో ఉందని, ఆ స్థాయిని నిలుపుకోవలసిన బాధ్యత ప్రొబేషనరీ డీఎస్పీల పైన కూడా ఉందని డీజీపీ బి. శివధర్ రెడ్డి అన్నారు. ఆర్బీవీ ఆర్ఆర్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో గురువారం నాడు జరిగిన ప్రొబేషనరీ డిప్యూటీ సూపరింటెండెంట్ల శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్, టీజీ సీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా, శాంతి భద్రతల అడిషనల్ డీజీపీ మహేష్ ఎం భగవత్, పోలీస్ కమిషనర్లు, వీసీ సజ్జనార్, సుధీర్ బాబు, అవినాష్ మహంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ దేశంలోనే అగ్రగామిగా నిలిచిన తెలంగాణ పోలీస్ కుటుంబంలోకి అడుగుపెడుతున్న 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలతో కూడుకున్న అతి పెద్ద బ్యాచ్ ఇదేనని వెల్లడించారు. రానున్నపది నెలల శిక్షణ కాలం వారి నాయకత్వ పయనానికి అకాడమీ పునాది వేస్తుందన్నారు. ప్రజలు వారిని అధికారులుగా కాదు, న్యాయప్రతినిధులుగా చూస్తారని చెప్పారు. ఐజీపీలు ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, ఎం .రమేశ్, రమేష్‌నాయుడు, అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు ఎన్. వెంకటేశ్వర్లు, మురళీధర్, జి కవిత పాల్గొన్నారు.

ఎమ్మార్వో ముందుకు మాగంటి సునీత కుటుంబం

- ఫ్యామిలీ సర్టిఫికెట్ వివాదంలో హాజరు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6 : సర్టిఫికెట్ వివాదంపై శేరిలింగంపల్లి ఎంఆర్ఓ ముందు మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులు గురువారం హాజరయ్యారు. మాగంటి రెండవ భార్య మాగంటి సునీత తరపున ఆమె రెండవ కూతురు మాగంటి దీశిరా, బీఆర్ఎస్ లీగల్ సెల్ లలిత రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధి లలితారెడ్డి మాట్లాడుతూ మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ విషయంపై వివాదం నడుస్తోందన్నారు.ఈ కేసు నవంబర్ 25కు వాయిదా వేశారని తెలిపారు. ఆధార్, ఓటర్ ఐడీ, పిల్లల ఓటర్ ఐడీ, ఆధార్ కార్డులలో అన్నింటిలో మాగంటి ఇంటి పేరు, తండ్రిగా గోపీనాథ్ పేరునే ఉంది. మాగంటి గోపీనాథ్, సునీతకు పుట్టిన పిల్లలే అక్షర, రిశిర, వాత్సల్య . అసెంబ్లీ సెక్రెటరీ జారీచేసిన స్పౌస్ కార్డులో కూడా మాగంటి సునీత పేరు మాత్రమే ఉందని అన్నారు. తారక్ ప్రద్యుమ్న రికార్డులో ఎక్కడా మాగంటి అనే పేరులేదు, కొసరాజు అని మాత్రమే ఉంది. మాలిని దేవి విషయంలోనూ అదే ఉంది. డాటర్ ఆఫ్ వెంకటేశ్వర రావు అనే ఉంది కానీ వైఫ్ ఆఫ్ అని గోపీనాథ్ పేరు లేదు. ఇదంతా కావాలనే జరుగుతున్న కుట్ర మాత్రమే. తహశీల్దార్ ఎదుట జరిగిన విచారణలో మాగంటి మొదటి భార్యగా చెబుతున్న వారు ఎలాంటి ఆధారాలు సమర్పించలేదు. ఈ కేసు విచారణను ఈనెల 25కు వాయిదా వేశారు. ఈ ఇష్యూ వల్ల ఎన్నికలకు ఎలాంటి ఆటంకం జరగదని అన్నారు.

డ్రగ్, గన్ కల్చర్‌కు కేటీఆరే కారణం

- తీవ్రంగా మండిపడిన మంత్రి 'తుమ్మల'

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పెరిగిన డ్రగ్, గన్ కల్చర్‌కు కేటీఆరే మూలమంటూ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ చేస్తున్న 'బాకీ కార్డు' ప్రచారాన్ని తిప్పికొడుతూ, బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన హామీలు, రాష్ట్రంపై పెట్టిన లక్షల కోట్ల అప్పుల సంగతేంటని నిలదీశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన అనంతరం తుమ్మల మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎన్నో ఇబ్బందులలో ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత 20 నెలలుగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. సీఎం రేవంత్ రెడ్డి పాలన కారణంగా పారిశ్రామికవేత్తలు రాష్ట్రం విడిచి వెళ్లిపోతున్నారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా అవాస్తవమని, రోజూ ఎందరో పారిశ్రామికవేత్తలు కొత్త పెట్టుబడులతో తెలంగాణకు వస్తున్నారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు ఇటీవలి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను గుర్తుంచుకోవాలని తుమ్మల హితవు పలికారు. "పదేళ్ల బీఆర్ఎస్ పాలనను చూసిన ప్రజలు ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారు. అలాంటి వారికి కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని అన్నారు.

రేవంత్‌రెడ్డిపై ఈసీకి బీఆర్ఎస్ ఫిర్యాదు

- ముస్లింలపై వ్యతిరేక వ్యాఖ్యలపై చర్యలకు వినతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సీఎం రేవంత్ దిగజారి చేస్తున్న ప్రయత్నాలను, మాటలను పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ సీఈఓ సుదర్శన్‌రెడ్డిని కోరినట్టు శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూధనాచారి తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్యమంత్రి ముస్లింలపై చేసిన దాడులు, వ్యాఖ్యలపై గురువారం ఈసీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. 'బీఆర్ఎస్ పార్టీ ఒక చారిత్రక బాధ్యతను నిర్వహించింది. తెలంగాణ ప్రజలు 60 సంవత్సరాలు పడిన గోసను, అన్యాయం, అవమానం, అవహేళనకు గురైన తెలంగాణ జాతిని విముక్తి చేసింది, దానికి కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పోరాటం చేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత దేశానికే ఆదర్శవంతమైన పాలను అందించింది' అని కొనియాడారు. అలాంటి చరిత్ర ఉన్న పార్టీని పట్టుకుని ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారని, జూబ్లీహిల్స్ ఎన్నికలో పార్టీ ఓడిపోతుందన్న భయంతో, ఆ తర్వాత తన పదవికి గండం ఉంటుందన్న ఆందోళనతో రేవంత్ చాలా చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే, పథకాలు పోతాయని బెదిరిస్తున్నారని దుయ్యబట్టారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పల్లె రవికుమార్, రామచంద్రునాయక్ పాటు పలువురు ముస్లిం నాయకులు సల్మాన్‌ఖాన్ పాల్గొన్నారు.



ప్రజల కోరిక మేరకే గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు మారుస్తున్నాం. అందరికీ ఆమోదయోగ్యమైన పేరే పెట్టనున్నాం. సచివాలయ వ్యవస్థలో సీఎం చంద్రబాబు సమగ్ర మార్పులు తీసుకొస్తున్నారు. సచివాలయ ఉద్యోగులకు కనీసం జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ కూడా ఇవ్వకుండా గత ప్రభుత్వం వారి జీవితాలతో ఆడుకుంది.

-ఏపీ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి

ఓపెన్ వాయిస్

భారత విద్యార్థుల మీద కెనడా ఆంక్షలు

ఉన్నత విద్య కోసం కెనడా వెళ్లాలని కలలు కంటున్న వేలాది మంది భారత విద్యార్థులకు ఆ దేశం ఇటీవల భారీ షాకిచ్చింది. దరఖాస్తు చేసుకున్న ప్రతి నలుగురిలోనూ దాదాపు ముగ్గురికి అంటే, 74 శాతం మంది విద్యార్థుల స్టడీ పర్మిట్లను కెనడా ఇమ్మిగ్రేషన్ అధికారులు నిరాకరించారు. అయితే, రెండేండ్లలోనే రెట్టింపు కంటే ఎక్కువగా దరఖాస్తులు తిరస్కరణకు గురి కావడం గమనార్హం. కెనడా ఇప్పుడు మరో పిడుగు వేయనున్నట్లు తెలుస్తోంది. సామూహికంగా వీసాలను రద్దు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి. ఇలా మాస్ వీసా క్యాన్సిలేషన్ అధికారాల కోసం కెనడా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి అమెరికా సంస్థలతో కలిసి ఇమిగ్రేషన్, రెఫ్యూజీ, సిటిజన్‌షిప్ కెనడా, కెనడా బోర్డర్ సర్వీసెస్ ఏజెన్సీలు ఇమిగ్రేషన్ మంత్రిత్వశాఖకు ఇప్పటికే ఓ ప్రజెంటేషన్ ఇచ్చినట్లు అంతర్జాతీయ మీడియా పలు కీలక కథనాలు ప్రచురించింది. వీసా మోసాలను అరికట్టేందుకు కెనడా ఈ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా భారత్, బంగ్లా నుంచి వీసా మోసాలు పెరుగుతున్నాయనే అనుమానాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. ఈ మేరకు ఇచ్చిన ప్రెజెంటేషన్‌లో, మోసపూరిత విజిటింగ్ వీసా దరఖాస్తులు రిజెక్ట్ చేయడం, రద్దు చేయడం కోసం కెనడా సంస్థలు అమెరికా భాగస్వామ్య పక్షాలు ఓ వర్కింగ్ గ్రూప్‌గా ఏర్పడినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా భారత్, బంగ్లాదేశ్ నుంచి వచ్చే వీసా దరఖాస్తుల విషయంలో కఠినంగా వ్యవహరించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సంబంధించిన బిల్లును పార్లమెంటులోనూ ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. అటు ఇదే జరిగితే, మహమ్మారి, యుద్ధాలు వంటి అసాధారణ సందర్భాలలో లేదా నిర్దిష్ట దేశాల వారి వీసాలను సామూహికంగా రద్దు చేయడానికి ఆ దేశ అధికారులకు అనుమతి వస్తుంది. కెనడా ఇలా చేస్తుందనే నివేదికలతో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కెనడా ప్రవేశపెట్టబోతున్నట్లు చెబుతున్న బిల్లుపై దాదాపు 300 స్వచ్ఛంద సంస్థలు తీవ్రంగా ఆందోళనలు వ్యక్తం చేస్తున్నయని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ తరహాలో వీసాలను రద్దు చేయడం 'సామూహిక బహిష్కరణ కార్యక్రమాన్ని' చేపట్టేందుకు ప్రభుత్వానికి వీలు కల్పిస్తుందని మైగ్రెంట్ రైట్స్ నెట్‌వర్క్ వెల్లడించింది. పెరుగుతున్న పెండింగ్ వీసా దరఖాస్తులను తగ్గించేందుకు ప్రభుత్వం ఇలా చేస్తోందని నిపుణులు అంటున్నారు. కెనడా తీరుపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. భారత్‌ను దృష్టిలో పెట్టుకునే కెనడా ఈ మాస్ వీసా క్యాన్సిలేషన్ హక్కుల కోసం ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకుముందు భారతీయ విద్యార్థుల పట్ల కూడా కెనడా ఇదే వైఖరి అవలంభించింది. భారత విద్యార్థుల తిరస్కరణ రేటు (74 శాతం), మిగతా అంతర్జాతీయ విద్యార్థుల సగటుతో (40 శాతం) పోలిస్తే చాలా ఎక్కువ కావడం గమనార్హం. కెనడా ఒకవైపు భారత్ తో సత్సంధాలు కోరుకుంటూనే, భారత విద్యార్థుల పట్ల ఇలా కఠినంగా వ్యవహరించాలనుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అమెరికాలాగే. కెనడా కూడా భారత్ మీద పరోక్ష ఆంక్షలు అమలు చేయాలని అనుకుంటోందని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా తీసుకొస్తున్న కొత్త కొత్త విధానాల మీద అసహనంతో ఉన్న భారత విద్యార్థులు పలువురు సహజంగానే కెనడా వైపు దృష్టి సారిస్తున్నారు. అలా అధికంగా వచ్చే భారత్, బంగ్లాదేశ్ విద్యార్థులను నియంత్రించేందుకు కెనడా యత్నాలు చేస్తుందేమోనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
శుక్రవారం
07.11.2025

జనజాగృతి గీతం, వందేమాతరం

1906లో పాథే ఫోన్స్ కంపెనీ రవీంద్రనాథ్ ఠాగూర్ గళంలో దీన్ని రికార్డు చేసింది. బ్రిటిష్ పోలీసులు ఆ రికార్డులను నాశనం చేశారు. ఒరిజినల్ కాపీ పారిస్‌లో దొరికితే, దాన్ని 1966లో ఇందిరాగాంధీ దాన్ని తిరిగి భారత్‌కు తెప్పించారు. 1950లో రాజ్యాంగ పరిషత్తు 'వందేమాతరం' గీతాన్ని 'జనగణమన'తో సమాన హోదాలో గౌరవించాలని తీర్మానించింది. ఈ గీతం భరత జాతి చైతన్యానికి నిత్య దీప్తి. భారత సంస్కృతిలో 'అసతోమా సద్గమయ, సత్యమేవ జయతే, జననీ జన్మభూమిశ్చ, మా ఫలేషు కథాచనా' వంటి వాక్యాలతో పాటు ప్రపంచ స్థాయి 'నో దై సెల్ఫ్' సోక్రటీస్ సూత్రము, 'పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప' అనే మార్క్స్ నినాదం మానవ వికాసానికి మైలురాళ్లు అయినట్లే, 'వందేమాతరం' కూడా ఆ కోవకు చెందిన మహోన్నత నినాదం.

మేకిరి దామోదర్
9573666650

భరత జాతి బానిసత్వ విముక్తి గీతంగా 'వందేమాతరం' గీతానికి 150 యేండ్లు నిండిన సందర్భంగా ప్రభుత్వం 7 నవంబర్,2025న ఉదయం 10 గంటలకు యావత్ జాతి సామూహిక గీతాలాపన చేయనుంది. 'వందే మాతరం' గీతం ప్రస్థానంలోకి వెళ్దాం. ఈ రెండు మాటలు ఆ గీతంలోని పదాలు మాత్రమే కాదు, భారత జాతి ఊపిరి. బానిస సంకెళ్లలో చిక్కుకున్న దేశానికి ఆ గీతం నూతన శ్వాసనిచ్చింది. ఈ ఒక్క నినాదమే ప్రజలలో స్వాతంత్ర్య చైతన్యాన్ని మేల్కొలిపింది. దేశమంతటినీ, ఒకే తాటిపై నడిపించింది. భారతదేశానికి స్వాతంత్ర్యం సంపాదించుకోవడానికి జరిగిన పోరాటం దాదాపు రెండు శతాబ్దాల పాటు సాగింది. ఈ సుదీర్ఘ స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో యోధులు తమ ధన, మాన, ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేశారు. ఆ సమరంలో 'వందే మాతరం' గీతం స్ఫూర్తి మంత్రంగా మారింది. ఇది కేవలం నినాదం కాదు, మనోబలం, మాతృభూమి పట్ల ప్రేమ, ఆత్మ విశ్వాసాల కలయిక. నిరంకుశ బ్రిటిష్ పాలకులు ఆనాడు ఉద్యమకారులను చితకబాదుడు, ఉరిశిక్షలు, తుపాకీ గుండ్లు ఎదుర్కొంటున్నప్పుడు అధికారులు, న్యాయమూర్తులు 'చివరిగా చెప్పదలచుకున్నది ఏదైనా ఉందా?' అని అడిగితే, వారు తల అడ్డంగా ఊపి చిరునవ్వుతో 'వందే మాతరం' అని పలికేవారు. అది వారి చివరి శ్వాస, కానీ, దేశానికి కొత్త ఊపిరి. ఉప్పు సత్యాగ్రహంలో సమయంలో, బిహారీ బాలుడు బధు నోనియా 'వందేమాతరం' అంటూ నిర్భయంగా తిరుగుతుండగా బ్రిటిష్ పోలీసు అతన్ని ఉప్పు కొలిమిలో తోసేశాడు. ఆ బాలుడు ప్రాణాలు గాలిలో కలిసేవరకు 'వందేమాతరం' అంటూ నినదించాడు. ఇలా పిల్లలు, పెద్దలు, యువత, మహిళలు అందరూ ఈ గేయం, నినాదంతో బ్రిటిష్‌వారిపై పోరాటం చేశారు.

కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు

కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు వందేమాతర గీతం ప్రజల హృదయాలలో దావానలంలా వ్యాపించింది. బిపిన్ చంద్ర పాల్ దీన్ని మన దేశానికి పరిచయం చేసి ప్రాచుర్యం కల్పించారు. భాషలు, మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య ఉన్న భేదాలను చెరిపి దేశాన్ని ఒక్క తాటిపై నిలిపిన చైతన్య గీతం ఇది. బంకిమ్ చంద్రుని కలం నుంచి జాతి ఊపిరి వరకు. ఈ గీతానికి ఆవిర్భావం వెనుక ఒక అవమానగాథ ఉంది. బంకిమ్ చంద్ర చటోపాధ్యాయ్ బ్రిటిష్ పాలనలో డిప్యూటీ మేజిస్ట్రేట్‌గా పనిచేస్తుండగా, ఒక తెల్ల అధికారి అతనిపై జాతి వివక్షతో దాడి చేశాడు. ఆ అవమానం ఆయన హృదయంలో జ్వాలగా మారింది. తరువాత బ్రిటిష్ పాలకులు 'గాడ్ సేవ్ ద కింగ్' గీతాన్ని భారత జాతీయ గీతంగా ప్రకటించాలని చూస్తున్నారని తెలిసి, బంకిమ్ చంద్ర కలం నుంచి అక్షరాల మంటలు చిమ్మాయి. 1875 నవంబర్ 7న ఆయన రచించిన గీతమే, భారతీయ గేయం. ఇది బంకించంద్ర చటర్జీ రచించిన 'ఆనందమఠ్' అనే బెంగాలీ నవలలోనిది. స్వాతంత్రోద్యమ కాలంలో ఈ గీతాన్ని భారతీయులు 'విప్లవ గీతంగా' గానం చేశారు. ఇది ఇటు 'జనగణమన'తో సమాన స్థాయి కలిగి ఉంటుంది. వందేమాతరం గీతం ప్రథమంగా 1896లో కోల్ కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో ఆలపించారు. ఆ తర్వాత యావత్ భారత జాతి గుండెల నిండా చేరి ఉద్యమానికి పురికొల్పింది. ఇది భరత జాతి దాస్య శృంకణాల విముక్తి గీతమైతే, బ్రిటిష్ వారిని సప్త సముద్రాలు దాటించి విప్లవ గీతంగా మారింది.

తల్లీ! భరతమాతా నీకు వందనం

వందేమాతరం, సుజలాం సుఫలాం, మలయజ శీతలాం, సస్యశ్యామలాం మాతరం, వందేమాతరం! శుభ్రజ్యోత్స్నా పులకితయామినీం, పుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం, సుహాసినీం, సుమధుర భాషిణీం, సుఖదాం, వరదాం మాతరం, వందేమాతరం' (తల్లీ! భరతమాతా నీకు వందనం! తీయని జలాలతో, కమ్మని ఫలాలతో, చల్లని మలయ మారుతాలతో, పచ్చని పైర్లతో వెలసిల్లే, తల్లీ నీకు వందనం. పండు వెన్నెల రాత్రులలో విరబూసిన తరూలతలతో శోభిస్తూ, స్వచ్ఛమైన నవ్వులతో, మధురమైన మాటలతో మాకు సుఖాలను కలిగిస్తూ వరాలనిచ్చే, తల్లి నీకు వందనం) భాషా మిశ్రమం గురించి విమర్శలు ఎదురైనా ఆయన తగ్గకపోగా 'మీకు నచ్చితే పాడండి, లేకుంటే వదలండి, దీని విలువ ప్రపంచం గుర్తిస్తుంది' అన్నారు. బంకిమ్ చంద్ర ఛటోపాధ్యాయ. తరువాత రవీంద్రనాథ్ ఠాగూర్ ఈ గీతంలోని ఆధ్యాత్మికతను గుర్తించి దేశాన్ని మాతృమూర్తిగా చూపించే విధానాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చారు.1886లో అనేక సభలలో స్వయంగా ఆలపించారు. బంకిమ్ చంద్ర మరణానంతరం ఈ గీతం అగ్నికణాలై ప్రజలలో వ్యాపించింది.1947 ఆగస్టు 15న మన స్వాతంత్ర్య సిద్ధించిన రోజున పార్లమెంట్‌లో సంగీతకారుడు ఓం ప్రకాశ్ ఈ గీతాన్ని ఆలపించారు. దూరదర్శన్‌లో రోజూ వినిపించే 'వందేమాతరం' గీతానికి నేపథ్య సంగీతం లేకపోవటానికి దీనిలోని పదాల మాధుర్యం కారణమని చెబుతారు. బీబీసీ వరల్డ్ సర్వీస్ నిర్వహించిన అంతర్జాతీయ పోల్‌లో ప్రపంచ ప్రసిద్ధ జాతీయ గీతాలలో 'వందేమాతరం' రెండవ స్థానం దక్కించుకుంది.

'జనగణమన'తో సమాన హోదాలో

1906లో పాథే ఫోన్స్ కంపెనీ రవీంద్రనాథ్ ఠాగూర్ గళంలో దీన్ని రికార్డు చేసింది. బ్రిటిష్‌పోలీసులు ఆ రికార్డులను నాశనం చేశారు. ఒరిజినల్ కాపీ పారిస్‌లో దొరికితే, దాన్ని 1966లో ఇందిరాగాంధీ దాన్ని తిరిగి భారత్‌కు తెప్పించారు. 1950లోరాజ్యాంగ పరిషత్తు 'వందేమాతరం' గీతాన్ని 'జనగణమన'తో సమాన హోదాలో గౌరవించాలని తీర్మానించింది. ఈ గీతం భరత జాతి చైతన్యానికి నిత్య దీప్తి. భారత సంస్కృతిలో 'అసతోమా సద్గమయ, సత్యమేవ జయతే, జననీ జన్మభూమిశ్చ, మా ఫలేషు కథాచనా' వంటి వాక్యాలతో పాటు ప్రపంచ స్థాయి 'నో దై సెల్ఫ్' సోక్రటీస్ సూత్రము, 'పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప' అనే మార్క్స్ నినాదం మానవ వికాసానికి మైలురాళ్లు అయినట్లే, 'వందేమాతరం' కూడా ఆ కోవకు చెందిన మహోన్నత నినాదం. ఇది కేవలం స్వాతంత్ర్య చరిత్రలో ఒక పుట కాదు భారత జాతి ప్రాణాలలో నిత్యం ప్రజ్వరిల్లే అగ్ని కణం. ఆనాటి త్యాగాల స్ఫూర్తితో నేటి తరం భారత దేశ ప్రగతికి, అభివృద్ధికి పునరంకితం కావలసి ఉంది.

(వందేమాతరం గీతానికి నేటికి 150 యేండ్లు)

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

మనిషి ప్రకృతి బంధం

ప్రకృతి మనిషి మధ్య బంధం కేవలం జీవనాధారమే కాదు. అది హృదయ బంధం. ఆ బంధం తేలికగా తెగిపోకూడదు. మనిషి సుఖ సౌకర్యాలకోసం ప్రకృతిని వదిలేస్తే, తనే తన శత్రువుగా మారిపోతాడు. ప్రేమతో, జాగ్రత్తతో కాపాడితే, ప్రకృతి మళ్లీ మనిషి చేతిలో పూలదండలా విరుస్తుంది. మనిషి ప్రకృతిని జయించలేడు. కానీ, ప్రేమించగలడు. ఆ ప్రేమే భూమి శాంతి రహస్యం. మనిషి ఊపిరిలోని గాలి కూడా చెట్ల ఆశీర్వాదం. ఆ బంధాన్ని గౌరవిస్తే, ప్రపంచం మళ్లీ పచ్చగా, ప్రశాంతంగా మారుతుంది. ప్రకృతి మన తల్లి. ఆమెను కాపాడటం మన సంతానం ధర్మం.

చిటికెన కిరణ్ కుమార్
9490841284

ప్రకృతి అంటే కేవలం చెట్లు, పూలు, నదులు, పర్వతాలు మాత్రమే కాదు. మనిషి ఊపిరి తీసుకునే గాలి నుంచి తాగే నీటివరకు, తినే అన్నం నుంచి నడిచే నేలవరకు అంతా ప్రకృతే. కానీ, మనిషి ఈ బంధాన్ని మెల్లగా మరిచిపోతూ వస్తున్నాడు. పూర్వం మన పెద్దలు చెట్లను పూజించేవారు, పుట్టిన పిల్లల కోసం వృక్షాలను నాటేవారు, వాన పడి నేల వాసన వచ్చిందంటే ఆహ్లాదంగా నవ్వేవారు. అది కేవలం సంప్రదాయం కాదు. ప్రకృతితో కలిసిన జీవన తాత్త్వికత. మనిషి జీవితానికి అద్దం పట్టే ఆ బంధం ఇప్పుడు కృత్రిమ తత్వంలో కరుగుతోంది. నేటి జీవితం యంత్రాల చుట్టూ తిరుగుతోంది. పొలాలలో మట్టి వాసన కంటే యంత్ర ధ్వని ఎక్కువగా వినిపిస్తోంది. గడపల ముందు మొక్కల బదులు కాంక్రీటు గోడలు ఎత్తుకురావడం ప్రారంభమైంది. గాలిలో పువ్వుల సువాసన కంటే పొగమంచు ఎక్కువైంది. మనిషి తన సౌకర్యాల కోసం ప్రకృతిని పగులకొట్టాడు. చెట్లు నరికాడు, నదులు కట్టేశాడు, పర్వతాలను తవ్వేశాడు. కానీ, ప్రతి నాశనం వెనుక ఒక ఖరీదైన ప్రతిఫలం ఉంది. అది భవిష్యత్తు తరాల ఊపిరి.

ప్రకృతి మనకు పాఠాలు నేర్పిస్తోంది

ప్రకృతిని జయించాలని మనిషి తపనపడ్డాడు. కానీ, అదే ప్రకృతి తనకు పాఠాలు నేర్పిస్తోంది. ఎండలు తాళలేనంతగా మండుతున్నాయి, వానలు ఒకేసారి కురిసి ప్రళయాలు సృష్టిస్తున్నాయి. తుపాన్లు ఊరిన ఊరే చెరిపేస్తున్నాయి. ఇది ప్రకృతి ప్రతీకారం కాదు, మనిషి చేసిన తప్పులకు ఆమె ఇచ్చే హెచ్చరిక మాత్రమే. ప్రకృతి తన సహనానికి హద్దు పెట్టినప్పుడు, మనిషి శాస్త్రం కూడా దానికి పరిష్కారం చెప్పలేని స్థితి వస్తుంది. మనిషి ప్రగతిని తప్పుపట్టాల్సిన అవసరం లేదు. కానీ, ఆ ప్రగతికి పునాది ప్రకృతే అని మనం గుర్తుంచుకోవాలి. మనం తినే అన్నం, తాగే నీరు, ఊపిరి తీసుకునే గాలి, ఇవన్నీ మన శాస్త్రసాంకేతికం కాదు, ప్రకృతి ప్రసాదం. ఈ ప్రసాదాన్ని కాపాడటం మన కర్తవ్యం. ఒక్క చెట్టును నరికేటప్పుడు, దాని కింద ఎన్ని జీవులు ఆశ్రయం పొందుతున్నాయో ఆలోచిస్తే మనసు వెనక్కు తగ్గుతుంది. ఒక్కనది ఎండిపోతే ఎన్ని ప్రాణాలు దాహంతో క్షీణిస్తాయో ఊహిస్తే మనిషి తాత్కాలిక లాభం కోసం ప్రకృతిని నాశనం చేయడాన్ని మానేస్తాడు.



వానకోసం ఆకాశం వైపు చూసి

పల్లెలలో ఇంకా ప్రకృతి పట్ల గౌరవం కొంతమేర ఉంది. రైతు తన పొలాన్ని తల్లి అని పిలుస్తాడు, వానకోసం ఆకాశం వైపు చూసి ఆశతో ప్రార్థిస్తాడు. కానీ, పట్టణాలలో మట్టిని తాకని పిల్లలు పెరుగుతున్నారు. మొక్క అంటే గదిలో ప్లాస్టిక్ చెట్టు, వర్షం అంటే టీవీ స్క్రీన్‌పై కనిపించే దృశ్యం. ఈ దూరం పెరిగిన కొద్దీ మనిషి మనసులోని ప్రశాంతత కూడా కరుగుతోంది. ప్రకృతితో అనుబంధం కోల్పోయిన మనసు ఎప్పుడూ అస్థిరంగా ఉంటుంది. ప్రకృతి మనిషిని ఎప్పుడూ ఆశ్రయించింది. ఆత్మీయంగా, మాతృత్వంతో. కానీ, మనిషి దాన్ని ఉపయోగించుకున్నాడు, పరిరక్షించలేదు. తాత్కాలిక లాభం కోసం అడవులను నాశనం చేశాడు. పచ్చని కొండలపై బిళ్లల అరణ్యాలు కట్టేశాడు. కాలుష్యం పెరిగి పక్షులు కనిపించని నగరాలు ఏర్పడ్డాయి. ఒకప్పుడు కోయిల పాటలు వినిపించిన చోట ఇప్పుడు కార్ల హారన్ ధ్వనులు. ఇది ప్రగతి కాదు. ప్రకృతితో విరోధం. ప్రకృతితో మళ్ళీ బంధం పునరుద్ధరించాలి అంటే పెద్ద ప్రణాళికలు అవసరం లేదు. మన ఇల్లు ముందు ఒక చెట్టు నాటడం, వర్షపు నీటిని నిల్వ చేయడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ఇవే మొదటి అడుగులు. చిన్న ప్రయత్నం కూడా పెద్ద మార్పుకు దారి తీస్తుంది. మనం ప్రకృతిని గౌరవిస్తే, ఆమె మన జీవితాన్ని రక్షిస్తుంది. మానవజాతి నిలకడ ప్రకృతిపై ఆధారపడి ఉంటుంది.

కేవలం జీవన వనరులే కాదు

ప్రకృతి మనిషికి కేవలం జీవన వనరులు ఇవ్వలేదు. సౌందర్యాన్ని, సంగీతాన్ని, స్ఫూర్తిని కూడా ఇచ్చింది. పక్షుల గానం మనసు నింపుతుంది, వర్షపు చినుకులు కవిత్వాన్ని పండిస్తాయి, నదీ ప్రవాహం జీవన సత్యాన్ని నేర్పిస్తుంది. ప్రకృతిలో ప్రతి దృశ్యం మనిషి హృదయంలో ఒక భావాన్ని మేల్కొలుపుతుంది. అందుకే ప్రకృతిని కాపాడటం అంటే మన మనసును కాపాడటమే. మనిషి భూమికి అతిథి మాత్రమే. ఆతిథ్యాన్ని గౌరవించని వాడికి భూమి దయ చూపదు. ఎన్ని సాంకేతికతలు వచ్చినా, మనిషి తన పుట్టిన తల్లిని విడిచి బ్రతకలేడు. అదే విధంగా ప్రకృతిని దూరం చేసుకున్న సమాజం కూడా నిలబడలేదు. ఆమ్ల వర్షాలు, వాతావరణ మార్పులు, భూకంపాలు, ఇవన్నీ ఒక తల్లి చూపించే కఠిన ప్రేమ మాత్రమే. ఆమె చెప్పేది ఒక్క మాట. 'నన్ను ప్రేమించు, నేను నిన్ను రక్షిస్తాను' మనిషి జీవనమార్గం మళ్ళీ ప్రకృతివైపు తిరగాలి. పల్లె దారులలో నడవాలి, చెట్ల నీడలో కూర్చోవాలి, పక్షుల గానం వినాలి. పిల్లలకు చెట్ల ప్రాముఖ్యత చెప్పాలి, వృక్షారోపణను పండుగగా చేసుకోవాలి. భవిష్యత్తు తరాలు గాలిలో స్వేచ్ఛగా ఊపిరి పీల్చాలంటే, నేడు మనం తగిన నిర్ణయాలు తీసుకోవాలి.

బంధం కేవలం జీవనాధారమే కాదు

ప్రకృతి మనిషి మధ్య బంధం కేవలం జీవనాధారమే కాదు. అది హృదయ బంధం. ఆ బంధం తేలికగా తెగిపోకూడదు. మనిషి సుఖసౌకర్యాలకోసం ప్రకృతిని వదిలేస్తే, తనే తన శత్రువుగా మారిపోతాడు. ప్రేమతో, జాగ్రత్తతో కాపాడితే, ప్రకృతి మళ్లీ మనిషి చేతిలో పూలదండలా విరుస్తుంది. మనిషి ప్రకృతిని జయించలేడు. కానీ, ప్రేమించగలడు. అదే ప్రేమే భూమి శాంతి రహస్యం. మనిషి ఊపిరిలోని గాలి కూడా చెట్ల ఆశీర్వాదం. ఆ బంధాన్ని గౌరవిస్తే, ప్రపంచం మళ్లీ పచ్చగా, ప్రశాంతంగా మారుతుంది. ప్రకృతి మన తల్లి. ఆమెను కాపాడటం మన సంతానం ధర్మం.

(వ్యాస రచయిత ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు, ఐబీఆర్ఎస్ సభ్యుడు)

క్యాన్సర్ పట్ల అవగాహన పెంచుకోవాలి

రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

ప్రతి సంవత్సరం నవంబర్ 7న జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని జరుపుకుంటారు. క్యాన్సర్ గురించి ప్రజలలో అవగాహన పెంచడమే లక్ష్యం ఈ దినం లక్ష్యం. క్యాన్సర్ అనేది శరీరంలోని కొన్ని కణాలు అదుపు లేకుండా పెరిగి, ఇతర భాగాలకు వ్యాపించే విధంగా మారే వ్యాధి. సాధారణ కణాల పెరుగుదల నియంత్రణలో ఉంటే, క్యాన్సర్ కణాలు నియంత్రణ లేకుండా పెరిగి గడ్డలను (కణితులు) ఏర్పరుస్తాయి. ఈ గడ్డలు ఆరోగ్యకర కణాలను తొలగించడం లేదా అవయవాలను నాశనం చేయడం చేస్తాయి. క్యాన్సర్‌కు స్పష్టమైన ఒకే కారణం లేదు. కానీ, కొన్ని కారణాలు క్యాన్సర్ రాకకు దోహదం చేస్తాయి. సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా వంటివి ఊపిరితిత్తులు, నోరు, గొంతు వంటి అనేక క్యాన్సర్లకు ప్రధాన కారణం. అధికంగా మద్యం తాగడం కాలేయం, నోరు, గొంతు వంటి క్యాన్సర్లకు దారితీస్తుంది. ఆహారపు అలవాట్లు: అధిక కొవ్వులు, చక్కెరలు ఉన్న ఆహారం, తక్కువ కూరగాయలు, పండ్లు తీసుకోవడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశాలు ఉంటాయి. వ్యాయామం చేయకపోవడం కొన్ని రకాల క్యాన్సర్లకు కారణం కావచ్చు. కుటుంబంలో క్యాన్సర్ ఉంటే వచ్చే అవకాశాలు ఎక్కువ. హెపటైటిస్ బి, హెపటైటిస్ సి వంటి వైరస్లు కాలేయ క్యాన్సర్‌కు కారణం కావచ్చు. అధిక రేడియేషన్ శరీర కణాలపై ప్రభావం చూపి, క్యాన్సర్ కలిగించే అవకాశం ఉంది.

తీవ్ర అలసట, బరువు తగ్గడం, రక్తస్రావం

క్యాన్సర్ లక్షణాలు దాని రకం, స్థానం, దశపై ఆధారపడి ఉంటాయి. కొన్ని సాధారణ లక్షణాలను గమనిస్తే, తీవ్ర అలసట, బరువు తగ్గడం, రక్తస్రావం లేదా రక్తపు ఉమ్మి, శ్వాసలో ఇబ్బంది. అవయవంలో గడ్డలు మొదలైనవి. క్యాన్సర్‌ను పూర్తిగా నివారించలేకపోయినా, కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దాని ప్రమాదాన్ని తగ్గించవచ్చు. పొగాకు వాడకాన్ని మానుకోవడం ద్వారా ఊపిరితిత్తులు, నోరు, గొంతు వంటి క్యాన్సర్లను నివారించడంలో సహాయపడుతుంది. ఆరోగ్యకర ఆహారంలో ఎక్కువ పండ్లు, కూరగాయలు, తక్కువ కొవ్వులు ఉండే ఆహారం తీసుకోవడం మంచిది. రోజూ వ్యాయామం చేయడం శరీరంలో క్యాన్సర్ కణాల పెరుగుదలను తగ్గిస్తుంది. ఆల్కహాల్ తాగడం నిషేధించడం కూడా ముఖ్యమైన చర్య. క్యాన్సర్ నిర్ధారణలో తొలిదశలోనే పరీక్షలు చేయడం కీలకం. క్యాన్సర్ చికిత్స దాని రకం, దశ, రోగి ఆరోగ్య స్థితిపై ఆధారపడి ఉంటుంది. కొన్ని

ప్రధాన చికిత్స విధానాలు

శస్త్రచికిత్స ద్వారా క్యాన్సర్ కణితులను తొలగించడం. రేడియేషన్ చికిత్స ద్వారా కణాలను నాశనం చేయడం. కీమోథెరపీ ద్వారా క్యాన్సర్ కణాలను నియంత్రించడం. నిర్దిష్ట క్యాన్సర్ కణాలపై చర్యలు తీసుకోవడం. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం చాలా ముఖ్యం. కనుక ఏదైనా అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం అత్యవసరం. క్యాన్సర్ పై అవగాహన అవసరం.

(నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం)

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

ప్రాంతీయం

‘టోపీ’ పెట్టుకునే రోజు వస్తే తల నరుక్కుంటా

- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 6 : బోరబండ ఎన్నికల సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ‘నేను హిందువును, టోపీ పెట్టి, దొంగ నమాజ్ చేసి ఇతర మతాలను కించపర్చను. టోపీ పెట్టుకునే రోజు వస్తే తల నరుక్కుంటానంటూ’ వ్యాఖ్యానించారు. మాగంటి గోపీనాథ్ చావుకు కేటీఆరే కారణమని ఆరోపించారు. గోపీనాథ్ తల్లి చెప్పిన మాట ఇదని పేర్కొన్నారు. రేవంత్ కు దమ్ముంటే గోపీనాథ్ మరణంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ కు వావి వరసలు లేవని, చిన్నా పెద్దా ముసలి ముతక అనే తేడా లేనే లేదని విమర్శించారు. సీఎం పదవి కోసం ఏమైనా చేసే రకమని విమర్శించారు. కవిత అప్పుడప్పుడు ఆమె తండ్రి వద్దకు పోయి బాగోగులు చూసుకోవాలని హితవు పలికారు. ఎంఐఎం నాయకులతో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. పొరపాటున కాంగ్రెసోళ్లు గెలిస్తే ఆడవాళ్ల మెడలో ఉన్న మంగళ సూత్రం కూడా గుంజుకుపోతారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగితే రూ. తొమ్మిది వేల కోట్లపైనే సీబీఐ విచారణ ఎందుకు కోరారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి రూ. లక్ష కోట్ల అవినీతిపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా? అని నిలదీశారు. లక్ష ఓట్ల కోసం కాంగ్రెస్ ఒవైసీ పంచన చేరిందన్నారు.

సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

- కాంగ్రెస్ ఇంచార్జి పామెన భీమ్ భరత్

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 6 : రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీమ్ భరత్ అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు గురువారం భూమి పూజ నిర్వహించి అనుమతి పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇల్లు మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో ఏ ఒక్కరికీ కూడ ఇల్లు మంజూరు కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే పథకాన్ని చేపట్టిందన్నారు. పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇంటికి ఐదు లక్షల నిధులను మంజూరు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నక్కలపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు గౌరీ రవి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంగళవారం బుచ్చయ్య, గోపాల్ రెడ్డి, ఎల్లయ్య, కుమ్మరి సురేష్, జీవన్, మంగళారం యాదయ్య, కొండరాజు, గౌరీ కృష్ణ, మంగళారం రాజు, ఎండి సమీ, దేవయ్య, కిషోర్, మల్లేష్, విట్టలయ్య, రాజు, పెంటయ్య, గ్రామస్తులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మధ్యాహ్నా భోజన కార్మికుల బిల్లులను వెంటనే విడుదల చేయాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 6: మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీఐటియు మేడ్చల్ మండల కన్వీనర్ నరేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 8 నెలల పైగా నుండి బిల్లులు ఆపితే మధ్యాహ్న భోజన కార్మికులు ఏ విధంగా భోజనాలు వండి పెడతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బియ్యం ఒకటి ఇచ్చి వంట చేయమని చెబితే ఎలా వండుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లులు ఇవ్వకపోవడం వలన కార్మికులు అనేక రకాల మానసిక ఇబ్బందులకు పడుతున్నారని, డబ్బులు బయట రెండు రూపాయల ఇంట్రస్ట్ కు తెచ్చుకొని మధ్యాహ్న భోజనం వండుతున్నారన్నారు. కొంతమంది కార్మికులు బంగారం కుదువబెట్టి మరియు మధ్యాహ్న భోజనాన్ని వండుతున్నారని, ప్రభుత్వానికి మాత్రం కనికరము లేకుండా బిల్లులు ఆపడం అనేటువంటిది దుర్మార్గం అని తెలిపారు. వెంటనే మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను విడుదల చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఈ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన సంఘం జిల్లా కార్యదర్శి ప్రేమలత, మధ్యాహ్న భోజన సంఘం మండల కార్యదర్శి విజయలక్ష్మి, అధ్యక్షురాలు భాగ్యమ్మ, లత, అరుణ, చంద్రకళ, అమృత, నాగమణి, అంజలీ, యాదమ్మ, శకుంతల, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

పేదింటి పూల వ్యాపారి కూతురు పెళ్లికి సాయం

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం, నవంబర్ 6: పేదింటి పూల వ్యాపారి కూతురు పెళ్లికి ఖమ్మం టౌన్ ఫ్లవర్ మర్చంట్ యూనియన్ కమిటీ సభ్యులు గురువారం ఆర్థిక సహాయం, నిత్యావసర వస్తువులు అందించారు. యూనియన్ కార్యాలయంలో డి.శ్రీనివాస్ నాయక్, డి.మంగమ్మ కూమార్తె పెళ్ళి జరగనున్న సందర్భంగా రూ.15000 నగదు, అర క్వింటా బియ్యం, నిత్యావసర వస్తువులు అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు షేక్. మోయిన్, షేక్. ఖాజా మాట్లాడుతూ. గత 40 సంవత్సరాల నుండి కమాన్ బజార్ రావి చెట్టు దగ్గర పూల వ్యాపారం చేస్తున్న డి. శ్రీనివాస్ నాయక్ డి. మంగమ్మ నిరుపేద కుటుంబం పూల వ్యాపారంతో జీవనం కొనస్తున్నారని వారి కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి షేక్ షాబాజ్ అహ్మద్, జాయింట్ సెక్రెటరీ ఆర్. వెంకన్న, కన్వీనర్ మహమ్మద్ ముజాహిద్, ఇంచార్జ షేక్ ఇస్మాయిల్, సిపిఐ నాయకులు దుంగ్రోతు. శేఖర్ నాయక్, షేక్. లాల్ బి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 6: చౌకధరల దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని కీసర డివిజన్ ఆర్డీఓ వెంకట ఉపేందర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ మండలంలోని పూడూర్, సుతారిగూడ, శ్రీరంగవరం, కీసర మండలంలోని దమ్మాయిగూడ, ఓల్డ్ విలేజ్ దమ్మాయిగూడ, జర్నలిస్ట్ కాలనీ, విఆర్ఆర్ కాలనీ, భాగ్యనగర్, ఇంద్రానగర్ కాలనీ, వాయుశక్తి కాలనీ, అయ్యప్ప కాలనీ, సిద్దార్ట్ కాలనీ, రాజ్ సుఖీ నగర్, ఈస్ట్ గాంధీనగర్, శ్రీనివాస్ నగర్ కాలనీ, ఎస్ సి కాలనీ, అహ్మద్ గూడ, ఆర్ జి కే కాలనీ, రాంపల్లి, ఘట్కేసర్ మండలం, ఘట్కేసర్. 1, ప్రతాప్ సింగారం, మేడిపల్లి, బోడుప్పల్, మారుతినగర్, హనుమాన్ నగర్ కాలనీ, ఈస్ట్ బాలాజీ హిల్స్ అయ్యప్ప దేవాలయం దగ్గర, కాప్రాలోని జవహర్ నగర్, జవహర్ నగర్ ఫేస్ 3, డబల్ బెడ్రూం కాలనీ, వికలాంగుల కాలనీ, శామీర్పేట మండలం తుంకుంటలో ఖాళీ ఉన్న దుకాణాల భర్తీలకు అర్హులున్నవారు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారులు రాజకీయ భవిష్యత్తు, ప్రభుత్వ ఉద్యోగులు ఉండరాదనీ తెలిపారు. దరఖాస్తుదారులకు ప్రజాపంపిణీపై వ్రాత పరీక్షలు నిర్వహిస్తామని, దీనిలో 80 మార్కులతో హాల్ టికెట్ ద్వారా పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో 32 మార్కులతో ఉత్తెరనులైన వారికి 1.5 నిష్పత్తితో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. చౌకధరల డీలర్ గా నియామక అనంతరం జిల్లా మేనేజర్ తెలంగాణ రాష్ట్ర నిత్యావసర సరుకుల సంస్థ మేడ్చల్ మల్కాజిగిరి పేరుపై రూరల్ ప్రాంతం వారు 5 వేలు, పట్టణ ప్రాంతం వారు 7వేల 5 వందలు 5 రోజులలో డిమాండ్ డ్రాఫ్ట్ తయారు చేయాలని సూచించారు. ఆసక్తిగలవారు ఈనెల 15వ తారీఖు వరకు కీసర ఆర్డీఓ కార్యాలయంలో 250 రుసుమును చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి

- సీఐ పవన్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 6 : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మొయినాబాద్ సీఐ పవన్ కుమార్ రెడ్డి సూచించారు. గురువారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చైతన్య యూనివర్సిటీలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు ఈ ఆధునిక టెక్నాలజీ కాలంలో సెల్ ఫోన్ వినియోగం పెరిగిపోయిందని అన్నారు. దాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మనకు ఏదో లేనిపోని ఆశలు చూపించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు. సైబర్ నేరాల పట్ల, ర్యాగింగ్, సైబర్ క్రైమ్, మత్తు పదార్థాలు డ్రగ్స్ వంటి తదితర అంశాల పై యువత, విద్యార్థులకు పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్తును తీర్చిదిద్దు కొవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ ఎస్ఐ కిషన్ సింగ్, ఎస్ఐ నయిమొద్దీన్, కలశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

డీసీఎం కింద పడి యువకుడి మృతి

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 6: జాతీయ రహదారిపై డీసిఎం కిందపడి యువకుడు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని వెంకటరమణ కాలనీకి చెందిన రాజిరెడ్డి (19) బుల్లెట్ బైకుపై మేడ్చల్ నుండి చెక్ పోస్టుకు వెళ్తున్న సమయంలో బుల్లెట్ బైకు అదుపుతప్పి రాజీవ్ రెడ్డి కింద పడిపోయాడు. అదే సమయంలో వెనుకనుండి వస్తున్న డీసిఎం వెనుక చక్రాలకింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మార్చురికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

ప్రజాబాట పట్టిన విద్యుత్ అధికారులు

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 6: కీసర ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని విద్యుత్ చీఫ్ ఇంజనీర్ కామేష్ అన్నారు. సిఎండి ఆదేశాల మేరకు దమ్మైగూడ మున్సిపాలిటీలోని చేర్యాల గణేష్ టౌన్షిప్ ఎస్సీ కాలనీలలో గురువారం విద్యుత్ అధికారులు ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారి చీఫ్ ఇంజనీర్ కామేష్ హాజరై అధికారులతో కలిసి కాలనీలలో పర్యటించి, విద్యుత్ సమస్యలను పరిశీలించి తక్షణమే చర్యలు చేపట్టామన్నారు. చెట్ల కొమ్మలు తొలగింపు, డిటిఆర్ నిర్వహణ పనులు, యార్డ్ క్లీనింగ్ పనులు గణేష్ టౌన్షిప్ గేట్ దగ్గర ఎస్సీ కాలనీ ట్రాన్స్‌ఫార్మర్‌లలో విద్యుత్ అంతరాయాల వంటి సమస్యలు ఎక్కడున్నా తక్షణమే గుర్తించి మరమ్మతులు చేపట్టేందుకు ప్రజాబాట చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కీసర డివిజన్ డిఈ టి. లింగయ్య, ఏడిఈ సిహెచ్. నంద కిషోర్, ఏఈ మురళీకృష్ణ, సెక్షన్ సిబ్బంది శ్రీనివాసులు నరసింహ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

నీలిమ నర్సింగ్ కళాశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 6: విద్యార్థిని ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం నాగర్ కర్నూల్ జిల్లా, లింగాల మండలం, తుమ్మాలవాడ వీధికి చెందిన పూజిత (21) ఘట్కేసర్ మండలం ఔషాపూర్ లోని అనురాగ్ యూనివర్సిటీకి చెందిన అగ్రికల్చర్ అండ్ నీలిమ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ 3వ సంవత్సరం చదువుతూ అక్కడే దగ్గరున్న ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటుంది. గురువారం కళాశాలకు వచ్చిన పూజిత కళాశాల మూడవ అంతస్తునుండి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘతన స్థలానికి చేరుకొని గాయలపాలైన పూజితను చికిత్స నిమిత్తం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పూజిత పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలస్వామీ తెలిపారు.

మా ప్లాట్లు మాకిచ్చిన హైడ్రాకు థాంక్స్!

- హైడ్రాకు మద్ధతుగా ర్యాలీలు నిర్వహించిన కాలనీవాసులు

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 6: అప్పటి రోజులు గుర్తుకు వస్తుంటే భయమేస్తోంది. ఆ భయాన్నిపారదోలి.. మా ప్లాట్లు మాకు వచ్చేలా చేసిన హైడ్రాకు ధన్యవాదాలు అంటూ పోచారం మున్సిపాలిటీలోని దివ్యానగర్ లేఔట్‌లోని 2218 మంది ప్లాట్ యజమానులు చెబుతున్నారు. హైడ్రాకు ఎన్నిసార్లు థాంక్స్ చెప్పినా సరిపోదు. అందుకే నేడు కూడా ర్యాలీ నిర్వహించి ధన్యవాదాలు చెబుతున్నామని.. గురువారం ర్యాలీ నిర్వహించిన సందర్భంగా తెలిపారు. వాస్తవానికి రహదారుల ఆక్రమణ, పార్కుల దురాక్రమణను హైడ్రా తొలగించింది. కాని మాకదే పెద్ద మేలు అయ్యింది. అడ్డుగోడలు తొలగడంతో మా ప్లాట్లకు మేము వెళ్లడానికి వీలు కుదిరిందంటూ నాటి పరిస్థితులను గుర్తు చేశారు. హైడ్రా గాని రంగంలోకి దిగకపోతే.. రహదారులు, పార్కులు మాయమై.. తమ ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో గుర్తించలేని పరిస్థితి అంటూ హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది జనవరి నెల 25వ తేదీన దాదాపు 200 ఎకరాల్లో 2218 ప్లాట్లుగా విస్తరించిన దివ్య లేఔట్ చుట్టూ 4 కిలోమీటర్ల మేర నిర్మించిన ప్రహరీని హైడ్రా తొలగించింది. అప్పుడు సంబరాలు చేసుకున్నాం. ప్రహరీ నిర్మించి తమ ప్లాట్లలోకి వెళ్లకుండా నల్లమల్లారెడ్డి ఆంక్షలు విధించడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో హైడ్రాను ఆశ్రయించామని అప్పటి రోజులు గుర్తు చేసుకున్నారు. నల్లమల్లారెడ్డి కోటగోడలు, అడ్డు గోడలు

బద్దలు కొట్టి 2218 మంది ప్లాట్లకు విముక్తి కల్పించిన హైడ్రాకు ధన్యవాదాలంటూ మరో సారి ర్యాలీ నిర్వహించి అదే లే ఔట్ లో సమావేశమయ్యారు ప్లాట్ యజమానులు. హైడ్రాకు మరోసారి ధన్యవాదాలంటూ నినదించారు.

గోడ కూలింది.. కాలనీలకు దారి దొరికింది

4 కిలోమీటర్ల మేర ఉన్న భారీ ప్రహరీని కూల్చి వేయడంతో.. ఏకశిలా లే ఔట్, వెంకటాద్రి టౌన్‌షిప్, సుప్రభాత్ వెంచర్ 1, మహేశ్వరి కాలనీ, కచ్చవాణి సింగారం, ఏకశిలా పీర్జాదిగూడ రోడ్డు, బాలాజీనగర్, సుప్రభాత్ వెంచర్ 4, వీజీహెచ్ కాలనీ, ప్రతాప్ సింగారం రోడ్డు, సుప్రభాత్ వెంచర్ 2, 3, సాయిప్రియ, మేడిపల్లి, పర్వతపురం, చెన్నారెడ్డి కాలనీ, హిల్స్ వ్యూ కాలనీ, ముత్తెల్లిగూడ నివాస ప్రాంతాలకు దారి దొరికిందని ఆయా ప్రాంతాల నివాసితులు సంతోషం వ్యక్తం చేశారు. తమ ప్లాట్‌ను తామే చూడాలన్నా, వేరే వాళ్లకు చూపాలన్నా.. అనుమతి ఉండేది కాదు.. నల్లమల్లారెడ్డి నిర్దేశించిన సమయంలోనే రావాల్సి ఉంటుందని.. గేటు దగ్గర ఎంట్రీ పుస్తకంలో వివరాలన్నీ రాసిన తర్వాత వారికి ఇష్టమైతే వదిలేవారు.. లేదంటే లేదు.. ఏమాత్రం వారిని ప్రశ్నించినా అక్కడివారు తమను కొట్టి పంపించేసేవారు అని హైడ్రా రాక ముందు రోజులను గుర్తు చేసుకున్నారు. అలాగే మిర్జాలగూడ మున్సిపాలిటీలోని పర్వతాపురంలో ముస్లిం, క్రిస్టియన్ మతస్తుల శ్మశానవాటికలను కూడా అక్కడి వారు కబ్జా చేయగా హైడ్రా వచ్చి విడిపించిందని పలువురు స్థానికులు దివ్యానగర్ లేఔట్‌లోని ప్లాట్ యజమానులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

- యజమాని ఇంటి వద్ద మృతుని బంధువుల ఆందోళన

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 6: క్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అంకిరెడ్డి పల్లిగ్రామానికి చెందిన గుర్రాల మల్లేష్ వ్యవసాయ పొలం వద్ద పశువుల కాపరిగా గత కొంత కాలంగా వల్లపు రమేష్ పనిచేస్తున్నాడు. ప్రతి రోజు పశువులను తీసుకొని మేతకు వెళ్ళి సాయంత్రం పశువుల కొట్టంలో పశువులను కట్టేసేవాడు. రమేష్ స్వస్థలం యాదాద్రి జిల్లా రామలింగం పల్లీ బొమ్మల రామారం గ్రామానికి చెందినవాడు. గురువారం సాయంత్రం అయిన రమేష్ ఇంకా ఇంటికి రాలేదని యజమాని గుర్రాల మల్లేష్ పశువుల కొట్టం వద్దకు వెళ్ళి చూడగా రక్తపు మడుగులో పడి ఉన్న రమేష్‌ను చూసి ఒక్కసారిగా బయపడి అక్కడ ఉన్న స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలు తెలుసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మృతిని బంధువులు రమేశ మృతి పట్ల మాకు అనుమానం ఉందని యజమాని మల్లేష్ ఇంటి వద్ద ఆందోళన చేశారు. ఆందోళన చేస్తున్న వారికి సర్ది చెప్పి మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు.

“

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలవబోతున్నాం. మిగిలిన మూడు రోజుల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచారంలో దూకుడు పెంచాలి. సోషల్ మీడియాలో రోజుకో ఫేక్ సర్వే వదులుతూ ప్రజలు, ఓటర్లను బీఆర్ఎస్ గందరగోళానికి గురి చేస్తోంది. దీన్ని మనం సమర్థవంతంగా తిప్పికొట్టాలి. పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలి.

- మంత్రులతో మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి

ప్రాంతీయం

చెడిపోయిన రోడ్లకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలి

- గుంతల నుండి ప్రజల ప్రాణాలను కాపాడాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నర్సిములు డిమాండ్



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 6: కంది మండలంలో చెడిపోయిన రోడ్లకు మరమ్మత్తులు చేయాలని, గుంతలు గా మారిన రోడ్ల నుండి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆర్ అండ్ బి పిఏ టు ఈఈ శ్రీనివాస్ కు సిపిఎం కంది మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నర్సిములు మాట్లాడుతూ కంది మండల పరిధిలో అనేక గ్రామాలకు వెళ్లేటువంటి రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల మాయమై ప్రజలకు ప్రమాదకరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కంది నుండి చర్లగూడెం మరియు గణేష్ గడ్డ నుండి ఇస్మాల్ ఖాన్ పెట్,కంది మండల కేంద్రం తహశీల్దార్ కార్యాలయం ముందు రోడ్లు చెడిపోవడం వలన ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎన్ హెచ్ 65 నీ ఆనుకొని ఉన్న తహసీల్దార్ కార్యాలయం ముందు గుంతల రోడ్లు అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తున్న ఈ రోడ్లు చిన్నపాటి వర్షానికి బురదమయంగా మారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వెంటనే చొరవ చూపి ఈ రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని అన్నారు. మండలంలో అనేక చోట్ల రోడ్లు చెడిపోయి ప్రజలకు అంతరాయం కలుగుతుందని, కొద్దిపాటి వర్షాలు కురిసిన గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. సంబంధిత అధికారులు మండలంలో ఉన్న అన్ని రోడ్లను క్షుణ్ణంగా సర్వే నిర్వహించి చెడిపోయిన రోడ్లకు వెంటనే మరమ్మత్తులు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కంది మండల కన్వీనర్ ఎన్.శ్రీనివాస్, అశోక్, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవల బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలి

- కలెక్టర్ పి. ప్రావీణ్య
- 17వ కామన్ రివ్యూ మిషన్ బృందం డీ-బ్రీఫింగ్ సమావేశం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 6: జిల్లాలో ఆరోగ్య సదుపాయాల నాణ్యత పెంపునకు అధికారులు, వైద్య సిబ్బంది మరింత శ్రద్ధ తీసుకొని పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 17వ కామన్ రివ్యూ మిషన్ బృందం డీబ్రీఫింగ్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. సమీక్షలో జిల్లాలోని ప్రాంతీయ ఆస్పత్రి, మాతా, శిశు సంరక్షణ కేంద్రాలను సందర్శించి మానవ వనరులు, ల్యాబ్ సదుపాయాలు, ఫార్మసీ, డైట్, ఆసుపత్రిలో వస్తున్న ఇన్, అవుట్ పేషంట్ ల పరిమాణం, పారిశుద్ధ్యం,సేవలపై సమగ్ర సమీక్ష జరిపింది. భారత ప్రభుత్వ ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 3 నుండి 5 వరకు ఈ సంగారెడ్డి జిల్లాలో బృందం పర్యటించింది. పర్యటనలో ప్రభుత్వం నిర్వహిస్తున్న పలు ఆరోగ్య సంస్థల్లో అందిస్తున్న సేవలు, మానవ వనరులు, ఔషధాల లభ్యత, మాతృ శిశు ఆరోగ్య సేవల అమలు, ఆయుష్మాన్ భారత్ వెల్‌నెస్ సెంటర్ల ప్రగతి తదితర అంశాలను పరిశీలించారు. సంగారెడ్డి జిల్లా ప్రభుత్వాసుపత్రి, పటాన్‌చెరు ఏరియా హాస్పిటల్, నారాయణఖేడ్ ఏరియా హాస్పిటల్,సదాశివ్ పేట సిహెచ్‌సి, ఆత్మకూరు, కంగ్టి, ఆర్‌సీ పురం ప్రాథమిక కేంద్రాలు, మార్క్స్ నగర్ యూ పి హెచ్ సి, ఇందిరానగర్ బస్తీ దవాఖాన, ఆయుష్ డిస్పెన్సరీలను సందర్శించి వివరాలు సేకరించారు. సిఆర్ఎం బృందానికి టీమ్ లీడర్‌గా ప్రాంతీయ డైరెక్టర్, ఆరోగ్యం & కుటుంబ సంక్షేమ శాఖ,(తెలంగాణఆంధ్ర ప్రదేశ్) డాక్టర్ అనురాధ మేడోజు వ్యవహరించారు. సభ్యులుగా డాక్టర్ సంతోష్ నాయక్ - పీపీపీ కన్సల్టెంట్, ఎస్ హెచ్ ఎస్సర్సీ డాక్టర్ రంజన్ దాస్ - ఆయుష్ప్రతినిధి, ఎన్ ఐ ఐ ఎం హైదరాబాద్ డాక్టర్ కవిత చౌదరి -సీనియర్ కన్సల్టెంట్, ఎన్ యూ హెచ్ ఎం, ఎం హెచ్ ఎఫ్ డబ్ల్యూ అరుణ్ శర్మ - ఫైనాన్స్ కన్సల్టెంట్, పి ఎం అభిం ఆర్తి నరేడా - కన్సల్టెంట్, ఐ డి ఎస్ పి, ఎన్ సిడిసీ డాక్టర్ పర్వీన్ సుల్తానా - సీనియర్ మెడికల్ ఆఫీసర్ హైదరాబాద్ లు వ్యవహరించారు. ఈ సందర్భంగా కామన్ రివ్యూ మిషన్ బృందం సమర్పించిన సూచనలను జిల్లాలో అమలుపచ్చి వైద్య ఆరోగ్య సేవలను మెరుగుపరిచేందుకు కృషి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు . ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి నాగ నిర్మల , జి జి హెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ , డిసిహెచ్ఓ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామిక వాడలో అగ్నిప్రమాదాల నియంత్రణ పై మాక్ డ్రిల్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 6 : సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, ఎన్‌డీఆర్ఎఫ్ (జాతీయ విపత్తు నిర్వహణ బృందం), శాఖల సమన్వయంతో మాక్ డ్రిల్ నిర్వహణ కార్యక్రమం ను పఠాన్ చెరు పారిశ్రామిక వాడలోని పాశ మైలారం లోని ఓ పరిశ్రమ లో ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, ఎన్‌డీఆర్ఎఫ్ శాఖల సమన్వయంతో అపియోరియా ఫార్మా కంపెనీలో మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని, పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన తక్షణ చర్యలు, సిబ్బంది సురక్షితంగా బయటపడే మార్గాలు, రక్షణ బృందాల సమన్వయం వంటి అంశాలపై జాతీయ విపత్తు నిర్వహణ బృందం ద్వారా ప్రాక్టికల్ డెమోన్స్ట్రేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. పరిశ్రమల్లో అగ్నిప్రమాదాల నివారణకు ప్రతి ఉద్యోగి సేఫ్టీ నియమాలను పాటించడం అత్యంత కీలకం అన్నారు. వివిధ శాఖల సమన్వయంతో ఈ మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఎన్‌డీఆర్ఎఫ్, ఫైర్ అధికారులు, పటాన్ చెరు డిఎస్పీ ప్రభాకర్, ఎ.ఆర్ డిఎస్పీ నరేందర్ ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, లాలునాయక్, పరిశ్రమల శాఖ అధికారులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

- చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ సభ్యులు

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 6: చిట్యాల మండలం ఏపూరు గ్రామంలో 1,2 అంగన్వాడీ కేంద్రాలను తెలంగాణ చైల్డ్ రైట్స్, ప్రొడక్షన్ సభ్యులు సరిత, చందనలు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పూర్వ ప్రాథమిక విద్యను, సరుకుల నాణ్యతను గర్భిణీలకు, బాలింతలకు చిన్నారులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఇతర అధికారులు గణేష్, రాము, డీఈవో బిక్షపతి, ఎంఈవో సైదా నాయక్, ఐసీడీఎస్ సిబ్బంది లావణ్య కుమారి, వెంకటమ్మ, నాగమణి, అంగన్వాడీ టీచర్లు ధనలక్ష్మి, అంశమ్మ వారితో ఉన్నారు.

యాచకులకు దుప్పట్ల పంపిణీ

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 6: ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మేడి హరికృష్ణ అన్నారు. నల్గొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి పరిధిలో జాతీయ రహదారిపై గల సాయి మందిరం వద్ద గల యాచకులకు గురువారం ఆయన దుప్పట్లను పంపిణీ చేశారు. చలికి వారు ఇబ్బంది పడకుండా మానవతా దృక్పథంతో ఈ సేవకు పూనుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి సేవకులు భోజరాజు, శకుంతల, హైమ, కుమ్మరి రవి, రాంబాబు, ఎల్లయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆసుపత్రిలో అక్కని చూడడానికి వెళుతూ..

యువకుడు మృతి

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 6: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడని చిట్యాల ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా.. సూర్యాపేట జిల్లా కేసారం గ్రామానికి చెందిన సువర్ణ రాజు (19), గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన సోదరిని చూడడానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. చిట్యాల దాటాక అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనగా బలమైన గాయాలయ్యాయి. నార్కట్పల్లి కామినేని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటనపై తండ్రి లింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'వందేమాతరం' సామూహిక గీతాలాపన జయప్రదం చేయాలి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 6: మహాకవి శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ "వందే మాతరం" జాతీయ గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 7న (శుక్రవారం) సంగారెడ్డి కలెక్టరేట్ జిల్లా కార్యాలయల ఆవరణలో ఉదయం 10 గంటలకు సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పి. ప్రావీణ్య జిల్లా కలెక్టర్, గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ విద్యాసంస్థలు ఉదయం 10 గంటలకు వందేమాతర గేయాన్ని ఆలపించాలని సూచించారు. ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని మరింతగా పెంపొందించేందుకు, భారతదేశ చరిత్రలో వందే మాతరం గీతానికి గల ప్రాధాన్యతను చాటి చెప్పేందుకు వీలుగా వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమం అనంతరం సంబంధిత ఫోటోలు , వివరాలను అదే రోజు సాయంత్రం ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుందని అధికారులను ఆదేశించారు.

వాసవి మాత ఆలయంలో లక్ష దీపోత్సవం

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయపేట్ నవంబర్ 6: మక్తల్ పట్టణంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కార్తీక పౌర్ణమి నాడు లక్ష దీపోత్సవం, జ్వాలాతోరణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సర్వపాపహరణం కార్తీక పౌర్ణమి జ్వాలాతోరణం కింద నుండి వెళ్లినచో మన పాపాలన్ని తొలిగిపోతాయని, అందరూ ఆరోగ్యంగా సుభిక్షంగా ఉంటారని ని, ఈ కార్తీకమాసంలో విశేష పూజలు, దీపాలు, నోములు, జ్వాలా తోరణం చేయడం వలన వేయి రేట్లు ఫలం దొరుకుందని పురాణాలలో, ఇతిహసాలలో చెప్పబడినది. మహిళలు ఎంతో ఉత్సాహంగా ముగ్గులను శోభ, సుజాత, భార్గవి, వీణ, నిరోషా, నిర్మల, కీర్తి, శ్రీలత, జ్యోతి, అశ్విని, అనూష, పార్వతి, శిరీష, సౌమ్య,11 రోజులు అద్భుతంగా ముగ్గులు వేశారు. ముఖ్యంగా కార్తీక పౌర్ణమి నాడు మాత్రమే ఈ జ్వాలా తోరణ కార్యక్రమం చేయడం చాలా విశేషమని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్త శ్రీనివాస్ గుప్తా అధ్యక్షుడు కట్టా సురేష్ మహిళా సంఘం అధ్యక్షురాలు బోరిశెట్టి పద్మ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొరిశెట్టి భాస్కర్, ప్రముఖులు ఆర్య వైశ్య సంఘం, మహిళా సంఘం, యువజన సంఘము సభ్యులు,పురుషులు, చిన్నారులు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.



జూబ్లీహిల్స్ లో సునీతమ్మ గెలుపు ఖాయం

- పెంట్లవెల్లి మండల బీఆర్ఎస్ నాయకులు

ప్రతిపక్షం, కొల్లాపూర్, నవంబర్ 6: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా గురువారం హైదరాబాదులోని రహ మత్ నగర్, బోర బండ బస్తీ లలో, కొల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన పెంట్లవెల్లి మండల ప్రజలను కలిసిన మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు. అనంతరం మాజీ ఎమ్మెల్యేతో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కచ్చితంగా మాగంటి సునీత గోపీనాథ్ కారు గుర్తుపై గెలవబోతున్నారని నాయకులు చెప్పారు. ఆయా బస్తీ లలో తాము చేసిన ప్రచారంలో ప్రజలు పూర్తిస్థాయిలో కారు గుర్తుపై ముగ్గు చూపడం గమనించామని వారు కేటీఆర్ కు వివరించారు. మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు మరువమని ఆయా బస్తీ ప్రజలు చెప్పడం సంతోషంగా భావించామన్నారు. దీంతో జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించబోతుందని కేటీఆర్ కు పెంట్లవెల్లి మండల నాయకులు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో పెంట్లవెల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు, రాజేష్, సీనియర్ నాయకులు విజయ రామారావు సురేందర్, బీఆర్ఎస్వీ నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- రెండింటిని సమానంగా తీసుకోవాలి
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి



ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 6 : క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటిని సమానంగా తీసుకోవాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి అన్నారు.గురువారం గోపాలపేట మండలంలోని బుద్దారం లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 11వ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం నిర్వహిస్తుండగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన, జాతీయ పతాక ఆవిష్కరణ చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. వీరితో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి,అచ్యుత్ రామారావు తదితరులు పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ ఆటల పోటీల్లో వనపర్తి జిల్లా నుంచి గోపాల్పేట, పెద్దమందడి, కొత్తకోట, నాగర్ కర్నూల్ జిల్లా నుంచి కొల్లాపూర్, తెలకపల్లి, వెల్దండ, మన్ననూరు పాఠశాలల జట్లు పాల్గొన్నాయి.జోనల్ స్థాయిలో గెలిచిన చెట్లు రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎంపిక కానున్నాయి. అంతకుముందు కార్యక్రమంలో చిన్నారెడ్డి ప్రసంగిస్తూ వనపర్తి కేవలం వనాలపర్తి మాత్రమే కాదని ఇది ఆటల పర్తి కూడా అని అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటిని విద్యార్థులు సమానంగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మీరు కూడా ఆత్మవిశ్వాసంతో చదువుతోపాటు క్రీడల్లో కూడా అత్యున్నతంగా రాణించాలని తెలియజేశారు. గోపాల్పేట ప్రభుత్వ బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల తనకు బిడ్డలాంటిదని, ఈ పాఠశాల ఏర్పాటు కోసం తాను ఎంతో కృషి చేసినట్లు గుర్తు చేశారు. ఈ పాఠశాలకు మరో ఎకరా స్థలాన్ని క కేటాయించేందుకు ప్రతిపాదించినట్లు, దాన్ని పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం చొరవ తీసుకొని కేటాయించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. క్రీడలని పాఠశాల స్థాయిలో మాత్రమే కాకుండా భవిష్యత్తులో కూడా ముఖ్యం ఆడుతూ కొనసాగించాలని తెలియజేశారు. అలా చేయడం ద్వారా శారీరక మానసిక ఆరోగ్యం బాగుంటుందని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా వైద్య విద్యలో సీటు సంపాదించిన విద్యార్థిని హిమబిందు, కబడ్డీలో జాతీయస్థాయిలో శిక్షణ పొందుతున్న విద్యార్థిని నందినిని ముఖ్య అతిథులు శాలువాతో సన్మానించారు. అనంతరం స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి హాజరై ఆటల పోటీలను ప్రారంభించిన ముఖ్య అతిథులను పాఠశాల సిబ్బంది సత్కరించారు.

చేపల మార్కెట్ను వినియోగంలోకి తేవాలి

గోపాల్పేట మండల కేంద్రంలో నిర్మించిన చేపల మార్కెట్ను వినియోగంలోకి తేవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. గోపాల్పేట లో నిర్మించి నిరుపయోగంగా ఉన్న చేపల మార్కెట్ను కలెక్టర్ పరిశీలించారు. దీని వినియోగంలోకి తీసుకురావడానికి వెంటనే బోర్ ద్వారా నీటి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘం తరపున సభ్యులు కలెక్టర్ ను శాలువాతో సత్కరించారు.

స్థల పరిశీలన చేసిన కలెక్టర్

మండల పరిధిలోని పోలికపాడు గ్రామ పరిధిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ గురువారం సందర్శించి పరిశీలించారు. ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన మ్యాప్ ను పరిశీలన చేశారు. యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు సంబంధిత ప్రదేశంలో కనెక్టివిటీ,సౌకర్యాల గురించి ఆరా తీశారు.కార్యక్రమంలో డివైస్ సుధీర్ రెడ్డి, డిసిఒ ప్రమోద, జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, తాసిల్దార్ తిలక్ రెడ్డి, ఎంపీడీవో అయిషా, తదితరులు పాల్గొన్నారు.

భారత్‌కు అతిపెద్ద, వరల్డ్ క్లాస్ బ్యాంకుల అవసరం ఉంది. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఆర్బీఐతోపాటు అన్ని బ్యాంకులతోనూ చర్చిస్తున్నాం. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానంగా దృష్టిసారించాం. గత పదేళ్లలో మూలధన వ్యయం ఐదు రెట్లు పెరిగింది.

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

పారదర్శక పాలనే లక్ష్యంగా ముందుకు

- **అవినీతిని పెకలించడమే లక్ష్యం**
- **అవినీతి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి**
- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 6:- జిల్లాలో అవినీతిని అంతమొందించి జిల్లాలో పారదర్శకత పాలనే లక్ష్యంగా ముందుకు పోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఎవరైనా అధికారులు ,లేదా వాళ్ల సిబ్బంది, అధికారులకు అవినీతి ఆలోచన ఉంటే విరమింప చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జిల్లా అధికారులకు సూచించారు. ప్రజల పట్ల ఉద్యోగులు జాలి కరుణ కలిగి ఉండి వృత్తిపట్ల నిబద్ధతగా ఉండాలన్నారు. పేదలను పీడించే అవినీతి ఉద్యోగుల భరతం పడతామన్నారు. ఉద్యోగులందరూ నీతి నియమాలు అలవర్చుకోవాలని సూచించారు. వీరి శాఖలో పేరుకు పోతున్న అవినీతిని కూకటి వేళ్లతో పెకలించడమే లక్ష్యంగా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు ప్రభుత్వ ఉద్యోగులేనని తెలిపారు. అధికారులందరూ ఏకధాటిగా అవినీతిపై ఉక్కు పాదం మోపాలన్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత మెదక్ జిల్లాగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. అనంతరం అవినీతిపై ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో , జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఏ శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి భుజంగారావు, మెదక్ ఆర్డిఓ రమాదేవి ,అధికారులు, తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు నివారించాలి

- **డ్రగ్స్ నిర్మూలన, పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలి**
- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 6: జిల్లాలో బాల్య వివాహాలు పూర్తిగా నివారించి, డ్రగ్స్ నిర్మూలన, ఫోక్సో చట్టం పై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్మూలించాలని, బాల కార్మికులు లేకుండా చూడాలని,బాలల హక్కులను రక్షించాలని సూచించారు. డ్రగ్స్ నిరోధకం, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించి యువతి యువకులు సన్మార్గం వైపు వెళ్లే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ శ్రీనివాసరావు, డీఆర్ఓ భుజంగరావు, ఆర్డీవో రమాదేవి, ట్రేని ఆర్డీవో మహమ్మద్ అహ్మద్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సంక్షేమ శాఖ అధికారి హేమా భార్గవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కారిస్తాం

- **రోడ్లను పరిశీలించిన డీఈఈ వెంకటేశ్వర్**

ప్రతిపక్షం, మిడిదొడ్డి, నవంబర్ 6: రోడ్డు సమస్యను పరిష్కారిస్తామని రోడ్లు భవనాల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్ అన్నారు. మిడిదొడ్డి మండల అందే గ్రామానికి చెందిన జేఏసీ, అఖిలపక్షం నాయకులు అందరూ కలిసి మారుమూల ప్రాంతమయిన అందే గ్రామానికి రోడ్లు వేయాలని ఇటీవల పలు శాఖల అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. గురువారం రోడ్లు భవనాల శాఖ డీఈఈ వెంకటేశ్వర్ సిద్దిపేట నుండి దౌల్తాబాద్ ఎక్స్ రోడ్, అందె గ్రామం వరకు గుంతలమయమైన రోడ్డును పరిశీలించారు. త్వరలోనే సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. అందే గ్రామానికి గత ఇరువై సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వేసిన రోడ్లేనని, తెలంగాణ రాష్ట్రంలో రోడ్లు వేయకపోవడం, పాత రోడ్లన్నీ పూర్తి గుంతల మయం అవ్వడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను పరిష్కరించి వెంటనే రోడ్డు వేయాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ వారాల రాజు కుమార్, బుంగరి సత్తయ్య, చుక్క శంకర్, అందె ప్రవీణ్, కడారి యాదగిరి, పర్శరాములు, పోచయ్య, సంతోష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన తండాలకు రోడ్ల అనుసంధానం

- **రూ.24.80 కోట్లతో 13 బీటీ రోడ్లకు అనుమతి**

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 6: మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అనుసంధానం కాని గిరిజన ఆవాసాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. "బీటీ రోడ్స్ టు ఎస్టీ హాబిటేషన్స్" గ్రాంట్ కింద మొత్తం రూ.24.80 కోట్ల వ్యయంతో 13 రోడ్డు పనులకు ఆమోదం లభించింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్లు మంజూరుకావడంతో గిరిజన తండాల్లో ఆనందం వ్యక్తమైంది. రహదారుల అభివృద్ధికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు గిరిజన వాసులు కృతజ్ఞతలు తెలిపి, హర్షం వ్యక్తం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని గిరిజన తండాలకు రోడ్డు సదుపాయాలు అందుబాటులోకి రావడం, దశాబ్దాల కళ నెరవేరుతుండడంతో గిరిజన తండావాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తండాల అభివృద్ధికి రహదారులు ఎంతగానో దోహద పడతాయని వారు పేర్కొంటున్నారు.

సునీత గెలుపుతో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపుదాం

- **బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ "వంటేరు"**

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 6: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ఉప ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి మద్దతు తెలుపుతూ ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్ నగర్ లో బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న జరగబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థినీ గెలిపించి ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను తెలంగాణ ప్రజలకు చాటాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శిరీష బాబురావు, రాగిడి లక్ష్మారెడ్డి ధనలక్ష్మి, సావిత్రి, హైదర్ పటేల్, ఎర్రవల్లి మాజీ సర్పంచ్ బాలరాజు, బీఆర్ఎస్ నాయకులు చిట్యాల ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

8న దుద్దెడలో ఉచిత హోమియో వైద్య శిబిరం

- **జిల్లా ఆయుష్ విభాగం క్యాంప్ ఇంఛార్జి డాక్టర్ అనిల్ కుమార్**

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, నవంబర్ 6: హైదరాబాద్ రామంతాపూర్ లోని ధర్మ కిరణ్ ప్రభుత్వ హోమియో ఆసుపత్రి, సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆయుష్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 8న సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా ఆయుష్ విభాగం క్యాంప్ ఇంఛార్జి డాక్టర్ కె.అనిల్ కుమార్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో హైదరాబాద్ నుంచి వచ్చే వైద్య బృందం రోగులకు హోమియోపతి చికిత్సను అందజేస్తారని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులైన అలర్జీ, ఆస్తమా, సైనసైటిస్, శ్వాసకోశ వ్యాధులు, చర్మ వ్యాధులైన గజ్జి, తామర, పులిపిర్లు, సోరియాసిస్, జీర్ణకోశ వ్యాధులైన అల్సర్, అజీర్తి, కడుపులో మంట, పైల్స్, ఫిషర్స్, ఫిస్టులా, జీవనశైలిలో మార్పుల వలన వచ్చే బీపీ, షుగర్, థైరాయిడ్, కీళ్ల సంబంధ వ్యాధులు స్పాండిలైటిస్, ఆర్థరైటిస్, సయాటికా, మోకాళ్ళ నొప్పులు, ఆనెలు వంటి వ్యాధులకు చికిత్స అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలందరు వినియోగించుకుని వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- **మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్**
- **మెదక్ లో గురుకుల పాఠశాల, కళాశాలల 11వ జోనల్ స్థాయి పోటీలు ప్రారంభం**

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 6: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శరీర దారుఢ్యంతో పాటు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల మైదానంలో మూడు రోడుల పాటు జరిగే 11వ జోనల్ స్థాయి పోటీలను క్రీడా జ్యోతిని వెలిగించి డీఎస్పీ ప్రసన్నకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించగా గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరి జీవితంలో శారీరక దృఢత్వం అవసరమని ఆటలు ఆడితే దృడంగా ఉంటారన్నారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోని రాణించలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమి చెందిన వారు నిరుత్సాహ పడకుండా మళ్లీ గెలుపు కోసం ప్రయత్నం చేయాలన్నారు. అంతకు ముందు పట్టణ సీఐ మహేశ్ మాట్లాడూతూ గెలుపోటములు జీవితంలో కష్టసుఖాల లాంటివన్నారు. క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటా కింద మంచి ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా తొలిరోజు పలు క్రీడలలో పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, జోనల్ అధికారిణి ప్రత్యూష,వ్యాయమ ఉపాధ్యాయులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

- **కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్**

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 6: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు రావలసిన పెండింగ్ వేతనాలు, పీఆర్సీ బకాయిలను తక్షణం విడుదల చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయంలో డాక్టర్ ధనరాజ్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సాయిబాబా మాట్లాడుతూ గత రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఉద్యోగులు కుటుంబాలను పోషించలేని స్థితి నెలకొందని అన్నారు. ప్రతినెలా ప్రభుత్వ ఉద్యోగులతో పాటు తమకూ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 17న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ కోటి వద్ద కమిషనర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లగిశెట్టి రాజు, అశోక్, సోఫాన్ రాథోడ్, వెంకటేశ్వర్లు, రవికుమార్, నాగమణి, హమీద్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. ఒకరి రిమాండ్

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 6: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని అక్కెనపల్లి పెద్ద వాగు(మోయ తుమ్మెద వాగు) నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను పట్టుకుని, ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ ఆయన కందికట్ల పరశురాములను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు పంపినట్లు రాజగోపాలపేట ఎస్ఐ టి. వివేక్ తెలిపారు. నంగునూరు గ్రామంలో హెడ్ కానిస్టేబుల్ రంగారెడ్డి, పోలీస్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా పెద్ద వాగు నుండి ట్రాక్టర్ డ్రైవర్ కమ్ ఓనర్ కంది కట్ల పర్శరాములు దొంగతనంగా ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డాడని తెలిపారు. అతని పైన సుమోటో కేసు నమోదు చేసి గురువారం మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామన్నారు. నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించడంతో అట్టి వ్యక్తిని సిద్దిపేట జిల్లా జైలుకు తరలించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ టి వివేక్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ద్విచక్ర వాహన దొంగ అరెస్ట్, రిమాండ్

- **సాంకేతిక ఆధారాలతో కేసు ఛేదించిన టూ టౌన్ పోలీసులు**

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 6 : పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ ముందు పార్క్ చేసిన ఎక్స్ఎల్ ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన దొంగను టూ టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం సిద్దిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్‌కు చెందిన పడతం గంగారాం అనే వ్యక్తి గత కొన్నేళ్లుగా సిద్దిపేట పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో చింతపండు, చక్కెర, కుడుకలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అక్టోబర్ 26న పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద తన ఎక్స్ఎల్ వాహనాన్ని పార్క్ చేసి లోపలికి వెళ్లి భోజనం చేసి తిరిగి వచ్చినప్పుడు వాహనం కనిపించలేదు.దీంతో గంగారాం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వాహనం డిక్కీలో రూ.23,000 నగదు, చింతపండు, చక్కెర, కుడుకలు కలిపి సుమారు రూ.2,000 విలువైన వస్తువులు ఉన్నాయని వివరించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన స్థలంలోని మరియు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమరా ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. ప్రస్తుతం తోట్ల రాంనగర్, బారాహీమాంలో నివసిస్తున్న చార్వాదాన్ కాలనీకి చెందిన కూలీ అబ్దుల్ రహీం (42)నే దొంగగా గుర్తించారు. గురువారం అతడిని అదుపులోకి తీసుకుని, రూ.23,000 నగదు, దొంగిలించిన ఎక్స్ఎల్ వాహనం, నేరానికి ఉపయోగించిన మరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.సాంకేతిక ఆధారాలతో కేసును విజయవంతంగా ఛేధించిన క్రైమ్ కానిస్టేబుళ్లు కనకరాజు, ప్రశాంత్ రెడ్డిలను సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐ ఉపేందర్ అభినందించారు.

విద్యార్థులకు ఇంటర్ విద్య కీలకమైనది

- **డీఐఈవో రవీందర్ రెడ్డి**



ప్రతిపక్షం, నంగునూరు, నవంబరు 6: విద్యార్థి దశలో ఇంటర్ విద్య చాలా కీలకమైనదని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈవో) రవీందర్ రెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్లో బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, అక్కెనపల్లి మోడల్ స్కూల్, నర్మెట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను గురువారం డీఐఈవో రవీందర్ రెడ్డి తనిఖీ చేశారు. ఆయా కళాశాలల్లో రికార్డులను, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, తరగతి గదుల్లో విద్యా బోధనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థులు బాగా ప్రిపేర్ కావాలని చెప్పారు. విద్యార్థులు 100 శాతం కళాశాలకు హాజరు అయ్యేలా తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ ఆదేశాల మేరకు కళాశాలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల అకాడమిక్ కార్యక్రమాలతో పాటు, విద్యార్థులు పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవుతున్నారు అనే అంశంపై ప్రత్యేక దృష్టి నిలిపినట్లు తెలిపారు. విద్యార్థులు శత శాతం తరగతులకు హాజరయ్యే విధంగా వారిలో ప్రోత్సాహం నింపేందుకు తనిఖీ చేపట్టామని చెప్పారు. కళాశాలల మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.56 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. వీటిలో నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.14 లక్షల నిధులను కేటాయించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నంగునూరు జూనియర్ కళాశాల ప్రధానాచార్యుడు శివకోటి, అక్కనపల్లి మోడల్ స్కూల్ ప్రధానాచార్యుడు జానయ్య, నర్మెట కేజీబీవీ ఎస్ఓ పద్మ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

"

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ ఆలోచనను చంద్రబాబు మార్చుకునేలా ఉద్యమాలు చేపట్టాలి. దీనిపై 'రచ్చబండ' ద్వారా కోటి సంతకాల సేకరణ చేపడుతున్నాం. ఈ ఉద్యమాలు ఎలా ఉండాలంటే చంద్రబాబుకు షాక్ తగిలేలా ఉండాలి. ఫీజు రీయింబర్స్‌మెంటుపై కూడా డిసెంబర్ వరకు టైమ్ ఇస్తాం. ఆ తరువాత ఉద్యమం చేస్తాం. గ్రామస్థాయి నుంచి విద్యార్థి విభాగం ఉండాలన్నారు.

- ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్

ప్రాంతీయం

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ప్రధానోపాధ్యాయురాలు డి. కృష్ణవేణి

ప్రతిపక్షం, కోహెడ, నవంబర్ 6: పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించే ప్రత్యేక తరగతుల సందర్భంగా నెల రోజుల పాటు సాయంత్రం పూట అల్పాహారాన్ని అందించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వర్కోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. కృష్ణవేణి అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కేంద్రానికి చెందిన దాత సిరికొండ భూశంకర్ చారి నెల రోజులకు సరిపడా అల్పాహారానికి అవసరమైన డబ్బులను సమకూర్చారు. దీంతో గురువారం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని చెప్పారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తులో దాతలను స్ఫూర్తిగా తీసుకొని పేద విద్యార్థులకు అండగా నిలవాలని సూచించారు. దాత భూశంకర్ చారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్. రామ చంద్రారెడ్డి, సంగు రామకృష్ణ, ఉపేందర్, పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ప్రచారం

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 6: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ మద్దతుగా సిద్దిపేట జిల్లా కాంగ్రెస్‌అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి గురువారం అంజయ్య నగర్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధికి, పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాడి పల్లి శ్రీనివాస్, గూడెం శ్రీనివాస్ రెడ్డి లతోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ అంటే ఇట్లా ఉండాలి

- సిద్దిపేట కమిషనర్ కు ప్రజల ప్రశంసలు
- విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పోలీస్ రాజులు



ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 6 : పోలీస్ అంటే ఇట్లా ఉండాలి అని ప్రజలు చెప్పేలా సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయకుమార్ మానవతా దృక్పథంతో అందరి మనసులు గెలుచుకున్నారని విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పోలీస్ రాజులు పేర్కొన్నారు. సాధారణ పౌరుడు తన సమస్యతో వస్తే ఆయనను ఆతిథ్యంతో స్వాగతించి, శ్రద్ధగా వినడం ద్వారా పోలీస్ వ్యవస్థకు కొత్త గౌరవం తీసుకువస్తున్నారని అన్నారు. చట్టం ముందు అందరూ సమానమే అనే సూత్రాన్ని ఆచరణలో చూపిస్తున్న విజయకుమార్ సేవా ధోరణి ప్రజలతో పాటు పోలీసు వర్గాల్లోనూ ప్రశంసలు పొందుతోందన్నారు. జిల్లా విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం తరఫున కమిషనర్ విజయకుమార్ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని రాజులు తెలిపారు.

పని హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- హామీ కోల్పోతున్న ఉపాధి కూలీలు
- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 6: రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో పనుల కల్పన తగ్గడం వలన పేదలు వందల కోట్ల రూపాయలు నష్టపోతున్నారని, హక్కుగా పొందాల్సిన ఉపాధిని హామీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని గురువారం నాడు గజ్వేల్ లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్లో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ అగ్రహన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 50 లక్షల కూలీలకు 12 కోట్ల కూలీ దినాలను ఇవ్వాల్సిన ప్రభుత్వం 6 కోట్ల పని దినాలను మాత్రమే ఇచ్చి మెట్టమెదటి సారిగా రాజ్యాంగ బద్ధంగా కూలీలకు అందాల్సిన ఉపాధి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అడుగడుగునా కాలరాస్తుందన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలో 40 శాతం పని దినాలు తగ్గాయన్నారు. ఉపాధి కూలీలకు అండగా ఉండాలని చట్టాన్ని తిసుకవచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కుడా కూలీలకు ఇంత పెద్ద ఎత్తున కోత విధిస్తూ కూలీల పొట్టకొడుతున్న కేంద్ర ప్రభుత్వం మిదా కొట్లాడకుండా కూలీలకు జరిగే అన్యాయంలో కాంగ్రెస్ కుడా బాగస్వామ్యం కావడం బాధకలిగిస్తుందన్నారు. వెంటనే కూలీల తరుపున కేంద్ర ప్రభుత్వంపై పోరాడాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, స్వామి, దెవేందర్, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని వారిపై కఠిన చర్యలు

- జిల్లా వైద్య అధికారి ధనరాజ్

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 6: ల్యాబ్ టెక్నీషియన్లు సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య అధికారి ధనరాజ్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లకు జిల్లా వైద్య అధికారి డాక్టర్ ధనరాజ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ ఓ మాట్లాడుతూ ప్రతి పీహెచ్సీ, సీహెచ్సీ, జిల్లా హాస్పిటల్లలో పేషంట్లకి నిర్వహించే పరీక్షలలో ఎలాంటి అలసత్వం వహించవద్దని, సకాలంలో రిపోట్స్ అందించాలని తెలిపారు. డ్యూటీ విషయంలో సమయపాలన పాటించడంతో పాటు రికార్డులు మెయింటైన్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారితో పాటు సీనియర్ ఎంటోమోలాజిస్ట్ డా. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ తుపాకితో వ్యక్తి హల్‌చల్

- భూ వివాదంలో వ్యక్తులకు బెదిరింపులు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 6 : గత కొన్ని సంవత్సరాలుగా ఇద్దరు వ్యక్తుల మధ్య భూ వివాదం కొనసాగుతుంది. ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్ తో వరి పంట కొసేందుకు వెళ్లగా వరి పొలాల వద్దకు మరో వ్యక్తి గన్ తో వచ్చి బెదిరింపులకు పాల్పడడంతో సదరు వ్యక్తిని పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అది నకిలీ తుపాకీ అని పోలీసులు నిర్ధారించారు. ఈ సంఘటనపై ఘనపూర్ పోలీస్ స్టేషన్లో సీఐ జార్జ్ మీడియాతో మాట్లాడుతూ హవేలీ ఘనపూర్ కు చెందిన ఎల్లం కు హైదరాబాద్ కు చెందిన ఓ వ్యక్తి మధ్య భూ వివాదం ఉంది. ఇరువురు కోర్టును ఆశ్రయించారు. ఇరువురి మధ్య పలు మార్లు గొడవలు సైతం జరిగినట్లు తెలిసింది. భూమిలో వరి పంట వేయడం తో పంట కోసేందుకు ఎల్లం కోర్టు నుంచి ఆర్డర్ తీసుకువచ్చాడు. ఆర్డర్ మేరకు వరి పంటను కోసే యంత్రాలతో పొలం వద్దకు చేరుకోగా ఎల్లం ను కొంత మంది అడ్డుకున్నారు. ఇద్దరి మధ్య జరిగిన గొడవలో చంపుతానని బెదిరించినట్టు బాధితుడు తెలిపాడు. ఇద్దరి మధ్య గొడవ సాగుతున్న తరుణంలో అక్కడే ఉన్న ఒకరి వద్ద ఓ తుపాకీని గుర్తించారు. దీనితో ఆందోళన చెందిన ఎల్లం అతని వద్ద ఉన్న తుపాకీ లాగేసుకుని వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారని సీఐ జార్జి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

హుస్నాబాద్ రోడ్లు గుంతలమయం

- వెంటనే మరమ్మతులు చేపట్టండి
- బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 6 : ఇటీవల హుస్నాబాద్ పట్టణంలో కురిసిన భారీ వర్షాల కారణంగా హుస్నాబాద్ పట్టణం నుంచి కరీంనగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతింది. రోడ్డంతా గుంతలమయమై వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి గురువారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు జరిగే కరీంనగర్ రహదారిపై భారీ వర్షాల కారణంగా గుంతలు ఏర్పడినా, వాటిని మరమ్మతు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంతలతో ప్రమాదకరంగా మారిన రోడ్డును వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత నియోజకవర్గ అభివృద్ధిపై నిర్లక్ష్యం చూపుతున్నారని ఆయన విమర్శించారు. ఇకనైనా మంత్రి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని మల్లికార్జున రెడ్డి హితవు పలికారు.

నియోజకవర్గ సీపీఐ కన్వీనర్‌గా సత్యనారాయణ

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 6 : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేశం గురువారం అనభేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళావేని శంకర్ హాజరయ్యారు. సమావేశం అనంతరం హుస్నాబాద్ నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కనుకుంట్ల శంకర్ హుస్నాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా, జాగీర్ సత్యనారాయణ కన్వీనర్‌గా, అందే స్వామి, ఆదిరి శ్రీనివాస్ కో కన్వీనర్‌లుగా, గడిపె మల్లేశ్ కోశాధికారిగా ఎన్నికయ్యారు. అదనంగా 43 మంది కౌన్సిల్ సభ్యులుగా ఎంపికయ్యారు.

9వ షెడ్యూల్లో 42%బిసి రిజర్వేషన్లను చేర్చాలి

- బీఎల్పీ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు తలారి ప్రవీణ్

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 6: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్పీ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు తలారి ప్రవీణ్ మాట్లాడారు. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో బిసిలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఎల్పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వినతి పత్రాన్ని అందచేయటం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మార్చ్ 2025లో బీసీ కులాల ప్రజలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో42% రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర అసెంబ్లీలో బిల్లులను ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర గవర్నర్లకు పంపి ఏడు నెలలు అవుతున్న కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్ లోనే ఉందని విమర్శించారు. ఈ నేపథ్యంలో రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బిసి బిల్లులను 9వ షెడ్యూల్లో చేర్చందకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో బీఎల్పీ ఉపాధ్యక్షులు కోటగిరి ఆంజనేయులు, నాయకులు దబ్బెట ఆనంద్, శివరాత్రి శ్రీనివాస్, దబ్బెట భగవాన్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

42% రిజర్వేషన్ కోసం మౌన దీక్ష

ప్రతిపక్షం,తొగుట, నవంబర్ 6: తొగుట మండల కేంద్రంలోని బీసీ, ఎస్సా, ఎస్టీ, జేఏసీ ఆధ్వర్యంలో బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయా రంగాలలో 42% రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ మౌన దీక్ష చేయడం జరిగిందని జేఏసీ మండల కన్వీనర్ పాత్కూల వెంకటేష్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మండల కన్వీనర్ పాతుకుల వెంకటేశం మాట్లాడుతూ బీసీ లకూ 42% రిజర్వేషన్ కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేసారు. 18న రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంట్ సభ్యులకు జరగబోయే పార్లమెంట్ సమావేశాలలో బీసీలకు 42% బిల్లుని పార్లమెంట్లో ప్రవేశ పెట్టాలని వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. త్వరలోనె అఖిల పక్ష పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణ తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ కో కన్వీనర్ అక్కారం సత్తయ్య, ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు సిరివెని గోవర్ధన్, నాయకులు చిక్కుడు చంద్రం, చిప్ప నర్సింహులు, కుర్మ యాదగిరి, గొడుగు ఐలయ్య, కొంగరి నర్సింహులు, ప్రసాద్, భాస్కర్, రమేష్, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్ల సాధనే ధ్యేయం

- జేఏసీ కన్వీనర్ బాలరాజు
- బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మౌన దీక్ష

ప్రతిపక్షం, మిడిదొడ్డి, నవంబర్ 6: తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించుకోవడమే ధ్యేయంగా బీసీ జేఏసీ పోరాడుతుందని జేఏసీ కన్వీనర్ బాలరాజు అన్నారు. రిజర్వేషన్లు ఎవరిచే బిక్ష కాదు అని , బీసీల హక్కు అని తెలిపారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మౌన దీక్ష చేపట్టారు. బీసీల మౌన దీక్షలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ జెయింట్ యాక్షన్ కన్వీనర్ బాలరాజు మాట్లాడుతూ, కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల ప్రభుత్వం, నాయకులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. . ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు కాసా కిష్టయ్య, యాదగిరి, కుంట నారాయణఅమర్, దేవరాజు, గొల్లరాములు, హైమద్, మాజీ సర్పంచ్ రాములు కానుగంటి శ్రీనివాస్ సుదర్శన్ ఐలయ్య విద్యాసాగర్ స్వామి, కుమార్, మహేష్‌పలువురు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడప వద్దు

- నిండు నూరేళ్ల జీవితాన్ని కోల్పోవద్దు
- సిద్దిపేట సీపీ విజయ్ కుమార్

ప్రతిపక్షం, దుబ్బాక, నవంబర్ 6: మద్యం సేవించి వాహనాలు నడిపి నిండు నూరేండ్ల జీవితాన్ని రోడ్డు ప్రమాదాలలో కోల్పోవద్దని వాహనదారులకు, ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానని సిద్దిపేట సీపీ విజయ్ కుమార్ అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల పరిధిలోని పెద్ద గుండవెల్లి గ్రామంలో సీపీవిజయ్ కుమార్ పర్యటించి రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో నిఘా నేత్రాలను రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మహేష్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ విజయ్ కుమార్ మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ మద్యం సేవించి వాహనాలు నడిపితే రోడ్డుపై నడిచే వారికి కూడా ప్రమాదాలు జరిగి, వారి నిండు ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే 10 వేల జరిమాన అనేది ఇప్పుడు వచ్చింది కాదన్నారు. 2019 లోనే చట్టంలో ఉందన్నారు. ఈ జీవోను న్యాయస్థానంలో ఇప్పుడు అమలు చేస్తున్నారన్నారు. కాబట్టి ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేణుక మాత ఆలయ కమిటీ చైర్మన్ ఏల్పుల మహేష్, క్యాషియర్ కొండ్ర యాదగిరి, శాశ్వత కార్యదర్శి చందిరి దుర్గారెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లు గారి ప్రభాకర్, సభ్యులు రాళ్ల బండి ప్రవీణ్ కుమార్, గ్రామస్తులు బండారి రామచంద్రం, గుండెల రవి, పంజ సత్యం, దండు రాజు, చేపూరి శేఖర్ గౌడ్, గూడ శ్రీకాంత్ రెడ్డి, బాయికాడి లక్ష్మణ్, బిట్ల భాస్కర్, బిట్ల పరశురాములు, రాళ్ల బండి సంపత్, బిట్ల శేఖర్, కోర్ల మహేష్, రెడ్డబోయిన మల్లేష్, రాళ్ల బండి కుమార్, పరికి రవి తదితరులు పాల్గొన్నారు.

“

ప్రపంచంలో ప్రతి రోజూ కొత్త ఆవిష్కరణలు వస్తున్నాయి. ప్రతి రంగంలోనూ టెక్నాలజీ వినియోగం పెరుగుతోంది. దీన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలి. విద్యార్థులు లక్ష్యాలను నెరవేర్చడానికి బాటలు వేస్తాం. అంతర్జాతీయ స్థాయిలో సక్సెస్ కావడానికి విద్యార్థులు కృషి చేయాలి.

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

తన్నీరు సత్యనారాయణ రావుకు కేటీఆర్ నివాళి

- దశదిన కర్మకు హాజరైన పలువరు నేతలు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి దివంగత తన్నీరు సత్యనారాయణ రావు దశదినకర్మకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. గురువారం నార్సింగి లోని ఓం కన్వేషన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జరిగిన తన్నీరు సత్య నారాయణ రావు దశదినకర్మకు పలువురు నేతలు హాజరయ్యారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు రజితా రెడ్డి, ఎమ్మెల్యే కొత్తా ప్రభాకర్‌రెడ్డి, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ పాల్గొని తన్నీరు సత్యనారాయణ రావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

నేడు కరీంనగర్‌కు గవర్నర్ రాక

- ఎస్ యూ రెండవ స్నాతకోత్సవం
- ఎస్ యూ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్
- బందోబస్తు పరిశీలించిన సీపీ

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 6: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్ తెలిపారు. ఎస్ యూలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో వీసీ మాట్లాడుతూ మొదటి స్నాతకోత్సవం 2019లో జరగగా, రెండవ స్నాతకోత్సవం నవంబర్ 7న జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బిజె రావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. గవర్నర్ ఉదయం 10 గంటల వరకు చేరుకుంటారన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు 161 గోల్డ్ మెడల్, పీహెచ్ డీ పట్టాలు ప్రదానం చేస్తారన్నారు.

అనంతరం గవర్నర్ ప్రసంగం ఉంటుందన్నారు. పలు కార్యక్రమాల అనంతరం సెమినార్ హాల్ ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమం సవ్యంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు : సీపీ

గవర్నర్ పర్యటన కార్యక్రమం సందర్భంగా కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ఈ సందర్భంగా సీపీ స్వయంగా కార్యక్రమం జరిగే ప్రాంతాన్ని సందర్శించి భద్రతా చర్యలను పర్యవేక్షించారు. గవర్నర్ పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయబడిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమం జరిగే యూనివర్సిటీ మరియు కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేకించి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీం రావు, కమీషనరేట్ లోని పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి దివంగత తన్నీరు సత్యనారాయణ రావు దశదినకర్మకు హాజరై ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన నాయకులు రంగదాం పల్లి శ్రీనివాస్ గౌడ్ , కనకరాజు తదితరులు. - ప్రతిపక్షం, సిద్దిపేట

గంజాయి అమ్మినా.. సేవించినా చర్యలు తప్పవు

- టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ నటేష్
- నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 6 : సిరిసిల్ల పట్టణ పరిధిలోని పాన్ షాపులు, లాడ్జీలలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నార్కోటిక్ జాగిలాలతో ఆకస్మిక విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్కోఫోర్స్ ఇన్స్పెక్టర్ నటేష్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి లాంటి పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని, టాస్కోఫోర్స్ సిబ్బంది మత్తు పదార్థాలను గుర్తించే నార్కోటిక్ జాగిలలతో తరచు జిల్లా పరిధిలో ఉన్న లాడ్జిలలో, పాన్ షాప్, కిరాణా షాప్ లలో, బస్టాండ్ ప్రాంతాల్లో, రద్దీగల ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రజలకి మత్తు పదార్థాల వల్ల కలిగే ఆనార్థాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో గంజాయి రవాణా చేసినా, అమ్మినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధించిన గంజాయి లాంటి మత్తు పదార్థాల సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ లో సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

కాలువ పనులు పూర్తి చేయాలి

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి చాడ లేఖ



ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 6 : ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా తెగిపోయిన వరద కాలువలను తక్షణం మరమ్మతు చేయడంతోపాటు, చిగురుమామిడి మండలం నుండి భీమదేవరపల్లి మండలం వరకు ప్యాకేజీ 3లో పెండింగ్‌లో ఉన్న కాలువ పనులను పూర్తి చేయాలని సీపీఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుఫాన్ ప్రభావంతో వరద కాలువలు దెబ్బతిని రైతులు తీవ్ర నష్టాలు చవిచూశారని లేకలో చాడ తెలిపారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు వరద కాలువ ద్వారా సాగునీరు అందించే ప్యాకేజీ 3 పనులు నిధుల కొరత కారణంగా నిలిచిపోయాయని, భూ సేకరణ కోసం రూ.67 కోట్ల రూపాయలు అవసరమని గుర్తుచేశారు.ఇందుర్తి కెనాల్ నుండి భీమదేవరపల్లి మండలంలోని గ్రామాల వరకు సాగిన కాలువ పనుల్లో సూపర్‌స్ట్రక్చర్లు, బ్రిడ్జీలు, కల్వర్టులు వరదల వల్ల దెబ్బతిన్నాయని, వాటి పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. రైతులు వేసిన పంటలు వరదలతో కొట్టుకుపోయి, ఇసుకమేటలు ఏర్పడడంతో తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు.కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, భూ సేకరణకు మొత్తం రూ.67 కోట్లు విడుదల చేయాలని, మిగిలిన రూ.42 కోట్లకు టెండర్లు పిలవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని చాడ వెంకటరెడ్డి లేఖలో కోరారు.

వందేళ్ల ఉద్యమ చరిత్రను ప్రజలకు వివరించాలి

- సీపీఐ శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరపాలి
- సీపీఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 6 : ప్రజా ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి, అనేక మంది అమరవీరుల త్యాగాలతో పునీతమైన భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి వందేళ్లు నిండుతాయని, శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఊరురా వాడ సీపీఐ జెండాలు ఎగురవేస్తూ, పార్టీ నిర్వహించిన ప్రజోద్యమాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత సీపీఐ నాయకత్వంపై ఉందని సీపీఐ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సీపీఐ శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరపాలని అన్నారు. సీపీఐ హుస్నాబాద్ నియోజకవర్గ జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యుల సమావేశం గురువారం హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి భవన్లో హన్మకొండ జిల్లా సీపీఐ కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ వచ్చే డిసెంబర్ 26 నాటికి సీపీఐ కి వందేళ్లు నిండుతాయని, ఈ సందర్భంగా సీపీఐ నిర్వహించిన ఉద్యమాలను, విజయాలను, మహోజ్వల చరిత్రను నేటితరానికి తెలియజేయాలని అన్నారు. అన్ని శాఖల్లో ఎర్రజెండాలు ఎగురవేస్తూ, ర్యాలీలు, సభలు,సెమినార్లు నిర్వహిస్తూ, జనసేవాదళ్ క్యాంపులు నిర్వహించాలని, రాష్ట్ర పార్టీ వైపున నిర్వహించే జాతను జిల్లాల్లో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కళవేని శంకర్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కనుకుట్ల శంకర్, ఆదరి శ్రీనివాస్, హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు జాగీర్ సత్యనారాయణ, నాగెల్లి లక్ష్మారెడ్డి, వెల్పుల శ్రీనివాస్, బత్తుల బాబు, లంకదాసరి కళ్యాణ్, ఆదరి రమేష్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, గూడెం లక్ష్మి, చాడ శ్రీదర్ రెడ్డి, మంచాల రమాదేవి, గూడ పద్మ, తెరాల సత్యనారాయణ, అందె స్వామి, బుడిద సదాశివ, అయిలేని సంజీవరెడ్డి, జనగాం రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఇంటిని ముట్టడించిన ఏఐఎస్ఎఫ్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 6: కరీంనగర్‌లోని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటిని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ముట్టడించారు. పోలీసులు నిరసనకారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత విద్యార్థుల చదువులను రోడ్డున పడేసిందన్నారు. రాష్ట్రంలో అందాల పోటీలకు ఉన్న నిధులు ఫీజు బకాయిలకు ఎందుకు లేవు అని? సీఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్న ఫీజు బకాయిల కోసం కళాశాలలు బంద్ చేసే పరిస్థితి వచ్చిందని రెండు రోజుల్లో ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే ఏఐఎస్ఎఫ్ మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. పెండిరగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ కళాశాలలు బంద్ చేస్తున్న ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విన్నూత నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం పోలీసులు ఏఐఎస్ఎఫ్ నాయకులను అరెస్ట్ చేశారు.

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం

- సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 6: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం ఖాయం అని హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు, బొలిశెట్టి శివయ్య కాంగ్రెస్ నాయకులతో కలిసి బుధవారం యూసుఫ్‌గూడ డివిజన్‌లోని శ్రీకృష్ణ నగర్‌లో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి అమలు చేస్తున్న పథకాల వివరాలు తెలియజేశారు. నవీన్ యాదవ్‌ను గెలిపించి ప్రజా పాలనకు మద్దతు ఇవ్వాలని అయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి ఐలయ్య, హుస్నాబాద్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు వల్లపు రాజు, పున్న సది-లావణ్య, సింగిల్ విండో డైరెక్టర్లు కల్లెపల్లి వెంకటస్వామి, బండి కుమార్, పుదరి శ్రీనివాస్, వల్లపు పరశరాములు పాల్గొన్నారు.

వేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు

- జిల్లాలో 70 శాతం మార్క్ ఔట్ పూర్తి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 6 : జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. తంగళ్ళపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో హౌసింగ్ శాఖ నిర్మించిన మోడల్ హౌస్, మండేపల్లి, చింతలపల్లి, రాళ్లపేటలో మొత్తం 11 ఇందిరమ్మ ఇండ్లు పూర్తి కాగా గృహ ప్రవేశాలు గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, కే కే మహేందర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. సొంత ఇంటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నదని, దీనిలో భాగంగా లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ. 5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నదని తెలిపారు. ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మిగతా లబ్ధీదారులు అందరూ ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని, త్వరితగతిన తమ సొంత ఇంటి కలను పూర్తి చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అధికారులు అందుబాటులో ఉండి నిర్మాణాలు పూర్తి చేసుకునేలా సహకరించాలని ఆదేశించారు.

అందుబాటులోకి తీసుకురావాలి

తంగళ్లపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న తహసీల్ కార్యాలయ భవనాన్ని ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. అలాగే రాళ్ళపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? విద్యార్థులకు అందిస్తున్న బోధన, మౌలిక సదుపాయాల తీరుపై ఆమె ఆరా తీశారు. కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపా రెడ్డి, వైస్ చైర్మన్ నర్సింగ్, హౌసింగ్ పీడీ శంకర్, మండల ప్రత్యేక అధికారి, డీపీఓ శర్పుద్దిన్, తహసిల్దార్ జయంత్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, సీపీలకు లీగల్ నోటీసులు

- అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు శేఖర్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 6: ప్రభుత్వ హాస్పిటల్ అవినీతిపై చర్యలు తీసుకోని కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కి, సీపీలకు లీగల్ నోటీసులు పంపించినట్లు అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు శేఖర్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బండారు శేఖర్ మట్లాడుతూ అవినీతి అధికారులను సస్పెండ్ చేసి ఉద్యోగం నుండి రిమూవ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్పిటల్ రూ.4.50కోట్లకుపైగా అవినీతి కుంభకోణంపై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ జిల్లా కలెక్టర్, సీపి, ఇతర అధికారులకు లీగల్ నోటీసులు పంపించామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన 4.50 కోట్ల అవినీతి కుంభకోణంపై ఎలాంటి చర్యలు తీసుకోనందున, అవినీతి అధికారులైన డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ నవీన అదే స్థానంలో కొనసాగించడంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర డీజీపీ, ప్రిన్సిపాల్ సెక్రటరీ హెరీంశాఖ, హెల్త్ మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ సెక్రటరీ, తెలంగాణ స్టేట్ విజిలెన్స్ కమిషన్, కరీంనగర్ జిల్లా కలెక్టర్‌లకు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఈ క్రాప్‌లో నమోదైన ధాన్యాన్ని నూటికి నూరు శాతం కొనుగోలు చేస్తాం. పెట్టుబడి రాయితీ చెల్లిస్తే.. ఆ సర్వే నంబరులో సాగు చేసిన పంటను కొనుగోలు చేయరంటూ కొందరు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు. ఈ నెలలో 11 లక్షలు, డిసెంబర్లో 25 లక్షలు, జనవరిలో 8 లక్షలు, ఫిబ్రవరిలో 3 లక్షలు, మార్చిలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.
- ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రాంతీయం

నీలకంఠేశ్వర్వర ఆలయంలో కవిత పూజలు

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 6 : కార్తీక పౌర్ణమి మరుసటి రోజు గురువారం ఉదయం నిజామాబాద్ లోని నీలకంఠేశ్వర్వర స్వామి ఆలయంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కుటుంబ సభ్యులతో కలిసి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ కార్తీక పౌర్ణమి, కార్తీక మాస శుభాకాంక్షలు తెలిపారు. కార్తీక పౌర్ణమి మరుసటి రోజున ఎప్పటిమాదిరిగానే నీలకంఠేశ్వర స్వామి వారికి అభిషేకం చేశారు. ఆ స్వామివారి దయతో జిల్లా ప్రజలు బాగుండాలని కోరుకున్నారు. మొంథా తుపాను వల్ల రకరకాల నష్టాలు జరిగాయి. ప్రజలంతా మనోధైర్యంతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 6: బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. రాజ్యాంగాన్ని సవరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వత్తిడి పెంచడానికి, తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ కో చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఇచ్చిన పిలుపుమేరకు ఆందోళన కార్యక్రమాలలో భాగంగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా మహాత్మ జ్యోతిబాపూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద మౌన దీక్షలు చేపట్టాలని ఇచ్చిన పిలుపులో భాగంగా నిజామాబాద్ నగరం హనుమాన్ జంక్షన్ విగ్రహాల పార్కులో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం వద్ద నిజామాబాద్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు మౌనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ బీసీలకు న్యాయంగా దక్కవలసిన వాటా దక్కే వరకు పోరాటం ఆపేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్య ప్రకాష్, కరిపే రవీందర్, దర్శనం దేవేందర్, కొయ్యడ శంకర్, బగ్గలి అజయ్, చంద్రమోహన్, శ్రీలత, చంద్రకాంత్ సదానంద్ ఆర్టీసీ శ్రీనివాస్, తంగళ్ళపల్లి శ్రీనివాస్, ఓంకార్ మురళి, దయానంద్, ప్రసాద్, నరేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసం క్రీడలతోనే సాధ్యం

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రతిపక్షం సోన్ నవంబర్ 6: క్రీడల ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం సాధ్యమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోన్ మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్లో గురువారం తెలంగాణ బాలికల సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలో 11వ రాష్ట్ర జోనల్ లెవెల్ స్పోర్ట్స్ & గేమ్స్ మీట్ 2025-26 క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ ఘనంగా ప్రారంభించారు.ఈ ఈవెంట్ లో నాలుగు జిల్లాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఇలాంటి వేదికలు చాలా అవసరం అని అన్నారు.క్రీడలు శారీరకమానసిక వికాసానికి దోహదం చేస్తాయని ఈ సందర్భంగ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో భోజన్న, డిఐఈఓ పరశురాం, డివైస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రశాంతి, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 6: పరకాల లోని ధనలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్ లో ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు ప్రక్రియను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఎంత పత్తిని కొనుగోలు చేశారని, రైతులు తమ పంట ఉత్పత్తిని విక్రయించేందుకు కపాస్ యాప్ లో నమోదు చేస్తున్నారా అని, తేమశాతం ఎలా పరిశీలిస్తున్నారని, జిన్నింగ్ మిల్ పరిధిలో ఎంత కాటన్ రానుందనే వివరాలను మార్కెటింగ్ అధికారులు, సీసీఐ అధికారులు కలెక్టర్ కు వివరించారు. మూడు రోజుల క్రితం జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు ప్రారంభమైందని, ఇప్పటివరకు పత్తి కొనుగోలు కేంద్రానికి 13 మంది రైతులు 140 క్వింటాల పత్తిని తీసుకురాగా కొనుగోలు చేసినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. పత్తి కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన పత్తిని త్వరగా కొనుగోలు చేయాలని, పత్తిని విక్రయించిన రైతులకు త్వరగా డబ్బులు వారి ఖాతాకు జమ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతులు ఎక్కడ ఇబ్బంది పడకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాట్లను అధికారులు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, సీసీఐ అధికారి ప్రకాష్, పరకాల మార్కెట్ సూపర్వైజర్ వేణుగోపాల్, ఇతర అధికారులతో పాటు జిన్నింగ్ మిల్లు యాజమాన్యం, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లు

- పేదల కళ్ళలో ఆనందం నింపడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- అంగరంగ వైభవంగా నాగారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 6 : పరకాల మండలం నాగారం గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం లో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ తో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు డప్పు చప్పుళ్ళు, కోలాటాలు, బోనాలతో ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్వీట్ తినిపించి, శాలువాలతో సన్మానించి, కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.... పరకాల నియోజకవర్గంలోని నాగారం గ్రామంలో ప్రథమంగా ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. పేదల కళ్ళలో ఆనందం నింపడమే ప్రభుత్వ లక్ష్యం అని,ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి గ్రామంలో మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగాలనే సంకల్పంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు,200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ 500 బోనస్, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇల్లు, సీఎంఆర్ఎఫ్ ,కళ్యాణ లక్ష్మి, తదితర సంక్షేమ పథకాలను అందజేస్తుందన్నారు. గ్రామంలోని సిద్దోజు సరిత, తూముల స్వరూప, కలకొండ రమాదేవి, బొజ్జ శ్రీమతి, జాలిగపు శోభ, చిట్టిరెడ్డి భాగ్యలక్ష్మి, గౌరు శిరీషా అనే లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ, గృహ నిర్మాణ శాఖ పీడీ హరికృష్ణ, డీఈ రవీందర్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స.హ.చట్టం, గ్రామ సభల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా పంచాయతీ అధికారి తరుణ్

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 6: గ్రామ స్థాయిలో ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు గ్రామస్థాయి అధికారులు సమాచార హక్కు చట్టం, గ్రామ సభల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వనపర్తి జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ సూచించారు.గురువారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ నుండి మాస్టర్ ట్రైనర్ పి. కృష్ణ గ్రామ సభల్లో పాల్గొనే గ్రామస్థాయి లైన్ డిపార్ట్మెంట్ అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించగా డి.పి.ఓ తరుణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డి.పి. ఓ మాట్లాడుతూ గ్రామస్థాయి అధికారులు ప్రతి నెల గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించడమే కాకుండా ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించాల్సి ఉంటుందన్నారు.ఇందులో భాగంగ సమాచార హక్కు చట్టం, గ్రామ సభల నిర్వహణ పై గ్రామ స్థాయి అధికారులకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు.చట్టాల పై పూర్తి అవగాహన చేసుకొని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు.లైన్ డిపార్ట్మెంట్ లు అయిన పంచాయతీరాజ్, సంక్షేమ శాఖ, నీటిపారుదల, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి శాఖ, విద్యా, వైద్య శాఖల నుండి 35 మంది గ్రామస్థాయి సిబ్బంది ఈరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.పదవి విరమణ పొందిన మాజీ జిల్లా పంచాయతీ అధికారి, ప్రస్తుత సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మాస్టర్ ట్రైనర్ కృష్ణ సిబ్బందికి గ్రామ సభల నిర్వహణ, సమాచార హక్కు చట్టం 2005 పై శిక్షణ ఇచ్చారు.శిక్షణ కార్యక్రమంలో లైన్ డిపార్ట్మెంట్ సిబ్బంది తో పాటు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సహాయ కార్యనిర్వాహణ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహం..సామాజిక సమస్య

అదిగమిద్దాం

- శిక్షణ కలెక్టర్ ప్రణయ్ కుమార్

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 6: దేశ పౌరుల సామాజిక బాధ్యతగా భావించి, బాల్య వివాహాలు అనే సామాజిక సమస్యను అదిగమించాలని శిక్షణ కలెక్టర్ ప్రణయ్ కుమార్ పిలుపునిచ్చారు. మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రం ఎస్. ఆర్ గార్డెన్ లో పూజారులు, పాస్టర్లు, క్వాజీలు, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, ఫంక్షన్ హాల్ యజమానులు, సౌండ్ సిస్టమ్ యజమానులు, వంట మాస్టర్స్ తో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహ రహితసమాజం కోసం కృషిచేయాలనీ, నారాయణపేట జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, బాల్య వివాహ రహిత జిల్లాగా మారుద్దామని తెలియజేశారు. అనంతరం బాల్య వివాహ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ ప్రణయ్ కుమార్, సి.ఐ శివ శంకర్, ఎస్.ఐ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ అధికారులు శ్రీలత, నర్సింహులు, కరిష్మ, అనిత, తిరుపతయ్య, నర్సిములు, కవిత, అశ్విని, సంతోష, విజయ్ కుమార్, శ్రవణ్ కుమార్, లక్ష్మణ్ నాయక్, బాల్ రాజ్, భారతి, ఏ.వీ.ఏ నరేష్, విజన్ సంస్థ ప్రతినిధులు రవికుమార్, అనిత పాల్గొన్నారు.

మహిళా డెయిరీ ఏర్పాటుకు

అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలి

- త్వరలో నడికూడ, పరకాలలో బీఎంసీ ఏర్పాటు చేసి పాలు, పాల ఉత్పత్తుల విక్రయాలు
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 6: పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు సంబంధించిన అన్ని అనుమతుల ప్రక్రియను అధికారులు త్వరగా పూర్తిచేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి దామెరలో ఏర్పాటు చేస్తున్న పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు మిగిలిన అనుమతుల ప్రక్రియ, నిర్వహణ, తదితర అంశాలపై డిఆర్డిఓ, సహకార, పశు సంవర్ధక శాఖల అధికారులతో పాటు మహిళా డెయిరీ నిర్వాహకులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు మిగిలిన అనుమతులు, రిజిస్ట్రేషన్, పశు సంపద, ప్రాథమిక సభ్యత్వాల నమోదు, డెయిరీ నిర్వహణ, తదితర అంశాలను ఎమ్మెల్యే, కలెక్టర్ లు అధికారులు, డెయిరీ నిర్వాహకులతో చర్చించారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మహిళా డెయిరీ కి పూర్తిస్థాయి బైలాస్ ను అధికారులు త్వరగా రూపొందించాలన్నారు. డెయిరీ ఏర్పాటుకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించడం పై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. మహిళా డెయిరీ కి గ్రామాల నుండి పాల సేకరణ మొదలుకొని బ్రాంచ్ మిల్క్ సెంటర్లకు, అక్కడి నుండి డెయిరీకి తరలింపు, నిర్వహణకు సంబంధించిన అంశాలపై ఇప్పటికే సంఘాలలోని సభ్యులకు ములుకనూరు డెయిరీలో శిక్షణ కార్యక్రమాలను ఇప్పించినట్లు తెలిపారు. త్వరలోనే నడికూడ, పరకాల మండలాలలో బ్రాంచ్ మిల్క్ సెంటర్ లను ప్రారంభించి వాటి ద్వారా మహిళా డెయిరీ పాలు, పాల ఉత్పత్తులను విక్రయించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రెండు రోజుల్లో ప్రస్తుతం సభ్యత్వం ఉన్న 21 మంది ఆధార్ కార్డులు అందజేయాలని, ఫీజుబిలిటీ రిపోర్ట్ త్వరగా అందజేస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తవుతుందన్నారు. డెయిరీ నిర్వహణను సొసైటీ లోని మహిళలే నిర్వహణ బాధ్యతలు చేపడితే బాగుంటుందని, డెయిరీ ఆపరేషన్స్ లో ప్రాసెసింగ్, క్వాలిటీ చెకింగ్, తదితర అంశాలను అనుభవం ఉన్నవారితో ప్రారంభించాలన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ డి ఆర్ డి ఓ మేన శ్రీను, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, ఇతర అధికారులతో పాటు మహిళా డెయిరీ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నగర సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- నగర పాలక సంస్థ పనితీరుపై సమీక్ష

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 6: నిజామాబాద్ నగర సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాల్ లో నగర పాలక సంస్థ పనితీరుపై కలెక్టర్ గురువారం సమీక్ష జరిపారు. ఇదివరకటి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించారు. ఖాళీ స్థలాల పరిరక్షణ, వన మహోత్సవం, నాటిన మొక్కలను సమర్ధవంతంగా కాపాడటం, పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతి తదితర అంశాలపై సాధించిన పురోగతిని సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఒక్కో డివిజన్ వారీగా పై అంశాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. వార్డు ఆఫీసర్లకు వారివారి డివిజన్లలో నెలకొని ఉన్న పరిస్థితులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అప్పుడే వారు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయగలరని అన్నారు. ఖాళీ స్థలాలను గుర్తించి, వాటి పరిరక్షణ కోసం కంచె ఏర్పాటు చేయాలని, పచ్చదనాన్ని పెంపొందించేలా విరివిరిగా మొక్కలు నాటించాలని అన్నారు. ఖాళీ స్థలాల్లో ప్రజోపయోగ నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. పట్టణ ప్రకృతి వనాలు, మీడియన్, అవెన్యూ ప్లాంటేషన్ల నిర్వహణ సమర్ధవంతంగా జరగాలని, ప్రతి మొక్క సంరక్షించబడేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. ప్రతి రోజు చెత్త సేకరణ ఆటో ట్రాలీలు ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చొరవ చూపాలని అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 400 చదరపు అడుగుల కంటే తక్కువ స్థలం ఉన్న వారు కూడా జీ+1 పద్ధతిలో ఇందిరమ్మ పథకం కింద ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. అర్హులైన కొత్త లబ్దిదారులను గుర్తించి ఇళ్లను మంజూరు చేయాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, హౌసింగ్ డీ.ఈ నివర్తి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవిబాబు, వివిధ విభాగాల అధికారులు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ పాక్ చరిత్రలోనే పెద్ద నియంత. అతని మానసిక స్థితి సరిగ్గా ఉండదు. అధికారం కోసం అతను దేనికైనా తెగిస్తాడు. నా భార్య బుష్రా బీబీని ఒంటరిగా ఉంచి మానసికంగా హింసిస్తున్నాడు. బానిసత్వం కంటే మేము చావునే కోరుకుంటాం. ఎప్పటికీ అతని ముందు తలవంచం. మమ్మల్ని మేము సరెండర్ చేయం.
- పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్

గగన్ యాన్‌కు రెడీ అవుతున్న భారత్

- మానవ సహిత అంతరిక్ష మిషన్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బెంగళూరు, నవంబర్ 6: భారత అంతరిక్ష చరిత్రలో అపూర్వ ఘట్టానికి నాంది పలకనున్నారు. ఆరు దశాబ్దాల భారత అంతరిక్ష పరిశోధనలలో అత్యంత ముఖ్యమైన ఘట్టం మొదలు కాబోతోంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చేపట్టిన మానవ సహిత అంతరిక్ష మిషన్ గగనయాన్ ప్రాజెక్టులో తొలి అడుగు వచ్చే నెలలోనే పడబోతోంది. డి సెంబర్‌లో జరగనున్న మిషన్ ఈ దిశలో మొదటి ముఖ్య అడుగు.ఈ ప్రయోగంలో వ్యోమమిత్ర అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హ్యూమనాయిడ్ రోబోను స్పేస్‌లోకి పంపనున్నారు. కొన్ని సంవత్సరాలుగా మన పరిశోధన సంస్థలు ఈ ఈ స్పేస్ రోబోను రూపొందించాయి. ఈ మిషన్‌లో ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్ సిస్టమ్, అవియానిక్స్, సేఫ్టీ ప్రోటోకాల్‌లు, లైఫ్ సపోర్ట్ సిస్టమ్ వంటి భాగాలను అసలు అంతరిక్ష పరిస్థితులలో పరీక్షించనున్నారు. వ్యోమమిత్ర స్పేస్ ఫ్లైట్ సేకరించే డేటా, భవిష్యత్తులో మానవ యాత్రల భద్రతా ప్రమాణాల కోసం కీలకంగా ఉపయోగపడుతుంది. గగనయాన్ మిషన్ భారత అంతరిక్ష చరిత్రలో కొత్త యుగాన్ని ప్రారంభించబోతోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన క్రూస్ మాడ్యూల్, సర్వీస్ మాడ్యూల్, ఎస్కేప్ సిస్టమ్ వంటి కీలకమైన టెక్నాలజీలను పరీక్షిస్తోంది. దీని లక్ష్యం భారతీయ వ్యోమగాములను భవిష్యత్తులో భూమి చుట్టూ కక్ష్యలోకి పంపి, సురక్షితంగా తిరిగి తీసుకురావడం. వ్యోమమిత్ర ఫ్లైట్ విజయవంతమైతే, భారత్ మానవ అంతరిక్ష యాత్రకు సాంకేతికంగా సిద్ధమవుతుంది. ఇది మన ఇస్రో ధృఢ సంకల్పానికి ప్రతీక. స్వదేశీ రాకెట్ ఇంజినీరింగ్, స్పేస్ రోబోటిక్స్, లైఫ్ సపోర్ట్ టెక్నాలజీలు వంటి రంగాలలో మనం ఎంత పురోగతి సాధించామో ఈప్రయోగం ద్వారా భారత్ ప్రపంచానికి చాటనుంది.

విశ్వ వీక్షణం

హైకోర్టులో సిద్ధరామయ్యకు ఎదురుదెబ్బ

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై ధర్మాసనం స్టే

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బెంగళూర్, నవంబర్ 6: కర్ణాటక హైకోర్టులో సిద్ధరామయ్య సర్కారుకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వ సంస్థలలో ప్రైవేట్ సంస్థల కార్యాకలాపాలను పరిమితం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై గతంలో హైకోర్టు ధార్వాడ్ సింగిల్ జడ్జి బెంచ్ స్టే ఇచ్చింది. సింగిల్ జడ్జి నిర్ణయాన్ని ప్రభుత్వం సవాల్ చేసింది. స్టే విషయంలో అదే బెంచ్‌కు వెళ్లాలని న్యాయమూర్తులు ఎస్‌జీ పండిట్, గీతా కేబీలతో కూడిన డివిజన్ బెంచ్ ప్రభుత్వానికి సూచించింది. అయితే, సిద్ధరామయ్య ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ ప్రాంగణాలలో ఎలాంటి ప్రైవేటు కార్యక్రమాలు నిర్వహించకూడదని, నిర్వహించే ముందు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా కార్యక్రమం, ఊరేగింపు భారత జాతీయ చట్టం నిబంధనల ప్రకారం చట్టవిరుద్ధమని పేర్కొంది. ఈ ఉత్తర్వులు ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యంగా చేసుకున్నట్లుగా ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వం ఉత్తర్వులలో ఆర్‌ఎస్‌ఎస్ పేరు నేరుగా ప్రస్తావించనప్పటికీ, నిబంధనలు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలపై ప్రభావం చూపే ఉద్దేశంతో ఉన్నాయనే విమర్శలు వచ్చాయి. ఈ ఉత్తర్వులను ఓ స్వచ్ఛంద సంస్థ ధార్వాడ్ హైకోర్టు బెంచ్‌లో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను విచారించిన సింగిల్ బెంచ్ జడ్జి ప్రభుత్వ ఉత్తర్వులపై మధ్యంతర స్టే ఇచ్చింది. అయితే, ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ సందర్భంగా ప్రజలంతా కలిసి కవాతు చేయాలనుకుంటే, దాన్ని ఆపొచ్చా? అంటూ బెంచ్ ప్రశ్నించింది. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై దిసభ్య ధర్మాసనం అప్పీల్ దాఖలు చేసేందుకు సింగిల్ జడ్జి న్యాయమూర్తిని ఆశ్రయించాలని సూచించింది.

సింగిడి

హైదరాబాద్

శుక్రవారం

07.11.2025

ప్రతిపక్షం

Prathipaksham.in

మా దేశానికి ఫ్రీగా రండి

కొత్తవారిని ఆకర్షించేందుకు పలు దేశాలు ఆకర్షణీయమైన ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. అంటే మీరు ఈ దేశాలకు వెళ్తే చాలు వారు మీకు ఫ్రీగా డబ్బులు ఇస్తారు. స్టార్టప్ గ్రాంట్ల నుండి తక్కువ ధరకే ఇండ్లు, ఉచిత విద్య, ఉపాధి వంటి అవకాశాలు అందించే ఆ దేశాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

చిలీ

అటాకామా ఎడారి నుండి పటగోనియా వరకు అద్భుతమైన ప్రకృతి అందాలకు ప్రసిద్ధి చెందిన దేశం చిలీ. మైనింగ్‌కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థ నుండి వినూత్న టెక్ హబ్‌గా మారింది. అక్కడ నివాసం కోసం వేళ్తే వారికోసం ఒక ముఖ్యమైన చొరవ స్టార్ట్‌అప్ చిలీ. ఇది స్టార్టప్ డెవలప్‌మెంట్ కోసం వివిధ దశలలో గ్రాంట్‌లను అందించే యాక్సిలరేటర్ ప్రోగ్రామ్. బిల్డ్ అనే 4నెలల ప్రోగ్రామ్ 10 మిలియన్ పెసోలను (దాదాపు $14,000) అందిస్తుంది. అలాగే, వ్యాపారం ప్రరంభించిన వారికి స్థలాన్నికూడా అందిస్తుంది. అలాగే, ఇగ్నైట్ ప్రోగ్రామ్ దాదాపు $30,000 ఈక్విటీఉచితంగా, అదనంగా $30,000 ఎక్స్ టెన్షన్ కోసం అందిస్తుంది. ఇంకా విస్తరించాలనుకునే చిన్న స్టార్టప్‌లకు మద్దతు ఇస్తుంది. అధునాతన స్టార్టప్‌లను లక్ష్యంగా చేసుకుని, మెరుగైన కమ్యూనిటీని ఆవిష్కరించడానికి, నిర్మించడానికి $80,000 నిధులను అందించే గ్రోత్ ప్రోగ్రామ్ ను కూడా అమలు చేస్తోంది. ఇవన్నీ మీరు పొందడానికి మీ స్టార్టప్ ఆలోచనలు, వ్యాపార ఆలోచనలు పంచుకుంటూ ఆప్లికేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత ఇంటర్వ్యూకి పిలుస్తారు.

2. కాండేలా-ఇటలీ

కాండేలాలో నివాసం కోసం వేళ్తే సింగిల్స్ కోసం 800 యూరోలు, జంటలకు 1,200 యూరోలు, ముగ్గురు సభ్యుల కుటుంబాలకు 1,500నుండి 1,800యూరోలు, నలుగురి నుండి ఐదుగురు వ్యక్తుల కుటుంబాలకు 2,000 యూరోలు ఇస్తారు. అలాగే నగర వ్యర్థాల తొలగింపు, ఇతర బిల్లులు, నర్సరీలపై పన్ను క్రెడిట్‌లు కూడా అందిస్తారు. కాండేల పట్టణంలో తగ్గుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని అక్కడి యంత్రాంగం ఇది అమలు చేస్తోంది. అయితే, కొత్తగా అక్కడికి వచ్చి సొంత ఇళ్లను కలిగి నివాసం ఉండాలి. లేదా ఇంటిని అద్దెకు తీసుకుని ఉండాలి. వారు సంవత్సరానికి కనీసం 7,500 యూరోల జీతంతో ఉద్యోగం కలిగి ఉండాలనే షరతులను విధించింది. కాండేలా తో పాటు సంబుకా డి సిసిలియా, సార్డినియా, టస్కానీ ప్రాంతాలు కూడా ఇదే విధమైన ఆఫర్లు అందిస్తున్నాయి.

3. డెన్మార్క్

డెన్మార్క్ వేళ్తే మీకు నేరుగా నగదు ఇవ్వకపోయినా ఇది అద్భుతమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, సంక్షేమ వ్యవస్థలను మీకు అందిస్తుంది. ఇక్కడి తీరప్రాంత ప్రకృతి దృశ్యాలు, బైక్‌స్నేహపూర్వక నగరాలు, ప్రపంచంలోని సంతోషకరమైన దేశాలలో ఒకటిగా పేరు పొందడం వల్ల మీకు సరైన గమ్యస్థానం కూడా కావచ్చు.

4. ఐర్లాండ్

ఐర్లాండ్ లో మీరు నివాసం ఉంటే ఎంటర్‌ప్రైజ్ ఐర్లాండ్ మంచి స్టార్టప్‌లకు నిధులు, పన్ను క్రెడిట్‌లను అందిస్తుంది. విజయవంతమైన దరఖాస్తుదారులు EU మార్కెట్, శక్తివంతమైన ఐరిష్ సంస్కృతి నుంచి అనేక లాభాలు పొందుతారు. దాని సుందరమైన ప్రకృతి దృశ్యాలు, అందరినీ స్వాగతించే వ్యక్తులతో ఇది ప్రసిద్ధి చెందింది.

5. స్విట్జర్లాండ్

స్విట్జర్లాండ్ లోని అల్బినెన్ లో మీరు నివాసం ఉంటే మీకు పెద్ద మొత్తంలో మనీని అందిస్తుంది. 45 ఏళ్లలోపు కొత్త నివాసితులను ఆకర్షించడానికి పెద్దలకు $25,000, పిల్లలకు $10,000 అందిస్తుంది. అయితే మీరు $223,200 కంటే ఎక్కువ విలువైన ఇంటిని కొనుగోలు చేసి కనీసం 10 సంవత్సరాలు అక్కడ నివసించాలి.

6. మారిషస్

ఆచరణీయమైన వ్యాపార ఆలోచనలు కలిగిన స్టార్టప్‌లకు మారిషస్ 20,000 మారిషస్ రూపాయలను ($440) అందిస్తుంది. ఈ ద్వీపం అందమైన వాతావరణం, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ, అధికనాణ్యత పాఠశాలలు, ఉచిత ఆరోగ్య సంరక్షణను అందిస్తుంది. ఇది వ్యవస్థాపకులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారుతుంది.

7. స్పెయిన్

స్పెయిన్ లోని పోంగా లో ఐదేళ్ల పాటు ఉండేందుకు ఇష్టపడే యువ జంటలకు 3,000 (సుమారు $3,262) అందజేస్తుంది అక్కడి యంత్రాంగం. అదనంగా ప్రతి బిడ్డకు 3,000 అందజేస్తుంది. ఈ ప్రాంతం అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు, స్వాగతించే కమ్యూనిటీతో కుటుంబాలకు అద్భుతమైన ఎంపికగా ఉంది.

8. కెనడా

కెనడాలోని సస్కట్చేవాన్ 10 సంవత్సరాల పాటు రెసిడెన్సీని కొనసాగించే వారికి ఆమోదించబడిన సంస్థల నుండి గ్రాడ్యుయేట్‌లకు పన్ను రిటర్న్‌లలో CAD 20,000 (సుమారు $15,000 USD) అందిస్తుంది.

9. న్యూజిలాండ్

న్యూజిలాండ్ లోని కైటాంగటా దాని జనాభాను పెంచడానికి అక్కడకు నివాసం ఉండటానికి వేళ్లే వారి కోసం $165,000కి సరసమైన భూమి, గృహ ప్యాకేజీలను అందిస్తుంది. సహజ సౌందర్యం, సాహస క్రీడలకు ప్రసిద్ధి చెందిన న్యూజిలాండ్ ఈ రకమైన మనస్తత్వం కలిగిన వారికి మంచి ఎంపిక కావచ్చు.

10. గ్రీస్

గ్రీస్ లోని Antikythera కు వెళ్లి నివాసముండే వారికోసం.. ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉన్న కుటుంబాలకు నెలవారీగా 500 (దాదాపు $542) నగదుతో పాటు ఉచిత వసతి, ఉచిత ఆహారాన్ని అందిస్తుంది. ఇక్కడ నైపుణ్యం కలిగిన కార్మికులు, కుటుంబాలతో దాని జనాభాను పెంచడానికి ఈ చర్యలు తీసుకుంది.

11. క్రొయేషియా

క్రొయేషియాలోని లెగ్రాడ్ కొత్తగా అక్కడకు వెళ్లి నివాసముండే వారికోసం 13 సెంట్లలో గృహాలను ఉచితంగా అందిస్తోంది. దరఖాస్తుదారులు తప్పనిసరిగా 45 ఏళ్ల లోపు ఉండాలి. పెళ్లి చేసుకుని ఉండాలి. క్లీన్ రికార్డ్ కలిగి ఉండాలి.

ఆసిమ్ మునీర్ చరిత్రలోనే క్రూర నియంత

- పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తీవ్ర వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 6 : పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్‌పై ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మునీర్ పాకిస్తాన్ చరిత్రలోనే అత్యంత క్రూర నియంత అని, మానసికంగా స్థిరత్వం లేని వ్యక్తి అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 2023 ఆగస్టు నుంచి అదియాలా జైలులో ఖైదీగా ఉన్న ఇమ్రాన్ ఎక్స్ వేదికగా ఈ ఆరోపణలు చేశారు. మునీర్ పాలనలో అణచివేత గతంలో ఎన్నడూ చూడని స్థాయిలో ఉందని, అధికార దాహంతో కళ్లుమూసుకుపోయిన ఆయన దాని కోసం ఎంతకైనా తెగిస్తారని ఇమ్రాన్ ఖాన్ దుయ్యబట్టారు.

నవంబర్ 26మే 9న మురిద్కే ఘటనలను ప్రస్తావిస్తూ.. ఇవి అధికార దుర్వినియోగానికి స్పష్టమైన ఉదాహరణలని విమర్శించారు. పోలీసులు, భద్రతా సిబ్బంది తమ పార్టీ కార్యకర్తలను హత్య చేశారన్నారు. నిరాయుధులైన పౌరులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడం ఏ నాగరిక సమాజంలోనూ ఊహించలేమని అన్నారు. మహిళలపై ఇంతటి క్రూరత్వం గతంలో ఎన్నడూ చూడలేదని పేర్కొన్నారు. తన భార్య బుష్రా బీబీని ఏకాంత నిర్బంధంలో ఉంచి అసీమ్ మునీర్ వేధిస్తున్నారని ఆరోపించారు. బానిసత్వంలో బతకడం కంటే మరణమే మేలని వ్యాఖ్యానించారు. మునీర్ తనపై, తన భార్యపై అన్ని రకాల అన్యాయాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఏ రాజకీయ నాయకుడి కుటుంబం కూడా ఇంతటి క్రూరత్వాన్ని ఎదుర్కోలేదని ఇమ్రాన్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన ఎన్ని చేసినా సరే తాను తలవంచను, లొంగిపోను అని మరోసారి స్పష్టం చేయాలనుకుంటున్నా అని తేల్చి చెప్పారు.

ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

- ఇంటిలోనే పాతి పెట్టి, భర్త కనిపించడంలేదని ఫిర్యాదు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, అహ్మదాబాద్, నవంబర్ 6: ప్రియుడితో కలిసి భర్తను చంపి, మృతదేహాన్ని ఇంట్లోనే పాతి పెట్టింది. భర్త కనిపించడంలేదని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పోలీసులకు దృశ్యం సినిమాను చూపించింది. 18 నెలల తరువాత నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని సర్ఖేజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సమీర్ బిహారీ, రూబీ అనే దంపతులు ఫతేవాడిలో నివసిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి ఇమ్రాన్ అనే వ్యక్తితో రూబీ వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం భర్తకు తెలియడంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో భర్తను చంపాలని ప్రియుడితో ప్లాన్ వేసింది. ప్లాన్‌లో భాగంగా భర్త ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో ఆమె ప్రియుడు, ఇద్దరు స్నేహితులతో కలిసి అతడి గొంతుకోసి హత్య చేశారు.

అనంతరం ఇంటిలోనే గోతి తొవ్వి మృతదేహాన్ని పూడ్చేశారు. అనంతరం సిమెంట్ వేశారు. భర్త కనిపించడంలేదని స్థానిక పోలీస్ స్టేషన్‌లో రూబీ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులో తన భర్త ముంబైకి వెళ్లాడని దృశ్యం సినిమా చూపించింది. పోలీసులు కేసు నమోదు చేసి వివిధ కోణాలలో దర్యాప్తు జరిపారు. 18 నెలల గడిచినా ఏ ఆచూకీ కూడా కనిపించడంతో పోలీసులు లోతుగా ఆరా తీయడం ప్రారంభించారు. ఆమె ఇంటికి ఎవరు వచ్చి వెళ్తున్నారనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ఇమ్రాన్ వ్యక్తితో రూబీ ఇంటికి వస్తున్నాడని విచారణలో తేలడంతో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని తనదైన శైలిలో ప్రశ్నించారు. తానే హత్య చేశానని ఒప్పుకోవడంతో ఇంటికెళ్లి అస్థిపంజరం బయటకు తీసి డిఎన్ఎ టెస్టుకు పంపించారు. మృతుడు సమీర్ అని తేలడంతో ప్రియుడి, ప్రియురాలు, మరో ఇద్దరు స్నేహితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

షట్‌డౌన్ ఎఫెక్ట్‌తో అమెరికా కీలక నిర్ణయం

- 40 విమాన సేవలలో 10 శాతం కోత

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 6 : అమెరికా ప్రభుత్వ షట్ డౌన్ 38వ రోజుకు చేరుకుంది. దేశ చరిత్రలోనే అత్యధిక కాలం కొనసాగుతున్న షట్ డౌన్‌గా ఇది చరిత్ర సృష్టించింది. ఈ షట్ డౌన్‌తో లక్షలాది మంది అమెరికన్ల జీవితాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. దేశంలోని పలు విమానాశ్రయాలపై తీవ్ర ప్రభావం పడిన విషయం తెలిసిందే. షట్ డౌన్ సమయంలో ఎలాంటి జీతం లేకుండా పనిచేస్తున్న ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు, టీఎస్‌ఏ సిబ్బంది అనారోగ్య కారణాలతో విధులకు గైర్హాజర్ కావడంతో దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలలో విమానాల రాకపోకలు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. విమాన సేవలలో కోత విధించింది. రద్దీ అత్యధికంగా ఉన్న 40 విమానాశ్రయాలలో 10 శాతం విమానాలను రద్దు చేయనుంది. ఈ మేరకు ఆ దేశ రవాణా శాఖ మంత్రి సీన్ డఫీ ప్రకటించారు. ఈ మార్పులు శుక్రవారం నుంచి అమలుకు రానున్నట్లు తెలిపారు. పరిమిత సంఖ్యలో ఉన్న ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్‌పై ఒత్తిడి తగ్గించడానికే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పరిస్థితి మరింత దిగజారితే అదనపు ఆంక్షలు ఉంటాయని వెల్లడించారు. సెనేట్‌లో రిపబ్లికన్లు ప్రవేశపెట్టిన ఫెడరల్ నిధులకు చెందిన బిల్లుకు ఆమోదం దక్కకపోవడంతో అక్టోబర్ ఒకటిన అమెరికా ప్రభుత్వం షట్ డౌన్ ప్రకటించిన విషయం తెలిసిందే. సామాన్య ప్రజల నిత్య జీవితంలోని కీలక అంశాలకు సంబంధించిన కార్యక్రమాలకు ప్రభుత్వ నిధులు కోతపడగా విమాన ప్రయాణాలలో ఆలస్యాలు, జీతం లేకుండా వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తుండడంతో ప్రజల జీవితాలపై ఈ షట్ డౌన్ తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది

డబ్ల్యూపీఎల్ ఇక నాలుగో సీజన్‌కు సిద్ధం

రిటైన్ క్రీడాకారుల జాబితాను విడుదల చేసిన ఫ్రాంచైజీలు

భారత మహిళల క్రికెట్ జట్టు అర్ధ శతాబ్దపు కలను సాకారం చేసుకుంది. ఈ విజయం వెనుక వుమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) పాత్ర కూడా కీలకమే. ఇప్పటికే మూడు సీజన్లు పూర్తి చేసుకున్న డబ్ల్యూపీఎల్ ఇక నాలుగో సీజన్ కోసం సిద్ధమవుతోంది. భారత అమ్మాయిల ప్రపంచకప్ విజయం సాధించడంతో డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్‌కు ప్రేక్షకాదరణ రెట్టింపయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన మెగా వేలం ఈ నెల 27న జరగనుంది. రూల్స్ ప్రకారం ప్రతి జట్టు గరిష్టంగా ఐదుగురు ప్లేయర్లను మాత్రమే రిటైన్ చేసుకోవాలి. గరిష్టంగా ముగ్గురు భారత క్యాప్డ్ ప్లేయర్లు, ఇద్దరు ఫారిన్ ప్లేయర్లు, ఇద్దరు క్యాప్డ్ ప్లేయర్లను తీసుకోవాలి. వేలం పర్స్ వాల్యూను రూ. 15 కోట్లుగా నిర్ణయించారు. అలాగే, రిటైన్ చేసుకునేవారిలో తొలి ప్లేయర్‌కు రూ. 3.5 కోట్లు, రెండో ప్లేయర్‌కు రూ. 2.5 కోట్లు, మూడో ప్లేయర్‌కు రూ. 1.75 కోట్లు, నాలుగో ప్లేయర్‌కు రూ. 1 కోటి, ఐదో ప్లేయర్‌కు రూ.50 లక్షల ధరను బీసీసీఐ నిర్ణయించింది. ఈ క్రమంలో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్‌తో పాటు గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ తమకు అవసరమున్న క్రీడాకారిణులను రిటైన్ చేసుకొని అవసరం లేనివారిని వేలంలోకి వదిలేసాయి. ఈ ఐదు ఫ్రాంచైజీల రిటెన్షన్ జాబితాలను జియో హాట్‌స్టార్ గురువారం వెల్లడించింది. ముంబై, ఆర్‌సీబీ, ఢిల్లీ ఐదుగురిని రిటైన్ చేసుకోగా, యూపీ ఒక్క ప్లేయర్‌ను అంటిపెట్టుకుంది. గుజరాత్ జెయింట్స్ ఇద్దరు ఆటగాళ్లను ఉంచేసుకుంది.



వరుసగా రెండో టీ20 గెలిచిన టీమిండియా

48 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా ఓటమి

ఆస్ట్రేలియా టీ20 సిరీస్‌లో భారత్ వరుసగా రెండో మ్యాచ్ గెలిచింది. ఓవల్ లో గురువారం నాడు జరిగిన నాలుగో టీ20లో టీమిండియా 48 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ 168 పరుగులు చేయగా, ఆస్ట్రేలియా 18.2 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో మిచెల్ మార్ష్ 30 పరుగులతో చెప్పుకోదగ్గ స్కోర్ చేయగా, మరో బ్యాటర్ మ్యాథ్యూ షార్ట్ 25 పరుగులు చేశాడు. వీరిద్దరూ మినహా మిగతా బ్యాటర్లు రాణించలేదు. భారత్ బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ మూడు, శివమ్ దూబె, అక్షర్ పటేల్ రెండేసి, బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్ తలో వికెట్ దక్కించుకున్నారు. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 167 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ 46, అభిషేక్ శర్మ 28, శివమ్ దూబే 22, సూర్యకుమార్ యాదవ్ 20 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లలో తిలక్ వర్మ ఐదు పరుగులు, జితేశ్ శర్మ మూడు పరుగులు), సుందర్ 12 పరుగులు చేశారు. ఆఖరుకు అక్షర్ పటేల్ 21 పరుగులు చేశాడు. ఆసీస్ బౌలర్లలో జంపా, ఎల్లిస్ మూడేసి, జేవియర్, స్టాయినిస్ చెరొక వికెట్ దక్కించుకున్నారు. ఈ విజయంతో 5 టీ20ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇరు జట్ల మధ్య ఐదో టీ20 మ్యాచ్ ఆదివారం జరగనుంది. తొలి టీ20 వర్షం కారణంగా రద్దు చస్త్రశారు. 168 పరుగుల లక్ష్యచేధనలో ఆసీస్ బ్యాటర్లు తడబడ్డారు. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో వరుస విరామాలలో వికెట్లు కోల్పోయారు. దూకుడుగా ఆడిన మాథ్యూ షార్ట్ (25)ను అక్షర్ పటేల్ ఔట్ చేశాడు. జోష్ ఇంగ్లీస్(12)ను అక్షర్ పటేల్ పెవిలియన్ చేర్చగా, మిచెల్ మార్ష్(30) శివమ్ దూబే ఔట్ చేశాడు. దూకుడుగా ఆడే ప్రయత్నంలో టీమ్ డేవిడ్(14) దూబే బౌలింగ్‌లో ఔటయ్యాడు.

టీ20 ప్రపంచకప్ ఫైనల్ అహ్మదాబాద్ లో

తీవ్రంగా కసరత్తు చేస్తున్న ఐసీసీ

భారత్ లో వచ్చే యేడాది ఫిబ్రవరి -మార్చిలో జరగనున్న పురుషుల టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ మన దేశంలోనే అతి పెద్దదైన అహ్మదాబాద్ నరేంద్ర మోడీ స్టేడియంలో జరుగుతుంది. ఈ మేరకు ఐసీసీ తగిన కసరత్తు చేస్తోంది. టీ20 ప్రపంచకప్ 2026 షెడ్యూల్ ను విడుదల చేసే యోచనలో ఉంది. ఈ క్రమంలోనే ఆతిథ్య దేశం అయిన భారత్ వేదికల ఎంపికపై కార్యచరణను మొదలుపెట్టింది. ఫైనల్ సహా లీగ్ మ్యాచ్‌ల కు సంబంధించిన వేదికల వివరాల ముసాయిదాను ఐసీసీకి బీసీసీఐ సమర్పించాల్సి ఉంటుంది. దీని మీద సభ్యదేశాల అభ్యంతరాలను స్వీకరించి ఐసీసీ మార్పులు చేర్పులు చేస్తుంది. ఆ తర్వాతే షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటిస్తారు. తాజా నివేదికల ప్రకారం ఫిబ్రవరి ఆరు నుంచి మార్చి ఎనిమిది వరకు టీ20 ప్రపంచకప్ జరిగే అవకాశాలు ఉన్నాయి. వేదికల జాబితాలో అహ్మదాబాద్, కోల్‌కతా, చెన్నై, ముంబై నగరాలను షార్ట్ లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఒక్కో వేదికగా ఆరు మ్యాచ్‌లు జరుగుతాయి. పాకిస్తాన్ మ్యాచ్‌లు శ్రీలంకలో జరగనున్నాయి. శ్రీలంకలోని కొలంబో, పల్లెకెలె, గాలేలో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఒకవేళ పాకిస్తాన్ ఫైనల్ చేరితే తుది పోరుకు కొలంబో ఆతిథ్యం ఇవ్వనుంది. కాగా, అహ్మదాబాద్‌లో ఫైనల్ అంటే భారత అభిమానులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇదే వేదికగా జరిగిన పురుషుల వన్డే ప్రపంచకప్ 2023లో భారత్ ఓడింది. ఓటమెరుగని జట్టుగా ఫైనల్ చేరిన భారత్ ఫైనల్ లో ఆసీస్ చేతిలో మాత్రం ఓడింది. ముంబైలో తుది పోరు నిర్వహించాలనేది అభిమానుల కోరికగా ఉంది.

సురేశ్ రైనా, శిఖర్ ధావన్ ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

ఇప్పటికే ఈ ఇద్దరు క్రీడాకారులు విచారణకు హాజరు

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో భారత క్రికెట్ వెటరన్ క్రీడాకారులు సురేశ్ రైనా, శిఖర్ ధావన్ ఆస్తులను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ఇదే కేసులో రైనా, ధావన్ ఈడీ విచారణకు కూడా హాజరయ్యారు. ఈ ఇద్దరు క్రీడాకారులు '1xBet' అనే ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించారు. ఈ అక్రమ బెట్టింగ్ యాప్‌లు అనేక మందిని దోచుకున్నాయని విచారణలో తేలింది. పెట్టుబడిదారులు మోసం చేసి రూ. కోట్లు పన్నులు ఎగవేసారని తేలింది. అందుకే గతంలోనే ఈ ఇద్దరికీ ఈడీ సమన్లు జారీ చేసి, విచారించింది. అక్రమ బెట్టింగ్ యాప్ 1xBetకు ధావన్ ప్రమోషన్స్ చేస్తూనే భాగస్వామిగా ఉన్నాడని ఈడీ అనుమానిస్తోంది. ఈ బెట్టింగ్ యాప్‌తో ధావన్‌కు ఏం సంబంధం అనే కోణంలో విచారణ చేపట్టింది. ఇందులో భాగంగానే గత సెప్టెంబర్‌లో ఈడీ విచారించి, వాంగ్మూలాన్ని రికార్డ్ చేసింది. అటు బెట్టింగ్ యాప్‌స్‌ను ప్రమోట్ చేశాడన్న అభియోగాలపై రైనాను కూడా ఇప్పటికే 8 గంటలకు పైగా విచారించింది. అతడికి కూడా బెట్టింగ్ యాప్స్‌లో షేర్ ఉందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. గత 18 యేండ్లు ఈ కంపెనీ బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వివిధ స్పోర్ట్స్ ఈవెంట్లపై బెట్టింగ్ వేస్తే భారీ మొత్తం గెలుచుకోవచ్చని ఆశ చూపిస్తోంది. ఈ ఆటగాళ్ల నుంచి యాప్‌కు సంబంధించిన లావాదేవీలు, ఆర్థిక కార్యకలాపాల గురించి ఈడీ సమాచారాన్ని సేకరించింది. ప్రస్తుతానికైతే ఈ ఇద్దరూ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

థియేటర్లలో 'ఫంకీ'

నవ్వుల తుఫాను

2026 ఏప్రిల్ 3న రిలీజ్

వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయకుడు విశ్వక్ సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఫంకీ'. ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్ర విడుదల తేదీ వచ్చేసింది. ఇటీవల విడుదలైన టీజర్‌కు ప్రేక్షకులు ఇచ్చిన అద్భుతమైన స్పందనతో ఉత్సాహంలో ఉన్న 'ఫంకీ' చిత్ర బృందం, ఈ సినిమాను 2026 ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తాజాగా ప్రకటించింది. టీజర్‌తో వినోదాల విందుకి హామీ ఇచ్చిన ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. 'ఫంకీ' సినిమా కోసం స్వచ్ఛమైన వినోదాన్ని అందిస్తూ, ప్రేక్షకులను నవ్వులతో ముంచెత్తే అద్భుతమైన బృందం ఒకచోట చేరింది. దర్శకుడు కె.వి. అనుదీప్ తన శైలి కామెడీ విందుతో తిరిగి వచ్చారు. అనుదీప్ దర్శకత్వం అంటే వినోదం ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. 'జాతిరత్నాలు' సినిమాతో సంచలనాలు సృష్టించిన ఆయన.. మరోసారి విభిన్నమైన కథాంశం, కట్టిపడేసే హాస్యంతో ప్రేక్షకుల మనసు దోచుకోనున్నారు. 'ఫంకీ' చిత్రంలో విశ్వక్ సేన్ సినీ దర్శకుడి పాత్రను పోషిస్తుండటం విశేషం. ఇప్పటికే టీజర్‌లో ఆయన నటన, ఎనర్జీ, కామెడీ టైమింగ్ కి ప్రశంసల వర్షం కురిసింది. ఈ సినిమాలో కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నారు. టీజర్ లో తన అందంతో కట్టిపడేశారు. తెరపై విశ్వక్‌కయాదు జోడి కొత్తగా, అందంగా కనిపిస్తూ.. యువత మనసు దోచుకుంటోంది. అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా 'ఫంకీ' చిత్రం ప్రేక్షకులకు నవ్వుల విందుని అందిస్తుందని చిత్ర బృందం హామీ ఇచ్చింది.

#Thalaivar 173

అనౌన్స్‌మెంట్

సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా, కమల్ హాసన్ నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ పతాకం బ్యానర్ పై భారత సినీ రంగంలో మైలురాయిగా నిలిచే మహత్తరమైన ప్రాజెక్ట్ ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి సుందర్ సి దర్శకత్వం వహిస్తున్నారు. ఇది ఇద్దరు మహానటుల మధ్య ఐదు దశాబ్దాల స్నేహం, సహోదర బంధాన్ని సెలబ్రేట్ చేసుకునే బిగ్ సినిమాటిక్ ఈవెంట్. రజనీకాంత్-కమల్ హాసన్‌ల అనుబంధం తరతరాల కళాకారులకు, ప్రేక్షకులకు స్ఫూర్తినిస్తుంది. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ 44 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పురస్కరించుకొని రూపొందుతున్న #Thalaivar173 సూపర్‌స్టార్ రజనీకాంత్ మాగ్నటిక్ స్క్రీన్ పవర్, సుందర్ సి డైరెక్షన్ కలిపి ప్రేక్షకులకు విశేషమైన అనుభూతిని అందించబోతుంది. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం రెడ్ జెయింట్ మూవీస్ ద్వారా పొంగల్ 2027 సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానుంది.

'ఆర్యన్' తెలుగు ఆడియన్స్‌కి నచ్చుతుంది

ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ లో హీరో విష్ణు విశాల్

విష్ణు విశాల్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఆర్యన్', ప్రవీణ్ కె దర్శకత్వంలో విష్ణు విశాల్ స్టూడియోజ్, శుభ్రా, ఆర్యన్ రమేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రేష్ట్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ సినిమాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో విడుదల చేయనున్నారు. ఇప్పటికే తమిళ్ లో విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ సక్సెస్ ని అందుకుంది. నవంబర్ 7న తెలుగులో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ లో హీరో విష్ణు విశాల్ మాట్లాడుతూ.. "తెలుగు ఆడియన్స్ అందరికీ నా హృదయపూర్వక నమస్కారం. మీరు నా సినిమాలు రాక్షసన్, ఎఫ్ఐఆర్, మట్టి కుస్తీ చాలా ప్రేమతో సపోర్ట్ చేశారు. రాక్షసన్ స్ట్రాంగ్ థ్రిల్లర్. ఎఫ్ఐఆర్ యాక్షన్ ఎమోషనల్ జర్నీ. మట్టి కుస్తీ ఫన్ ఎంటర్టైనర్. ఇప్పుడు ఆర్యన్ తో మళ్ళీ మీ ముందుకు వస్తున్నాను. యూనిక్ థ్రిల్లర్ ఎక్స్పీరియన్స్ ఉంటుంది. తెలుగు ఆడియన్స్ నాకు ఎప్పుడు చాలా గొప్ప ప్రేమను అందించారు. మీకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇలాంటి సినిమా చేయడం చాలా చాలెంజింగ్. తప్పకుండా ఆడియన్స్ కి సీట్ ఎడ్జ్ ఎక్స్పీరియన్స్ ఉంటుంది. ఈ సినిమా తమిళ్ లో చాలా అద్భుతమైన విజయాన్ని సాధించింది. తెలుగు ఆడియన్స్ కూడా ఈ సినిమా నచ్చుతుందని కోరుకుంటున్నాను. డిస్ట్రిబ్యూటర్స్ శ్రేష్ఠ మూవీస్ సుధాకర్ గారికి, మా ఫ్రెండ్ నితిన్ గారికి థాంక్యూ. మా టీమ్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమా క్లైమాక్స్ గురించి తమిళ్ లో మిక్స్డ్ ఒపీనియన్ వచ్చింది. తెలుగులో క్లైమాక్స్ మార్చి రిలీజ్ చేస్తున్నాం ఆడియన్స్ తప్పకుండా మార్చిన క్లైమాక్స్ ని నచ్చుతుంది. నవంబర్ 7 సినిమా వస్తోంది., అందరూ సినిమాని థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను"అన్నారు.

'మఫ్తీ పోలీస్' నవంబర్ 21న రిలీజ్

యాక్షన్ కింగ్ అర్జున్, ఐశ్వర్య రాజేష్ లీడ్ రోల్స్ లో నటిస్తున్న 'మఫ్తీ పోలీస్' చిత్రాన్ని నిర్మాత జి. అరుల్ కుమార్ సమర్పణలో జి.ఎస్. ఆర్ట్స్ నిర్మిస్తోంది. నూతన దర్శకుడు దినేష్ లెట్చుమనన్ దర్శకత్వం వహించారు. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. నవంబర్ 21న సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. అర్జున్ ఇంటెన్స్ లుక్ లో కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ అదిరిపోయింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ థ్రిల్లింగ్ సన్నివేశాలతో అంచనాలను పెంచింది. ఈ చిత్రంలో బిగ్ బాస్ ఫేమ్ అభిరామి, రామ్‌కుమార్, జి.కె. రెడ్డి, పి.ఎల్. తేనప్పన్, లోగు, వేల రామమూర్తి, తంగదురై, ప్రాంక్‌స్టర్ రాహుల్, ఓ.ఎ.కె. సుందర్ తదితరులు నటించారు. శరవణన్ అభిమన్యు సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, ఆశివాగన్ సంగీతం అందిస్తున్నారు.

'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'

ఇప్పటి వరకు ఇండియన్ స్క్రీన్ మీద చూసి ఉండరు

రుక్మిణి వసంత్

ఇండియన్ సినిమా హద్దుల్ని చెరిపేసి, అంతర్జాతీయ స్థాయిలో మన సత్తాను చాటేందుకు రాకింగ్ స్టార్ యష్ ప్రస్తుతం 'టాక్సిక్ ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్' పనుల్లో బిజీగా ఉన్నారు. యాక్షన్‌ప్యాక్డ్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం మార్చి 19, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశ బెంగళూరులో జరుగుతోంది. నూతన సంవత్సరం సందర్భంగా జనవరిలో భారీ ఎత్తున ప్రచార కార్యక్రమాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. వచ్చే ఏడాది రిలీజ్ కానున్న చిత్రాల్లో ఆడియెన్స్ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్‌ల్లో 'టాక్సిక్' ఒకటిగా నిలుస్తుంది. క్రేజీ అండ్ సెన్సేషనల్ హీరోయిన్ రుక్మిణి వసంత్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో జరిగిన చిట్ చాట్‌లో 'టాక్సిక్' గురించి ఆమె ప్రస్తావించారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం పట్ల రుక్మిణి వసంత్ తన ఉత్సాహంగా ఉన్నానంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆమె మాటల్లో చెప్పాలంటే.. ''టాక్సిక్' అనేది ఇప్పటివరకు కన్నడ లేదా భారతీయ సినిమాల్లో మనం చూసిన వాటన్నంటికంటే భిన్నంగా ఉంటుంది. ఇది రా అండ్ రస్టిక్‌గా ఎన్నో లేయర్స్‌తో అద్భుతంగా ఉండబోతోంది. దర్శకురాలు గీతు విజన్ ఎంతో బోల్డ్‌గా ఉంటూనే.. అదే సమయంలో ఎంతో హృద్యంగానూ ఉంటుంది' అంటూ రుక్మిణి చెప్పిన మాటలతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. కన్నడ, ఆంగ్ల భాషలలో చిత్రీకరించబడుతున్న ఈ భారీ సినిమా తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషలలో అనువాదం చేసిన రిలీజ్ చేస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ, యష్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్' చిత్రానికి అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన మేకర్ గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. సన్‌డాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జాతీయ అవార్డు, గ్లోబల్ ఫిల్మ్ మేకింగ్ అవార్డుతో సహా అనేక ప్రశంసలను అందుకున్న గీతు మోహన్‌దాస్ మరోసారి వండర్ ఫుల్ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200